కొండగాలి కొత్తజీవితం





కొండగాలి

ఆత్మనియస్

కొత్తజీవితం

కథలు



"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో 1979

అనువాదం: నిడమర్తి ఉమారాజేశ్వరరావు

"కేశవ్‌గోపాల్"

ముఖచిత్రం: ఎ. స్లేపిషెవ్

МЫ И НАШИ ГОРЫ

Современная армянская новелла

на языке телугу

పాఠకులకు మనవి

ఈ పుస్తకం గురించి, దాని అనువాదం గురించి మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈ కింది చిరునామాకు పంపండి:

Progress Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR

© సంకలనం, తెలుగు అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1979

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

M $\frac{70500—869}{014(01)—79}$ 813—79

4701080200

ఇందులో

రాఫయేల్ అరమ్యాన్ 7

కడవ భుజానపెట్టి నీటికెళ్లిను పడతి. అను: విడమర్తి ఉమారాజేశ్వరరావు 8

మారేన్ ఐవజ్యాన్ 22

గరుడ పర్వతం పైన. అను: విడమర్తి ఉమారాజేశ్వరరావు . . 23

రాచీయ కొచార్ 34

జీవితేచ్ఛ. అను: విడమర్తి ఉమారాజేశ్వరరావు 35

విగేన్ హెచుమ్యాన్ 43

వంతెన. అను: విడమర్తి ఉమారాజేశ్వరరావు 44

సెరో ఖాంజాద్యాన్ 66

తెల్ల గొర్రెపిల్ల. అను: విడమర్తి ఉమారాజేశ్వరరావు 67

వార్డ్గేస్ పెత్రొస్యాన్ 75

గుడ్ మార్నింగ్ జాక్! అను: విడమర్తి ఉమారాజేశ్వరరావు . . 76

గ్రాంత్ మాతెవోస్యాన్ 94

ఆకుపచ్చ లోయ. అను: "కేశవ్‌గోపాల్" 95

అచీగ్ అవాక్యాన్ 102

చరమ దశ. అను: విడమర్తి ఉమారాజేశ్వరరావు 103

నొరైర్ అదాల్యాన్ 120

ఒంటెలు వెళ్లిపోతాయి, పర్వతాలు ఉండిపోతాయి. అను: విడమర్తి
ఉమారాజేశ్వరరావు 121

రాఫయేల్ అరమ్యాన్

రాఫయేల్ అరమ్యాన్ ఎచ్మియాజీన్‌లో 1921లో జన్మించాడు. తండ్రి ఒక ఆఫీసు ఉద్యోగి. యుద్ధ కాలంలో ఎరెవాన్ విశ్వవిద్యాలయం నుంచి పట్టా పుచ్చుకున్నాడు (1942లో). అదే సంవత్సరం యుద్ధరంగానికెళ్లాడు. యుద్ధానంతరం తన రచనలు ప్రచురించ నారంభించాడు.

ఆయన తొలి కథా సంపుటి, "నా నగర వాణులు" పేర, 1946లో వెలువడింది. దీని తర్వాత ఆయన కథా సంపుటులు మరికొన్నీ, "రుబీనియన్ సోదరులు" అనే ఆయన నవలా ప్రచురింపబడ్డాయి.

అరమ్యాన్ తరచుగా తన కథలకు మేధోపరమైన యితివృత్తాలను ఎన్నుకొంటాడు. మానవుల మానసికోద్వేగాల పట్లా, ఆలోచనల పట్లా, సత్ప్రవర్తనకూ, నీతినియమాలకూ సంబంధించిన సమస్యల పట్లా ఆయనకు ఆసక్తి అధికం. "కడవ భుజాన పెట్టి నీటికె ళ్లెను పడతి" అన్న యీ కథ, ఆర్మీనియన్ స్వరకర్తా, జానపదగేయాల సంచయనకర్తా అయిన కోమితాస్‌కి అంకితం చెయ్యబడింది.

కడవ భుజానపెట్టి నీటికెళ్లెను పడతి

గుర్రం గుర్రాలసాల వాసన కొడుతోంది: బహుశా చాల కాలంగా ఆ గుర్రం పైన ఎవరూ స్వారీ చేసి ఉండరు. బాటసారి తన గుర్రాన్ని నడిపిస్తూ, తను ముందు నడుస్తున్నాడు. ఇంతలోనే ఓ గొర్రెల కాపరి అతనితో కలుసుకున్నాడు. కొత్తగా పుట్టిన గొర్రెపిల్లని అతను ఎత్తుకున్నాడు.

బాటసారి పట్టుకుచ్చు లాంటి గొర్రెపిల్ల బొచ్చును నిమురుతూ "నమస్తే. ఎక్కడికెళుతున్నావు?" అంటూ ప్రశ్నించాడు.

"నమస్తే. సారిగ్యాళ్ గ్రామాని కెళ్తున్నాను."

"మంచు కప్పిన పర్వతానికి వసంతం తెస్తున్నావా?"

"వసంతమేమిటి?! నేను తీసుకెళ్తున్నది గొర్రెపిల్ల."

"గొర్రెపిల్లే వసంతం."

ఈ వింత జవాబు పట్ల గొర్రెల కాపరి తనలో తానే నవ్వుకొని, బాటసారి వంక గుచ్చిగుచ్చి చూశాడు.

"మరి నీ సంగతేమిటి? మంచు కప్పిన పర్వతానికి నువ్వేం తెస్తున్నావు?" అని వెక్కిరింతగా అడిగాడు గొర్రెల కాపరి. బాటసారి అతని కళ్లలోని అనాచ్ఛాదితమైన వెక్కిరింతను గమనించాడు గాని కోపం తెచ్చుకోలేదు.

"ఏమీ తేవడం లేదు. పైగా, నేనిక్కణ్నుంచి కొన్నిటిని నాతో బాటు వెనక్కి తీసుకెళ్లాలనుకుంటున్నాను."

"ఏమిటి?!" గొర్రెల కాపరి స్వరంలో ఆదుర్దా వ్యక్తమైంది. "నువ్వు భూస్వాముల్లో ఒకడివా?"

"కాను."

"మరైతే నువ్వెరివి?"

"నేను పాటలు పోగుచేస్తాను."

అదేదో అవకతవక జవాబనుకున్నాడు గొర్రెల కాపరి. పాటలు పోగుచెయ్యడాన్ని గురించి ఎవరైనా ఎప్పుడైనా విన్నారా?

అతని ఆలోచనల్ని ఊహించాడా అన్నట్లు బాటసారి "అబ్బే, చెయ్యకేం" అన్నాడు. "పాటల కోసం మనం గాలించాలి. నీ మూటలో ఎన్ని పాటలు దాగివున్నాయో నీకు తెలిస్తేనా!"

"నీకు వేళాకోళం చెయ్యడమంటే యిష్టం లాగుంది. అయినా నా మూటలో ఏముంటాయని? అందులో ఉన్నవల్లా జున్ను, రొట్టె, నది ఒడ్డున పెరిగే పుదీనా ఆకూను."

బాటసారి చిరునవ్వు నవ్వాడు.

గొర్రెల కాపరి గొర్రెపిల్లని నేల మీదకి దింపి, తన మూటని విప్పసాగాడు. గొర్రెపిల్ల జవజవలాడే కాళ్లతో తప్పటడుగులేస్తోంది. వన మంతం ఎంతో తాజాగా, శోభాయమానంగా ఉంది! మెత్తని, జరీపోగుల్లాంటి గడ్డి ఏ మాత్రం గాలి వీచినా ఊగిసలాడుతోంది. గొర్రెపిల్ల తన కాళ్ళు జాపి, తన చిన్నారి తలను వంచి తన గిట్టల క్రింద వున్న గడ్డిని నోటికి పరిపడ కొరికింది.

"కూర్చో. పారిగ్యూళ్ దాకా మనం కలిసే వెడతాం" అన్నాడు గొర్రెల కాపరి. "జున్నూ, పుదీనా ఆకూ తీసుకుందాం, రా."

సాయంత్రం వేళకి వాళ్ళు పారిగ్యూళ్ చేరుకున్నారు. వాళ్ళు నడిచే పైకెక్కారు. గొర్రెపిల్ల చిన్నారి తెల్ల తల గుర్రపు జీనుకి కట్టిన మూటలోంచి పైకి తొంగి చూస్తోంది. సరిగా గ్రామం ముందు కొచ్చేసరికి వాళ్ల త్రోవకి ఓ గొర్రెల మంద అడ్డొచ్చింది. గొర్రెపిల్ల మే–మే అంటూ జాలి గొలిపేలా అరిచింది. మంద ముందుకు సాగి పోయింది. కాని ఒక ఆడగొర్రె మాత్రం ఆగి, చుట్టూ గాభరాగా చూసి తను కూడా అరిచింది.

"బిడ్డను కోల్పోయిన తల్లి మాత్రమే అనాథ ఆక్రందనకి మారుపలుకుతుంది."

"ఔను" అంటూ గొర్రెల కాపరి తన ఆమోదం తెలిపాడు. "అదెప్పుడూ అంతే, ముందు కూడా ఎప్పుడూ అలాగే ఉంటుంది. అయితే మీరు పాటల కోసం వెతుకుతున్నారన్న మాట?" అకస్మాత్తుగా అడిగాడతను. ఈమారతని స్వరంలో ఆశ్చర్యం గాని వెటకారం గాని లేదు. రోడ్డు మలుపుతిరిగిన చోట గోడరాతితో కట్టబడిన యింటి

కేసి చూపించి, "చూశావా ఆ యిల్లు" అన్నాడు గొర్రెల కాపరి. "ఆ యింట్లోవాళ్లు తమ దేశసంచారి తిరిగి ఎప్పుడొస్తాడా అని ఎదురుచూస్తున్నారు. వేళ తప్పి వచ్చే బాటసారులకు రాత్రి పూట బస యిచ్చేందుకు వీలుగా వాళ్లు తమ యింటిని కూడా రోడ్డువార కట్టుకున్నారు. ముసలామె కొడుకు దేశాంతరం వెళ్లాడు. అందుకని ఆమె తన కోడలితో: 'విదేశాల్లో మన సంచారి కెప్పుడూ స్వాగతం లభించేందుకు గాను బాటసారు లకు మన యింటి తలుపు లెప్పుడూ తెరిచి ఉంచాలి' అని చెప్పింది."

గొర్రెల కాపరి తన మూటను జీనువించి ఊడదీసి తన భుజాన వేసుకున్నాడు. తర్వాత తన తోటి బాటసారి దగ్గర సెలవు తీసుకుని, సారిగ్యాళ్ దిశగా తరలిపోయాడు. చాల సేపు బాటసారి సంధ్య చీకటిలో తెల్లని చుక్కలా కనిపించే గొర్రెపిల్ల తల వంక దీక్షగా చూస్తూ, జాలిగొలిపే దాని అరుపును వింటూ నిలబడ్డాడు. ఆటు తర్వాత మళ్లీ మరోసారి తన పిల్లను కోల్పోయిన ఆడగొర్రె, గొర్రెపిల్ల విలాపస్వరానికి బదులు పలకడం వినవచ్చింది.

ఊరి చివరనున్న రాతిగోడల యింట్లో బాటసారి ఆ రాత్రి బసచేశాడు. అతని గుర్రాన్ని సాలలో కట్టారు. ముసలామె కోడళ్లు అతనికి నీళ్లు తెచ్చిపెట్టారు. అతను కాళ్లూ, చేతులూ, ముఖం కడుక్కున్నాక ముసలామె మీకు పక్క ఎక్కడ వెయ్యమంటారని బాటసారిని ప్రశ్నించింది.

"మిద్దె పైన."

"ఆయన అక్కడ కావాలంటే అక్కడే వెయ్యండర్రా" కోడళ్లతో అంది ముసలామె.

"పరుపూ గిట్టా ఏమీ అక్కర్లేదు. నా కొంచెం గడ్డి తెచ్చిపెట్టండి. గడ్డి మీద పడుకోవడం నాకిష్టం."

ముసలామె అతని వంక విస్సారపడి చూసింది. "అతిథికి మాసిన దుప్పట్లిచ్చే ఆర్మీనియన్ కుటుంబం గురించి మీరెక్కడైనా విన్నారా?" అన్నప్పుడు ఆమె స్వరంలో ఆమె మనస్సు చివుక్కుమన్న చిన్నె కనిపించింది.

శుభ్రంగా మడతలు పెట్టి వున్న దుప్పట్లను వరుసగా ఒక దాని తర్వాత మరొకటి వెనక్కు విసిరిందామె. అందులో ఒకటి కళ్లు మిరుమిట్లు గొలిపే బాదంకాయ ఆకారపు డిజైనుతో ప్రాచ్య దేశాల దేవతా కథలా ఉంది. బాదంకాయలూ, ఖర్జూరాలూ మెరుస్తున్న కళ్లంపై విరజిమ్మినట్లుందా దృశ్యం. బాటసారి ఆ దుప్పటిని మతారంగా తడిమాడు. తన బాల్యంలో తనకి సరిగా యిలాంటి మెరిసే దుప్పటే ఉండేది. సప్తవర్ణ సంశోభితమైన ఆ దుప్పటి కేసి ఎంత సేపు చూసినా అతనికి తనివి తీరేది కాదు. ఆ డిజైనులో అతనికేదో సంగీతం వినిపించేది. దాని మడతల లోపల

నుంచీ, బయట నుంచీ ఏర్పడిన సవాలక్ష బాటల మధ్య తలాకల్లాంటి యువకులూ, బాదంకాయల్లాంటి కళ్ళు గల అమ్మాయిలూ అతనికి కనిపించేవారు....

ఆ తర్వాత, ఎచ్మియాజీన్ మఠం ప్రాకారం బయట అతనికి, టర్కిష్ ఊచకోత నించి తప్పించుకొచ్చిన తన స్వగ్రామస్తులు కనిపించారు. అప్పుడా దురదృష్టవంతులైన కాందిశీకుల భుజాల చుట్టూ మళ్ళీ యీ దుప్పట్లను అతను చూశాడు. కాని ఆ బాదంకాయ డిజైన్ల కట్టు కథలో భాగంగా అతని కిప్పుడు కనిపించలేదు. అందుకు బదులుగా వాటిని చూస్తూంటే టర్కిష్ సైనికుల కాలి బూట్ల గుర్తులూ, తన హృదయాన్ని, తన మాతృదేశ హృదయాన్ని మట్టుపెట్టేందుకు సిద్ధంగా ఉన్న టర్కిష్ సైనికుల బూట్ల గుర్తులూ అతనికి జ్ఞాపకం వచ్చాయి.

ఆ పాపిష్ఠి బూట్ల గుర్తులను చెరిపెయ్యడానికా అన్నట్లు అతనా దుప్పటి పైన తన చేతిని మళ్ళీ రాశాడు.

"మీకు నా మాట మీద నమ్మకం లేదా?" ముసలామె స్వరంలో కించపడిన జీర వినిపించింది.

"నమ్మకం లేకపోవడమేమిటి, ఉంది. నాకు పరుపు మీద పడుకోవడం అలవాటు లేదు, అంతకన్న మరేం లేదు."

"మీ యిష్టమొచ్చినట్లే కానివ్వండి. మా కోడళ్ళు మీకు పట్టిగడ్డి తెచ్చిపెడతారు."

యువతులు గది విడిచివెళ్ళారు. ఎటు చూసినా నిశ్శబ్దం ఆవరించి వుంది. ఓ మూల కీచురాయి కీచుకీచుమంటోంది. పై కప్పులోని గుండ్రని కన్నంలోంచి లోపలకి పడుతున్న వెన్నెల కాంతిలో ఒక ఎలుక అటూ యిటూ పరిగెత్తడం కనిపించింది.

ముసలామె అతిథిని సంజ్ఞచేసి పిలిచి, భోజనానికి కూర్చోమని ఆహ్వానించింది. ఆమె రొట్టె, పుల్లమజ్జిగ పులుసూ, గోధుమ అన్నం అతని ముందుంచింది.

"మీరు ఏ ఊరు నుంచి వస్తున్నారు? మీరెవరు? మీ నాయన గారి పేరేమిటి?" అని ప్రశ్నించింది ముసలామె.

బాటసారి రొట్టె విరిచి మెల్లగా పులుసు దొన్నెలో ఉంచాడు.

అతను పులుసును చెమ్చాతో కదుపుతూ, "నేను ఆర్మీనియన్ని" అని చెప్పాడు.

"అది తెలుస్తూనే వుంది."

"మాది కుటయీ గ్రామం. గెవోర్గ్, టకుయీ సాగొమొన్యాన్‌ల కొడుకుని. నేను మఠాధిపతిని. నా పేరు కోమితాస్."

పులుసు కదుపుతూ, నిరుత్సాహంగా, ఉదాసీనంగా అతను చెప్పిన తీరు చూసి, ముసలామె అతని వంక అపనమ్మకంగా చూసింది.

"గాను కూడా నేనుకోని నువ్వేం మఠాధిపతి వయ్యా!" అంది ముసలామె.

"నేనిక్కడికి బోధించేందుకు రాలేదు. నేను పాటలు పోగుచేస్తున్నాను."

"ఇతను నిజం చెప్పడం లేదు" అనుకుంది ముసలామె.

"పాట లేమీ గోధుమల్లాంటివి కావు పోగుచేసుకోవడానికి" అతని వంక నిశితంగా చూస్తూ అంది ముసలామె.

అతను కోపగించుకోలేదు. ఆవిడని నమ్మించాలని కూడా ప్రయత్నించలేదు. తింటూ కూర్చున్నాడు.

ఉన్నట్లుండి "మీరు నిజంగా మఠాధిపతే అయితే వా కొడుక్కోసం ప్రార్థన చెయ్యండి" అందామె.

కోమితాస్ తన తల పైకెత్తాడు. చెంచాను దొన్నె అంచు మీద ఉంచాడు. ముసలి తల్లి కళ్లు నీళ్లతో నిండాయి. అవి యిప్పుడు ఆమె బుగ్గల వెంట ధారలుగా కారుతున్నాయి.

"వాడు పరాయి దేశంలో వున్నాడు, వాడి దగ్గర్నుంచి జాడా జాబూ లేదు." ఆమె స్వరం డగ్గుత్తిక చెందింది. "వాడి కోసం కళ్లు కాయలు కాసేలా చూసిచూసి నా కోడలు బక్కచిక్కి పోతోంది. కడవ భుజాన పెట్టుకొని కొండపైన వున్న బుగ్గ దగ్గర కెళ్లి, రోడ్డు వంక చూస్తూ గంటల తరబడి అక్కడ కూర్చుంటుంది."

కర్ర చెమ్చా నెమ్మదిగా దొన్నెలో మునిగింది.

"ఎక్కడున్నాడతను?"

"బాకూ నుంచి ఒక ఉత్తరం వచ్చింది. మతగురువు నాకా ఉత్తరం చదివి వినిపించారు. అందులో తను ఆకురాలు కాలంలో యింటికి తిరిగి వస్తున్నట్లు రాశాడు. కాని ఆకురాలు కాలం వచ్చింది, దాని తర్వాత శీతకాలం వచ్చింది, ఆటు తర్వాత వసంతం వచ్చింది. అయినా వాడింకా రాలేదు."

ఓ కన్నీటి బొట్టు ఆమె గడ్డం పైన కంపిస్తూ నిలిచింది. మఠాధిపతి తన చెంచా కోసం చూశాడు గాని అది పూర్తిగా మునిగిపోయింది.

"నే నతని కోసం ప్రార్థన చేస్తాను. నాకతని పేరు చెప్పండి. నేను నాకబుచేసి మీకే సంగతీ ఉత్తరం రాస్తాను. నేనతని ఆనుపానులు కనుక్కునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాను."

"మీ తల్లి కడుపు చల్లగా అలా చెయ్యండి బాబూ. మీరు మఠాధిపతి కాకపోయినా కూడా జాబు రాయచ్చు."

"కాని నేను నిజంగానే మఠాధిపతిని. అందుకు భగవంతుడే సాక్షి."

"అయితే, రాసుకోండి: మూనాస్ కొడుకు ఆంద్రవీక్ తేక్‌మేక్‌చ్యాన్."

కోమితాస్ ఆ పేరును తన సంగీతం పుస్తకంలో రాసుకున్నాడు.

"భోజనం కానివ్వండి. లేకుంటే, మీకు నయించడం లేదా?"

"నాకు ఆకలిగా లేదు" అంటూ కోమితాస్ లేచాడు.

వాళ్ళు బయటికి కెళ్ళారు. చంద్రుడు అస్తమించాడు. నక్షత్ర ఖచితమైన ఆకాశం పర్వతాలకు బాగా వెనకగా పరుచుకుంది. మిద్దెపైన కోడళ్ళు అతని పక్క పరుస్తున్న చోట దీపం మినుకు మినుకు మంటోంది. కోమితాస్ మోకరిల్లాడు. ముసలామె కూడా అతని సరసన మోకరిల్లింది.

"పరమ దయాళువైన ప్రభూ, దేశ సంచారులందర్నీ కాపాడు" అంటూ కోమితాస్ ప్రార్థన ప్రారంభించాడు.

"తథాస్తు" అంది ముసలామె.

మినుకు మినుకుమనే దీపజ్వాల యిప్పుడు కోడళ్ళు లేవడంతో కదులుతోంది. అందులో ఒకామె దీపం చేతబట్టి దోవ చూపుతోంది. ఆ దీపం మినుకు మినుకుమనే మరో నక్షత్రంలా కనిపిస్తోంది. కానైతే, ఆమె నిచ్చెనమెట్లు దిగి, దీపాన్ని వాళ్ళ దగ్గరకు తెచ్చింది, నక్షత్రాలు మాత్రం ఎక్కడో పైనే ఉండిపోయాయి.

చంచల కాంతిలో స్పష్టంగా కానవస్తున్న ఆ యువతి ముఖం, చుట్టూ ఉన్న చీకటిలో చెక్కినట్లు కాన వస్తోంది. ఆమె కళ్ళు నల్లగా ఉన్నాయి, కనుబొమలు విల్లుల్లా వంగి ఉన్నాయి, బుగ్గల్లో సొట్టలున్నాయి.

"మీరు ఎవరి కోసం ప్రార్థిస్తున్నారు?" అని ప్రశ్నించిందామె.

"లోపలికెళ్ళు. అది నీకు అనవసరం" అంది ముసలామె.

"పరమ దయాళువైన ప్రభూ, దేశ సంచారులందర్నీ కాపాడు!" కోమితాస్ మళ్ళీ ప్రార్థించాడు.

"ప్రభువు మీ ప్రార్థనలు చెవిన పెట్టడు. మీ మాట ఆయనకెన్నడూ వినిపించదు" అంది యువతి. ఆమె కళ్ళలోని వ్యంగ్యం అతను చూడగలిగాడు. "ఆయనగారు యింతకు ముందు ఏ ఒక్కరి మొర వినలేదు. ఇప్పుడు మీ ప్రార్థనా ఆయన వినిపించుకోడు."

"ఇంట్లోకి పో" ఆమె అత్తగారు నుతిమెత్తగానే అయినా మదృఢంగా చెప్పింది. "ప్రభువు సమస్తం వింటాడు, అలాగే మేరీమాత కూడా వింటుంది."

"మీరెందుకు వృథాగా దేవుడికి మొరపెట్టుకుంటారు? ఆయన అంత మంచివాడే అయితే తన భార్య నెన్నడూ అలా బాధ పడనిచ్చేవాడు కాదు. ఆమె నుండి ఆమె కొడుకు నెన్నడూ దూరం చేసి ఉండేవాడు కాదు."

"మేరీమాతని గురించి అలా మాట్లాడటం పాపం, కళ్ళు పోతాయి. మేరీమాత ఎన్నడూ భార్య కాదు. దేవుడు మనల్ని మన్నించు గాక."

"ఆ లెక్కన నేను మాత్రం భార్యనా? అంద్రనీక్ దేశాంతరం పోయాడు. మీ భగవంతుడు అంత దయామయుడే కనక అయితే, ఆయనగారు భర్తతో పని లేకుండా, నాకో బిడ్డ నెందుకివ్వడు? లేకపోతే మేరీ కన్య నాకంటె అందమైనదా?"

కోమితాస్ ఆమె వంక కన్నార్పకుండా తేరిపార జూశాడు.

నల్లని ఆకాశపు భూమికలో, దీప కాంతితో జ్వలితమైన ఆమె శిరస్సును కాంతి పరివేషం చుట్టినట్లు కనిపించింది. కాంతివంతమైన ఆమె జుట్టు అగ్ని జ్వాలలెగజిమ్ము తున్నట్లుంది. ఆమె కనుబొమల క్రింద నల్లని నీడలున్నాయి. ఆమె నల్లని కళ్లలో దీపకాంతి ప్రతిఫలిస్తోంది, ఆమె బుగ్గసొట్టలిప్పుడు ఒకమారు వెలుగుతోను, మరొక మారు చీకటితోను నిండుతున్నాయి. చీకటిలో ఆమె పై పెదవి మీద బంగరువన్నె నూగు మెరుస్తోంది.

"మన వరుసు తీసేశావు కదే. పద పద యింట్లోకి" ఆ యువతి చెయ్యి పట్టుకొని అంది ముసలామె.

ఇప్పుడిక ఒంటరిగా వున్న కోమితాస్ ఆకాశం వంక చూడ నారంభించాడు. తమ యిళ్ళవాకిళ్లనీ, తమ జన్మభూమినీ శాశ్వతంగా విడిచిపెట్టి వెళ్లిపోయిన దేశ దిమ్మరులను గురించి అతను ఆలోచిస్తున్నాడు. చుట్టూ ఎక్కడ చూసినా సమస్తం నిశ్శబ్దంగా శాంతంగా ఉంది. అయినా ఎవరో, "ఆర్మీనియన్లారా, మీ దేశం విడిచి పోకండి! మన మాతృదేశం చిన్నదని ఎవరన్నారు? వీరులైన పుత్రు లున్నారంతే గాని ఏ మాతృదేశమూ చిన్నది కాదు. ఆర్మీనియన్లారా, మీ గృహాలు విడిచిపోకండి! వినర్జిత గృహాన్ని తనకు నివాసం చేసుకుంటాడే గాని, విజేత ఎన్నడూ శిథిలాల మధ్య నివ సించడు" అని ఎవరో అరుస్తున్నట్ల వినిపించిందతనికి.

ఒక ఆవు అరుపు, దూరాన ఎక్కడో ఓ కుక్క మొరిగిన శబ్దం వినపోయించి, ముందు లాగే సర్వత్రా నిశ్శబ్దం ఆవరించింది.

ఒంటరిగా ఉన్నప్పుడు, తరచుగా అతను తనలో తనే మాట్లాడుకొంటూ ఉంటాడు. అటువంటి సమయాల్లో సన్నని పాలిపోయిన అతని ముఖం ఆలోచనాపూరిత మవుతుంది, అతని కళ్లు మరింత లోతుకు కూరుకుపోయినట్లుంటాయి, తన పెదవుల నతను గట్టిగా అదిమిపెడతాడేమో, అవి నీలంగా మారుతాయి. అతనలా ఆలోచనల్లో లోకం మరచి పోతాడు. అటు తర్వాత అతనిలో ఆశ తిరిగి రేకెత్తుతుంది, అతను తనలో తనే నవ్వుకుంటాడు. అటువంటి తరుణాల్లో జనం మఠాధిపతి వంక ఆశ్చర్యంగా

చూస్తూండేవారు. కోమితాన్ అలాంటప్పుడు మానసికంగా వాళ్ల నుద్దేశించి "నేను దిగులుగా కనిపించినప్పుడు మీరు ఆశ్చర్యపడరు, మీరూరికే 'ఏదో జరిగి వుంటుందిలే' అంటారు. కాని, నేను నా ఆలోచనల పట్ల చిరునవ్వు నవ్వగానే మీరు దిగ్భ్రమ చెందు తారు. ఓ నా ప్రజలారా, ఒక్క సంతోషానికి మినహాయించి, మీరు మిగిలిన అన్నింటికీ అలవాటు పడ్డారు." ఇలా అనేక ఆలోచనలు అతని మనస్సును ముసిరాయి. కోమితాన్ యింటి దిశగా వెళ్లాడు. ముసలామె గుమ్మంలో నిలబడి వుంది.

"ఆమెను మరీ తీవ్రంగా తప్పు పట్టకండి. ఆమె యింకా చిన్న పిల్ల, భగవంతుడు తనని వదిలేశాడన్న బాధలో ఉంది. నా కొడుకు పైనా, కోడలు పైనా భగవంతుడు తన కృపాకటాక్షం బరవు గాక. వాడి కోసం మీరు ప్రార్థన చేస్తారా గురువుగారూ?"

కోమితాన్ గుమ్మం పక్క మోకరిల్లాడు గాని, ప్రార్థన చెయ్యలేదు. అతను ఆకాశం వంక నిశ్శబ్దంగా తేరిపార జూశాడు, అతని ఆలోచనలు భగవంతుని పైకి కాక, తన దేశ ప్రజల పైకి వెళ్లాయి. ముసలామె మాత్రం మధ్య మధ్య "తథాస్తు" అంటూనే వుంది. కాని అతనామె మాట విన్నట్లు కనిపించలేదు.

...అతను ఉలికిపాటుతో వాస్తవ లోకంలోకి వచ్చాడు.

"తథాస్తు" అంటోంది ముసలామె.

"తథాస్తు" అని రెట్టించాడతను.

వాళ్లు లేచి నిలబడ్డారు.

"ఇంతకీ మీరిక్కడికి పాటలు పోగుచెయ్యడాని కొచ్చానంటారు? నా కోడళ్లు పాటలు పాడరు. వాళ్లు బిడియస్థులు. ఒక వేళ ఏ కూరాకులు ఏరడాని కెళ్లినప్పుడో, పాడుకుంటారేమో, లేకపోతే రాత్రి పూట అందరూ నిద్ర పోయినప్పుడు లోలోపల పాడుకుంటారేమో."

కోడళ్లలో ఒకామె దీపం పట్టు కెళ్తోంది.

"గురువుగారిని జాగ్రత్తగా పైకి తీసికెళ్ళు" అంది ముసలామె.

కోడలు దీపం చూపిస్తూ కొయ్యమెట్ల మీదుగా పైకెళ్లింది.

ఆమె వెనకే మెట్లెక్కుతూ "నీకు పాటలొచ్చా?" అని ప్రశ్నించాడు కోమితాన్.

జవాబు రాలేదు.

"నీ పేరేమిటి?"

అప్పటికీ జవాబు రాలేదు.

"మీరు పాడితే వినాలని నాకెంతో కుతూహలంగా ఉంది."

ఆమె దీపం మిద్దె మీద పెట్టేసి, హడావిడిగా కిందకి దిగిపోయింది మళ్లీ.

దొడ్లో నిలబడ్డ తన తోటి కోడళ్లతో ఏదో గుసగుసలాడింది. వాళ్ళు నోటికి జేబు రుమాళ్ళు అడ్డం పెట్టుకొని లోలోపల నవ్వుకోవడం అతనికి వినిపించింది.

"నీకు భర్త ఉన్నాడని నువ్వు చెప్పాల్సింది. దేశాంతరం వెళ్ళిపోయి తిరిగిరానిది ఏరిక్నాజ్ మొగుడని నువ్వు చెప్పిఉండాల్సింది."

"దాన్ని గురించి అలాంటి మాటలనకు."

"ఏం, ఎందుకనకూడదు? అది కడవ భుజాన పెట్టుకుని కొండ మీది కెళ్లి బుగ్గ పక్క కూర్చుంటుంది. ఆంద్రనిక్ కోసం తను వెయ్యి కళ్లతో వేచి చూస్తున్నా నంటుంది. దానికి మేరీమాత అన్నా నమ్మకం లేదు, క్రీస్తు దేవుడన్నా నమ్మకం లేదు."

కోమితాస్‌కి వాళ్ల పట్ల కోపం కలగలేదు. ఏరిక్నాజ్ పట్ల అతనికి జాలి కలిగింది.

కోడళ్లలో ఒకామె "దీపం కోసం ఏరిక్నాజ్‌ని పైకి పంపు" అంది, మిగిలిన వాళ్ళు నవ్వారు. వాళ్ల నవ్వు గుమ్మం దగ్గరకి కదిలింది. తలుపు తెరుచుకుంది, నలు చదరంగా కాంతి కనిపించి, చటుక్కున మాయమైంది, తర్వాత అంతా నిశ్శబ్దం.

కోమితాస్ తల కింద చేతులు పెట్టుకొని వెల్లకిల పడుకున్నాడు. పట్టిగడ్డి సువాసన అతన్ని చుట్టుముట్టింది. నిద్ర రావడంలేదు. పాట వినిపిస్తుందేమో నన్న ఆశతో చెవులు దోరపెట్టుకొని విన సాగాడు. ఏమో ఎవరు చెప్పగలరు, ఆలస్యంగా వెళ్తున్న బాటసారి, తన బిడ్డను ఉయ్యాలలో పడుకోబెట్టి ఊపుతున్న తల్లి, లేక ప్రేమికురాలు, ఎవరో ఒకరు ఏ క్షణాన అయినా పాట మొదలెట్టచ్చు. ఏ ఆర్మీనియమా ఏ సమక్షంలో ఎన్నడూ పాడదు. అతని పాట నువ్వు వినాలంటే, అతనికి తెలియకుండా వినాల్సిందే. ఏ కూరాకులో ఏరుకురావడాని కెళ్లినప్పుడు తను వాళ్లని అనుసరించాలా? అలా వెళ్తే వాళ్ళు తనని చూస్తారు. ఒక వేళ వాళ్ళు తనని చూడక పోయినా, వాళ్ల పాట తనకి వినిపించకపోవచ్చు. విదేశీ యాత్రికులు ఆర్మీనియన్ పాటలంటూ ఏమీ లేవని భావించినది, బహుశా అందుకనేనేమో. అసలు పాటలే లేని జాతి అంటూ ప్రపంచంలో ఎక్కడైనా వుందా!? మఠంలో యీ అంశంపై జరిగిన తీవ్రమైన వాగ్వాదం, క్యామంచా, తార్‌లు ఆర్మీనియన్ స్థానిక వాద్యవిశేషాలనీ, ఆర్మీ నియన్ పాటల శృతికూర్పున్నది ప్రత్యేకత అనీ, హృదయ తంత్రులను మీటుతూ విషాదభరితంగా ఉండటమన్నది వాటి విశిష్టత అనీ ఒక సన్యాసి వాదించడం అతనికి జ్ఞాపకమొచ్చింది.

"వాళ్లకి ఆర్మీనియన్ల సంగతి తెలియదు" అనుకున్నాడతను బాధగా. "మా జాతి కీలకం మా శిల్పాల్లో వుంది. మా మఠాలు సాదాగానే ఉంటాయి గాని, శక్తివం తంగా కూడా ఉంటాయి. అలాగే మా పాటలూ అంతే: పరుషంగా, నిరలంకారంగా ఉంటాయి."

అతను పక్కకి ఒత్తిగిలాడు. కూచిగా పొడవుగా వున్న చర్చిశిఖరం చీకటిగా ఉన్న ఆకాశపు భూమికలో నల్లని ఛాయాచిత్రంలా, నల్లని నీటిబుగ్గల్లా కానవచ్చే పాప్లార్ వృక్షాల కన్న పొడవుగా కనిపిస్తోంది. ఇప్పుడిక అతనేమీ ఆలోచించడం లేదు. అతని కళ్లు మూతలుపడ్డాయి. అతని కనురెప్పల క్రింద అగణితమైన నల్లని చుక్కలు, అదృశ్య హస్తమేదో నల్లని నువ్వుగింజల్ని విరజిమ్మినట్లు కానవస్తున్నాయి. అందుకనే అతన్ని ఆవరించిన చీకటి అంత దరిలేనిదిగా, అంత అగాధమైనదిగా ఉంది.

అతను ప్రొద్దుటే లేచాడు. అతని పక్కనే గడ్డి లోంచి ఒక కీచురాయి గీపెడుతోంది. బహుశా అది రాత్రంతా అలా కూస్తూనే ఉండి ఉంటుంది, కాని అతనికి వినిపించలేదు.

ముసలామె పశువులకొట్టం తలుపు తెరిచింది. గొర్రెలు తోసుకుంటూ ముందుకొచ్చాయి. వాటి వెంట ఒక గేదె కూడా వచ్చింది. దాని నీలం నలుపు రంగు ఆకాశపు గౌరవర్ణ భూమికలో ఓ పెద్ద సిరామచ్చలా కనిపిస్తోంది. ఆకాశంలో ఆ మచ్చ అలా వ్యాపించి వ్యాపించి ఎన్నడూ చెరిపివెయ్య రానిదిగా తయారవుతుందేమో ననిపిస్తోంది. గేదె ముందుకెళ్లి, మోర క్రిందికొంచి అరిచింది.

"ఏరిక్నాజ్! గేదె కట్టు తెంపుకుని బయటికొచ్చింది!" అంటూ ముసలామె కోడల్ని పిలిచింది.

ఏరిక్నాజ్ దాన్ని నవరదీసి కొట్టంలోకి నడిపించుకెళ్లి కట్టేసింది. తర్వాత తన కడవ భుజానపెట్టుకొని ఏటికి బయల్దేరింది.

"ప్రొద్దు పొడిచిందో లేదో అప్పుడే నీళ్ల కెళుతున్నావేమే?"

"అంద్రనిక్ ప్రొద్దుటి పూటే యిల్లు విడిచివెళ్లాడు."

మిద్దె మీంచి కోమితాస్‌కి పర్వతాల కెళ్లే త్రోవలు కనిపిస్తున్నాయి. లవెండరుపూ వన్నె పొగమంచులో కడవ నీలంగా కనిపిస్తోంది. ఆమె అంతకంతకు పర్వతం పైపైకి వెళ్తోంది, క్రమంగా కడవ ఆమె శరీరంలో ఒక భాగంగా కలిసిపోయింది. క్షణకాలం కోమితాస్‌కి, ప్రేమిప్రేమికులు, ఒకరి తలపై మరొకరి తల వంచుకొని నీటిబుగ్గకు వెళ్తూ వెళ్తూ దూరాన అదృశ్యమైనట్లు కానవచ్చింది. ఆటు తర్వాత అతనికొక పాట వినిపించినట్లయింది, లేక బహుశా నిజంగానే వినిపించిందో.

"కడవ భుజానపెట్టి నీటికెళ్లాను పడతి...."

అతను సరిగా యీ పాటనే పర్వతప్రాంతాల్లో ఎక్కడో విన్నాడు, అయితే అది, అరగాత్‌లోనో, సిపాన్‌లోనో, బింగేల్‌లోనో, లేక, అరగాత్సిలోనో అతను గుర్తు చేసుకోలేక

పోయాడు. ప్రతి చోటా స్త్రీలు కడవలు భుజానపెట్టుకొని పర్వతాల్లోకి నీటి కోసం వెళ్తూనే ఉన్నారు, ప్రతి చోటా స్త్రీ తన ప్రియుని కోసం వెతుకుతూనే ఉంది, కొందరికి సంతోషం లభ్యమైంది, మరి కొందరికి కాలేదు.

త్వరలోనే సూర్యోదయమవుతుంది. గ్రామం పర్వతపాదంలో వుంది. నీటిబుగ్గ పర్వతం పైన ఉంది. మిద్దె మీంచి నీటిబుగ్గా, దాని దిశగా పైకి ఎక్కుతున్న ఏరి క్నాజ్ అతనికి కనిపిస్తున్నారు. కోమితాస్ లేచి తన బట్టలకు అంటుకున్న గడ్డి పరకలు దులుపుకున్నాడు. నీటిబుగ్గ దగ్గరి త్రోవ మెలికలు తిరిగి తిరిగి లోయలోని ఏటి దగ్గరకు చేరుకొని, కొండల వెనక అదృశ్యమైంది. పై మన్న నీటిబుగ్గ దగ్గర్నుంచి అతనికి పాట వినిపిస్తోంది. ఏరిక్నాజ్ పాడుతున్నట్టుంది.

"కడవ భుజానపెట్టి నీటికెళ్లాను పడతి..."

ఈ పాట ఏ పర్వతాల్లో పుట్టిందో ఎవరికీ తెలియదు. ప్రతి చోటా స్త్రీలు తమ ప్రియుల కోసం వెతుక్కుంటూనే ఉన్నారు, కొందరికి సంతోషం లభ్యమైతే మరి కొందరికి నిరాశ ఎదురవుతోంది.

కోమితాస్ తన సంగీతం పుస్తకం తీసుకొని వేగంగా రాసుకో నారంభించాడు. అర్థనిమీలిత నేత్రాలతో అతను మొదటి చరణం పాడుకున్నాడు. దూరాన అదృశ్యమైన బాటల వెంట తేరిపార జూస్తూ తన భర్తకు వీడ్కోలు చెప్తున్న ఏరిక్నాజ్‌ని చూస్తు న్నట్లు ఊహించుకున్నాడు. ఆమె పాదాలు బోసిగా వున్నాయి, ఎండకి కమిలిన ఆమె పాదాలు తుషారబిందువులతో నానాయి, ఆమె బంగారు చెవిరింగులపై సూర్యకిరణాలు పడి మిలమిల మెరుస్తున్నాయి. ఆమె బుగ్గలు సొట్టలు పడుతున్నాయి, ఆమె కను బొమలు విల్లుల్లా వంగాయి.

"వెళ్లగానే నీ క్షేమసమాచారం తెలియ చెయ్యి, త్వరగా తిరిగి వచ్చెయ్యి" ఏరిక్నాజ్ లోగొంతులో చెప్పింది.

"గూడకొంగ తిరిగి వచ్చినప్పుడు, పిల్లలు యిళ్ల మిద్దెల మీంచి 'గూడా, గూడా! నువ్వు మళ్లీ తిరిగొచ్చావా!' అని అరుస్తారు చూడు, అప్పుడు నేను తిరిగొస్తాను" అని బదులు చెప్పాడు అంద్రనిక్.

అతను ముందుకు సాగిపోయాడు, ఏరిక్నాజ్ కడవ భుజాన పెట్టుకొని నీటిబుగ్గ దగ్గరే నిలిచిపోయింది.

కోమితాస్‌కి యిదంతా యిప్పుడు తన కళ్ల ముందే జరుగుతున్నట్లు నిపించింది, ఏరిక్నాజ్ యిప్పుడే తన భర్తకి వీడ్కోలు చెప్పినట్లూ, వంకర త్రోవ వెంట పోతున్న వ్యక్తి అంద్రనికే నన్నట్లూ అనిపించిందతనికి.

"ఏరిక్నాజ్ నీళ్ళు తీసుకొచ్చింది, గురువుగారూ. కాళ్ళూ, చేతులూ కడుక్కుంటారా?" అన్న ముసలామె స్వరం అతన్ని వాస్తవ ప్రపంచంలోకి తెచ్చింది. అతను కిందకి దిగి వచ్చి, ముఖం కడుక్కొని యింట్లో కెళ్ళాడు.

తన గుర్రాన్ని సాలలోంచి బయటకు నడిపించుకొచ్చాక, కోమితాస్ పేరుపేరునా అందరి దగ్గరా సెలవుతీసుకున్నాడు. ఆయన యిక బయల్దేరుతాడనగా ముసలామె "గురువుగారూ, మీరు అంద్రనిక్‌కి ఒక ఉత్తరం రాసి, వాడిని మాకు జాబు రాయమని చెప్తారా?" అంది.

ఏరిక్నాజ్ ఏమీ అనలేదు. నేల వంక చూస్తూ ఆమె తన అత్తగారి పక్కనే నిలబడింది.

"అతని సమాచారం తెలియగానే నేను మళ్లీ మీ ఊరొచ్చి, మీ చర్చిలో ప్రార్థన చేస్తాను."

"ఆ ప్రార్థన ఫలించు గాక" అంది ముసలామె.

* * *

నెలలు గడిచిపోయాయి. బాకూ బిషప్‌కి కోమితాస్ రాసిన ఉత్తరానికి జవాబు వచ్చింది. "...దేశద్రిమ్మరి అంద్రనిక్ తెక్‌మెక్‌చ్యాన్ బాకూలో గత ఆకురాలుకాలంలో చనిపోయాడు. అతని తల్లినీ, భార్యనీ భగవంతుడు ఆశీర్వదించుగాక...."

ఆ ఉత్తరం మరోసారి చదివిన కోమితాస్‌కి, గ్రామ చర్చిలో ప్రార్థన చేస్తానన్న తన వాగ్దానం జ్ఞప్తి కొచ్చింది. ఈ మారతను తన గౌను ధరించి, తను వస్తున్నట్లు గ్రామానికి కబురంపాడు.

అవి మేనెల్లో చివరి రోజులు. కోత కొయ్యబడిన వచ్చికబయళ్ల నుంచి తిత్తిరిపిట్టల అరుపులు వినవస్తున్నాయి. వాతావరణం చాలా వేడిగా ఉంది. గుర్రం తాపీగా నడుస్తున్నా, కోమితాస్ దాన్ని అదిలించడం లేదు. అతను ఏమాత్రం తొందర చూపడం లేదు.

దూరాన్నుంచి ఆ గ్రామం, రోడ్డు వార గోడరాతి యిల్లూ కనిపించగానే, కోమితాస్ తన గుర్రాన్ని పక్కకు మళ్లించి, ముసలామెను గాని, ఏరిక్నాజ్‌ను గాని కలుసుకోకుండా తప్పించుకొనేందుకు గాను రెండో పక్క నుండి గ్రామంలోకి ప్రవేశించాడు.

రైతులు చర్చి ఆవరణలో గుమికూడారు. అతనా స్త్రీలిద్దర్నీ వెన్వెంటనే గుర్తించాడు. కోమితాస్ గుర్రం దిగి వాళ్లని సమీపించాడు. ముసలామె అతని చేతిని ముద్దుపెట్టుకొంది గాని, అతన్నేమీ అడగలేదు. అతను తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. తర్వాత ఏరిక్నాజ్ వంక చూసి, ఆమె కళ్లల్లో జ్వలిస్తున్న ప్రశ్నను తప్పించుకోవడం సాధ్యం కాదని గ్రహించాడు. తనా జాబు సంగతి చెప్పక తప్పదనుకున్నాడు.

డింగ్-డాంగ్, డింగ్-డాంగ్ మంటూ చర్చి గంట మోగింది. ధూప పరిమళం ఆవరణంతా వ్యాపించింది. జన సమూహాన్ని చూస్తూ కోమితాస్ ప్రార్థనమందిరంలో నిలబడ్డాడు. వాళ్లిప్పుడు గోడవార మోకరిల్లారు. ఏరిక్నాజ్ మాత్రం ప్రార్థించడం మాని, మఠాధిపతి వంకకే చూస్తోంది. ఆమె కళ్లు "ఆయన్ని గురించి వార్త తెచ్చారా?" అని డిమాండు చేస్తున్నట్లున్నాయి.

తర్వాత, తనకే ఆశ్చర్యం కొలిపే విధంగా, ప్రార్థన చెప్పేందుకు బదులు కోమితాస్ పాట పాడవారంభించాడు. అతని పాట వినిపించీ వినిపించనట్లుంది.

"కడవ భుజానపెట్టి నీటికెళ్లెను పడతి
ప్రియుడచట కనరాక కుమిలిపోయెను సుదతి...."

గ్రామ మతగురువు మఠాధిపతి వంక దిగ్భ్రాంతుడై చూస్తున్నాడు. "దేవాలయంలో పవిత్రమైన ప్రార్థన చెప్పేందుకు బదులు, ఏమిటీయన యిలా తప్పిపోయిన ప్రియుని గురించి పాడుతున్నాడు!" అనుకున్నాడతను, "బిషప్‌కి విషయం తెలియదు, భగవంతుడు దీన్ని సహించాలి."

"తమరు చేస్తున్న పనేమిటండీ?" అంటూ మతగురువు గొణిగాడు. "మీరు పారిగ్యూళ్ చర్చిలో ఉన్నారు. భగవంతుడు మనల్ని పరిశీలిస్తున్నాడు, శిలువ మన వంక తేరిపార జూస్తోంది."

కోమితాస్ అతని మాటలు వినిపించనట్లు నటించాడు.

"కడవ భుజానపెట్టి నీటికెళ్లెను పడతి..."

అతను పాడుతూ ఏరిక్నాజ్ వంక చూశాడు. ముసలామె ప్రార్థన చేస్తోంది. కుమిలి కుమిలి విలపిస్తున్న ఆమె భుజాలు అదురుతున్నాయి. ఏరిక్నాజ్ ప్రార్థన చెయ్యడం లేదు. తన ప్రశ్నకు జవాబు వెతుకుతూ ఆమె మఠాధిపతి వంకకే, తదేకంగా చూస్తోంది. ఆయన తన పాటే పాడుతున్నాడు, నీటిబుగ్గ దగ్గర తను ఆంద్రనిక్ కోసం పాడిన తన పాటే పాడుతున్నాడు. మఠాధిపతి తన పాటే పాడుతున్నాడు. ఆమె అతని వంక గుచ్చిగుచ్చి చూస్తోంది. కాని ఆమె కళ్లు భావశూన్యంగా ఉన్నాయి. మసక చీకటిగా ఉన్న చర్చిలో చంచలంగా కదలుతున్న కొవ్వొత్తి కాంతిని సైతం ఆమె కళ్లు ప్రతిఫలించడం లేదు. మోకరిల్లి వున్న ఆమె అకస్మాత్తుగా లేచి, చర్చి బయటకు పరిగెత్తింది.

పాట పూర్తి చేసి, విదేశాలకు వెళ్లిపోయి తమ పొలాలు దున్నుకోవడానికి, తమ

తోటల సంరక్షణ చూసుకోవడానికీ, తమ ఎడ్లను పెంచుకోవడానికీ మరి తిరిగిరాని దేశద్రిమ్మరుల కోసం మఠాధిపతి ప్రార్థించాడు. ప్రార్థనని, ప్రవచనాన్నీ ముగించి, అతను త్వరత్వరగా చర్చిని విడిచిపెట్టి వెళ్లిపోయాడు.

గ్రామ మతగురువు అతని వెంట వెళ్లాడు, "అయ్యా" అంటూ అతను మొద లెట్టాడు. అతని కళ్ళు సంకుచితమయ్యాయి. "నాకు తెలియక అడుగుతాగాని, దేవాలయంలో పాటలు పాడవచ్చునంటారా?"

"భగవంతుడికి చెందినదంతా మనిషికి చెందుతుంది, మనిషికి చెందినదంతా భగవంతునిదే" అని జవాబిచ్చాడు కోమితాస్. జరిగినదంతా బిషప్‌కి మతగురువు పూడా విడిగా చేరవేస్తాడన్న సంగతి పూర్తిగా తెలిసివుండీ కూడా కోమితాస్ ఆ జవాబిచ్చాడు.

కోమితాస్ రైతుల దగ్గర సెలవు తీసుకున్నాడు. తన గుర్రపు కళ్లెం తీసుకొని రాతిగోడల యింటి వేపు కెళ్లాడు.

ముసలామె ఆయన కోసం రోడ్డువార వేచి వుంది. వాళ్లిద్దరూ మౌనంగా అడ్డ రోడ్డు దాకా నడిచి వెళ్లారు.

"ఏరిక్నాజ్ నీటిబుగ్గ కెళ్లింది, 'ఏ దేశద్రిమ్మరైనా యిటొస్తే చల్లని నీళ్లివ్వడానికుంటాయి' అని చెప్పి వెళ్లింది పిచ్చి పిల్ల" అంది ముసలామె.

కోమితాస్ గొంతు డగ్గుత్తిక చెందింది. అతనికి మాటలు దొరకలేదు. ముసలామె కళ్లు కన్నీళ్లతో నిండాయి. ముడతలు పడిన ఆమె కనురెప్పల క్రింద అవి తళుక్కున మెరిసి, బుగ్గల మీదుగా క్రిందికి జారాయి.

"పరాయిదేశంలో వాడి సమాధి మీది మట్టి తేలికగా ఉండుగాక" అంటూ ముసలామె గొణిగింది. ఆయనకి వీడ్కోలు చెప్పకుండానే ఆమె రాతిగోడల యింటి కేసి వెళ్లిపోయింది.

వంగిన ఆమె శరీరం వంక పరకాయించి చూస్తూ కోమితాస్ చౌరస్తా దగ్గర నిలబడ్డాడు. మాసికలేసిన ఆమె గౌను అంచు నేలను రాసుకొంటూ ధూళిమేఘాన్ని రేగగొట్టింది. ఆయన అక్కడ స్థాణువులా నిలబడిపోయాడు. ఆయన ఎద లోపలి విషాద స్వరం యిలా పాడింది:

"కడవ భుజానపెట్టి నీటికెళ్లెను పడతి,
ప్రియుడచట కనరాక కుమిలిపోయెను సుదతి...."

ఈ పాట ఎక్కడ పుట్టింది? తాని పాటను యింతకు ముందెక్కడ విన్నాడు? ప్రతి చోటా స్త్రీ తన ప్రియుని కోసం వెతుకుతూనే ఉంది, కొందరికి సంతోషం లభ్యమైంది, మరి కొందరికి కాలేదు.

సూరేన్ ఐవజ్యాన్

సూరేన్ ఐవజ్యాన్ (జననం 1915); వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైన ఐవజ్యాన్ 1934 నుంచి 1936 దాకా ఒక గ్రామంలోను, తర్వాత బాకూలోను ఉపాధ్యాయుడుగా పని చేశాడు. ఆయన తొలి కథానికలు 1937లో వెలువడ్డాయి. 1941లో యుద్ధం ప్రారంభం కావడంతో ఆయన యుద్ధ రంగాని కెళ్ళిపోయాడు. కాని, అక్కడ కూడా యుద్ధానికి సంబంధించిన యితివృత్తాలపై కథానికలూ, స్కెచ్‌ల రచనావ్యాసంగం కొనసాగించాడు. "పూర్తికాని తివాసీ" అనే ఆయన తొలి కథ సంపుటి 1947లో వెలువడింది. ఐవజ్యాన్ పలు కథానికా సంపుటాలూ, "పర్వతారోహకులు," "ఒక ఆర్మీనియన్ భవితవ్యం" అనే రెండు నవలలూ రచించాడు.

"గరుడ పర్వతం పైన" అన్న కథ ఆర్మీనియాలో అంతర్యుద్ధ దశకు (1918–1920) సంబంధించిన ఒక ఘటనను అభివర్ణిస్తుంది.

గరుడ పర్వతం పైన

బయట నుంచి పకపక మంటూ నవ్వులూ, గింగురుమనే బాల్యస్వరమూ ట్రామ్ కార్ల గణగణ శబ్దమూ, ట్రాఫిక్ శబ్దాలూ వినిపిస్తున్నాయి.

చదువుల గదిలో ఒక వ్యక్తి పురాతన లిపి చెక్కబడి వున్న కాల్చిన మృణ్మయ ఫలకాన్ని చదవడానికి తంటాలు పడుతున్నాడు. కిటికీలు బార్లా తెరిచి వున్నాయి. పిల్లగాలి అతని నెరిసిన జుట్టునూ, కాగితాలనూ చెదరగొడుతోంది, కాని, ఆ పండితుడికి యీ మందపవనం సంగతి గాని, వీధిలోని కలకలం సంగతి గాని ఏమీ పట్టినట్లు లేదు.

అయితే, యీ కథను యిలా కాకుండా బహుశా యింకోలా ప్రారంభించాలేమో?

ఎందుకంటే, ఆ ఘటనే జరగకుండా ఉండి ఉంటే, హుషారైన నవ్వులు గాని, గింగురుమనే బాల్యస్వరం గాని, పురాతన లిపిబద్ధమైన శాసనాలు చదివే పండితుడు గాని యివేవీ ఉండేవి కావేమో....

ఔను, యీ కథను మరోలా చెప్పాలనుకుంటాను.

* * *

పాత ఇలాయిదీపం చీకట్లో బహుక్షీణమైన కాంతిని చిమ్ముతోంది. ఆ క్షీణ కాంతిలో అక్కడ కూర్చున్న యువతి ముఖాకృతి సైతం స్పష్టంగా కనిపించడం లేదు. ఆమె కాళ్లు మడత వేసుకొని నేలపై కూర్చుంది. ఉయ్యాల ఊపుతున్న ఆమె చెయ్యి స్పష్టస్పష్టంగా కనిపిస్తోంది. నల్లని మీసాలు గల ఒక మగవాడు ఆమెకు ఎదురుగా కూర్చున్నాడు. అస్పష్ట కాంతిలో అతని మీనం ఉన్నదాని కన్న మరింత

నల్లగా మరింత ఒత్తుగా కానవస్తోంది. ఆందోళనతో గుంటలుపట్టిన అతని కళ్ళ చలిస్తున్న దీపజ్యోతినే తదేకంగా చూస్తున్నాయి.

ఆ జ్యోతితో బాటే అన్నట్లు, మూల నున్న ఒక కొడవలి కూడా మిలమిలలాడుతోంది. నేలపై వున్న గంపమట్టు పైనా, గోడకు అన్చబడిన తొట్టె అంచు పైనా, ఎర్రని అంచుగల పెద్ద గూన పైనా కాంతి బరవుతున్నది దీపం కాక, ఆ కొడవలేనేమో అనిపిస్తోంది. నిశ్శబ్ద వాతావరణంలో ఉయ్యాల లయబద్ధంగా క్రిరుక్రిరు మనే శబ్దం చేస్తోంది. మూల నున్న ఖాళీ గూన ఆ శబ్దాన్ని బొంగురు స్వరంలో ప్రతిధ్వనిస్తోంది. నిట్రంగా వుండే ఎత్తైన కొండలలో ఎన్నడో వెయ్యేళ్లనాడు తొలచబడిన గది గోడలు నిశ్శబ్దాన్ని గట్టిగా కాపాడుతున్నాయి.

ఈలోగా, బయట....

దూరాన వెంటవెంటనే వినవస్తున్న తుపాకి కాల్పులు పర్వత కనుమల్లో ప్రతిధ్వనిస్తూ చీకటి రాత్రిని చీల్చుకొని తారాజువ్వల్లా తళుక్కుమంటున్నాయి. నివాస గృహాల్లోని దీపాలు ఎన్నడో ఆర్పివెయ్యబడ్డాయి, కాని ఒక్క కిటికీ మాత్రమింకా కాంతివంతమైన ఆశ్చర్యచకితమైన కంటితో బయటి చీకటి వంక తిలకిస్తోంది.

అది దష్నక్‌ల* కార్యాలయం. ఎర్ర సేనలకు చెందిన 11వ సైన్యపు పురోగామి దళాలు అగారా నది ఎడమ ఒడ్డును చేరుకున్నాయి. దష్నక్‌లచేత పర్వత ప్రాంతీయ ఆర్మీనియా అని పిలవబడే చివరి స్థావరం ఎర్రసైన్యపు మరుసటి దెబ్బతో ఛిన్నాభిన్నమవుతుంది.

దష్నక్‌ల కేంద్ర కార్యాలయపు ముందుగదిలో లెఫ్టినెంట్ గులంబారొవ్ ఒక రైతును నేల మీద పడదోసి, కొరడాతో బాదుతున్నాడు. రైతు నోటివెంట ఎటువంటి శబ్దం రావడం లేదు. అతని శిలా సదృశ మౌనం లెఫ్టినెంటులో మరింత కోపాన్ని రెచ్చగొడుతోంది. దానితో అతను మరింత క్రూరంగా: "అంటే నువ్వు కమ్యూనిస్టులతో పోరాడనన్నమాట. అయితే నీకు ఒంట్లో బాగా లేదంటావు, అంతేనా?" అంటూ రైతును చావమోదుతున్నాడు.

లోపల, ఛీఫ్ ఆఫ్ స్టాఫ్ కెప్టెను ఏనోశ్ అగామ్యాన్, పేటెంట్‌తోలు బూటులో వున్న తన పాదాన్ని ఒక కుర్చీపై మోపి, తన మోచేతిని తన మోకాలుపై ఆన్చి, తన కొత్త రివాల్వరును తడుముతూ టెలిఫోనులోకి అరుస్తున్నాడు:

---

*దష్నక్‌లు – ఆర్మీనియన్ బూర్జువా జాతీయవాద, విప్లవ ప్రతీఘాత పార్టీ. – సం.

"నేనంటున్నది వినిపిస్తోందా? కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా నువ్వెంత మందిని పంపావు? నోర్ముయ్, బదుద్దాయ్!" అతను తన రివాల్వరును టేబిలు మీద పడేసి, అందమైన తన మీసాన్ని మెలెయ్యసాగాడు. "ఏమిటి? నీ తమాషాలు నా దగ్గర సాగవ్! లెఫ్టినెంటు గుండారావ్ ఓ గంటలో అక్కడి కొస్తున్నాడు. ఒక్కగానొక్క దృఢగాత్రుడు కనిపించినా సరే, నీ డొక్కచీల్చి డోలు కట్టమని చెప్తానతనితో!"

అతను దఢాలున ఫోను పెట్టేసి, మళ్లీ వెంటనే ఫోనెత్తాడు.

"స్విచ్ బోర్డు ఆపరేటరేనా? ఖావాత్‌సాక్‌కి కనెక్షనియ్యి. ఆఁ, నువ్వేనా జార్గు దార్? బళ్లు పంపావా? ఏమిటి?!" ఏసోక్ తన రివాల్వరు తీసుకుని, అవతల మాట్లాడుతున్న వ్యక్తినే తను బెదిరిస్తున్నట్లు, ఫోను మీదకి దాన్ని ఊపాడు. "నీ కేమన్నా పిచ్చెత్తిందా? 'అది సాధ్యం కాదండి' అంటున్నావ్? అసలింతకీ నీ ఉద్దేశమేమిటి? బోల్షివిక్కుల రాక కోసం ఎదురుచూస్తూ నువ్వు పత్నివే అక్కడ కూర్చున్నావా? ఇదుగో విను, నువ్వు నీ పీకమీదకి తెచ్చుకుంటున్నావు. బోల్షివిక్కులు నిన్ను కాల్చరేమో గాని, నేను మాత్రం తప్పకుండా కాల్చేస్తాను! ఏం, వినిపిస్తోందా నీకు? నీ సంగతి నేను స్వయంగా చూస్తాను. తెల్లారే లోగా పది బళ్ల ఆహార పదార్థాలు పంపించు. మరో సంగతి: బక్క రైతుల్ని కాల్చి పారెయ్యి. అప్పుడిక ధనిక రైతులు తమకున్నదంతా సంతోషంగా తీసుకొచ్చి మనకిస్తారు. ఊఁ అంతే!"

అతను రిసీవరు ఫోను పైన పెట్టేసి, సాలోచనగా తన మీసాలు మెలెయ్య సాగాడు. పర్వతాల గాలి గాని, పర్వత ప్రాంతాల సూర్యకాంతిస్పర్శ గాని ఎన్నడూ చవిచూడని పాలిన తన బుగ్గల్ని మధ్య మధ్య గాలితో పూరిస్తున్నాడు.

ఫోను మోగింది. ఏసోక్ రిసీవరు పైకెత్తాడు.

"ఛీఫ్ ఆఫ్ స్టాఫ్‌ని మాట్లాడుతున్నానండి. ఔనండి, జనరల్" అన్నాడతను అత్యంత గౌరవ భావంతో మిక్కిలి మంద్ర స్వరంలో. తన కాలిని కుర్చీ పైనుంచి తొలగించి రెండు కాళ్లూ దగ్గర పెట్టి అటెన్షనులో నిలబడ్డాడు. "మన కుడి పార్శ్వంపై దాడి చెయ్యడానికి ప్రయత్నించిన గెరిల్లా దళాన్ని ప్రశస్తమైన మన దళాలు మట్టుపెట్టాయండి. ఔనండి.... సార్నక్‌బ్యూర్, ఖావాత్‌సాక్ మొదలైన గ్రామాల్లోని చాలామంది రైతులు కమ్యూనిస్టులతో పోరాడటానికి ఐచ్ఛికంగా ముందు కొచ్చారండి. ఏమన్నారు సార్? సప్లైలాండి? నా సెక్షన్లో సప్లైలు లెక్క ప్రకారం జరుగుతున్నాయి సార్. దౌర్భాగ్యపు శత్రువును తుడిచిపెట్టడానికి గాను రైతులు తమకున్న సమస్తం యివ్వడానికి సిద్ధపడుతున్నారండి."

కెప్టెను అసంకల్పితంగా తన పాదాన్ని కుర్చీ మీద పెట్టాడు, కాని వెన్వెంటనే దాన్ని అక్కణ్ణుంచి తీసేసి, మళ్లీ నిటారుగా నిలబడ్డాడు.

“అలాగే, సార్!”

రిసీవర్ని అదెక్కడ పగిలిపోతుందోనన్నట్టు మహా జాగ్రత్తగా దాని స్థానంలో ఉంచాడతను. తర్వాత తన పాదాలపైన అటూయిటూ ఊగుతూ తనలో తను యిలా అనుకున్నాడు:

“ఇప్పుడు నువ్వు చెప్పింది ఘోరాబద్ధం ఏనోఖ్! కాని, నేనంతకన్న ఏం చెప్పగలను! మరేమైనా చెప్తే, ఆ కుక్కలకొడుకు నన్ను కాల్పించి పారేసి వుండును. ఈ కమ్యూనిస్టు లొత్తుకొడుకులు ప్రపంచమంతట్నీ తల క్రిందులు చేసి పారనూకారు!”

గులంబారొవ్ “సార్, కెప్టెనుగారూ!” అంటూ హడావిడిగా అరుచుకుంటూ లోపల కొచ్చాడు. అతను తన చేతిలోని కొరడాని ఊపుతూ, దౌడు తీసిన గుర్రంలా రొప్పుతున్నాడు. “వాళ్లొచ్చేస్తున్నారు, సార్!”

ఏనోఖ్ మంచం మీద వాలి, తన తల తలగడలో దూర్చేశాడు. బోల్షివిక్కులప్పుడే అగారా దగ్గర వున్నారనీ; రైతుల్లో తన పట్ల ద్వేషం నిండి వుందనీ, దస్నాక్‌లను బలపరచడానికి వాళ్లు నిరాకరించారనీ, తన జనరల్‌తో తను బుకాయించాననీ, తన బాపతు ఆర్మీనియా యికనెంత మాత్రం ఉండబోదనీ – యివేవీ తెలియకుండా తన మనస్సు మొద్దుబారి పోయి, విస్మృతి సుడిగుండంలో పడిపోతే ఎంత బాగుండునని అనుకున్నాడు.... కాని వెంటనే అతను లేచి నిలబడ్డాడు:

“ఏమిటి నువ్వంటున్నది?”

గులంబారొవ్ ఏమీ మాట్లాడలేదు. గుడ్లప్పగించి చూస్తూ, మరో పక్కకి వంగాడు.

ముందు గదిలో నేలపై పడి వున్న రైతు మూలుగుతున్నాడు. అప్పుడతను తలెత్తి తలుపు వెనక నుంచి వినవస్తున్న స్వరాలు వినసాగాడు....

మూనె దీపం మలిగిపోయింది. గంపా, తొట్టీ చీకట్లో మునిగి పోయాయి, మూల నున్న కొడవలి మాత్రమింకా మందంగా మెరుస్తోంది. గూనకి వున్న ఎర్రంచు కూడా అదృశ్యమైంది, కాని గూన మాత్రం ముందర్లాగే మానవ స్వరాలను ప్రతిధ్వనిస్తోంది.

“నే వెళ్తా, వాజాన్.”

అతని బరువైన చెయ్యి, ఉయ్యాల అంచుపై వున్న స్త్రీ మెత్తని చేతిపై ఆనింది.

“అర్ధరాత్రి వేళ ఎక్కడి కెళ్తావు స్టెపాన్?”

“మన లాంటి జనాన్ని బోల్షివిక్‌లు కాపాడుతారని చెప్తున్నారు కదా, అదెంత వరకు నిజమో చూడాలనుకుంటున్నాను.”

గదిని ఆవరించి వున్న గాఢాంధకారంలో, గూన గుంయ్‌మంటున్న మూల రహస్య స్థానంలోంచి రైఫిల్ని చేతిలోకి తీసుకున్నాడు స్త్రెపాన్.

నాజాన్ అతని చేతిని పట్టుకుంది, భయంతో అరిచింది. ఆ అరుపుకి చంటిబిడ్డ బిగ్గరగా ఏడుస్తూ లేచాడు. స్త్రెపాన్ తన భార్యని పక్కకి నెట్టి, ఉయ్యాల వార, తన మోకాళ్లపై వంగున్నాడు. దీపం మళ్లీ వెలిగించమని చెప్పి, మెల్లగా దుప్పటి ఒత్తిగించి, ఒక సంవత్సరం వయస్సు కలిగిన తన కొడుకు వంక ఆపేక్షగా చూశాడు.

వ్యవసాయపు పనులతో మోటుబారిన తన వేలితో బిడ్డ మెత్తని నెచ్చని గడ్డాన్ని తడువుతూ "దావిద్" అంటూ గొణిగాడతను. "నేను నీ కోసమే వెళ్తున్నాను బాబూ. బోల్షివిక్కులు నిజంగానే మంచి వాళ్లూ, న్యాయమ్తులూ అయితే, నీకు ముందు మంచి జీవితముంటుంది. అప్పుడిక నేను ప్రాణాలతో తిరిగి రాకపోయినా ఫరవాలేదు."

అతను తన బిడ్డ చిన్నారి చేతిని ముద్దుపెట్టుకొని గదిలోంచి బయటకెళ్లిపోయాడు.

రాతి గడప మీద దిన పాదాలతో నిలబడిన నాజాన్, చీకట్లోకి కళ్లు పొడుచుకొని చూస్తూ "స్త్రెపాన్!" అంటూ ఆదుర్దాగా పిలిచింది.

స్త్రెపాన్ స్వరంలో అంధకారం "నేను వెనక్కి తిరిగి వస్తాను!" అని అరిచింది. వెళ్లిపోతున్న అతని అడుగుల సవ్వడి క్రమక్రమంగా మరింత అస్పష్టమై, నిశ్శబ్దంలో కలిసిపోయింది.

నిర్భాంతురాలై, భయంతో కొంత సేపు నాజాన్ అక్కడే స్థాణువులా నిలబడి పోయింది. ఎక్కడో దూరాన, పేలుతున్న మరతుపాకుల మోతలు పర్వత కనుమల్లో గర్జిస్తున్నాయి. ఆ గర్జలు పర్వతాల్లో ప్రతిధ్వనించి పదింతలై శీతల రాత్రి చిక్కని చీకటిని చీలుస్తున్నా యనిపిస్తోంది. ఆమె చుట్టూ సమస్తం చీకటిలో, తేమలో, భయంలో మునిగినట్లుంది. ఒంటరిగా విడువబడిన బిడ్డ గదిలో గట్టిగా గుక్కపెట్టి ఏడుస్తున్నాడు.

తెల్లవారగానే ఎర్ర సైనికులు మరో దాడి ప్రారంభించారు, కాని యీమారు కూడా వాళ్లు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. పర్వతాగ్రం దష్నకోల చేతుల్లో ఉంది. వాళ్లక్కడి నుంచి కనుమలోకి కాలుస్తున్నారు. అగారా లోయకి అదే తప్ప మరో రోడ్డేదీ లేదు. గత పదకొండు రోజులుగా ఎర్ర సైనిక దళాలు కనుమ దాటి వెళ్లాలని విఫల ప్రయత్నం చేస్తున్నాయి.

అది జూన్ మాసపు ఉదయం. ఎండగా వుంది. అగారా కనుమకి యిరువంకలా వున్న

నిటూరు కొండలు నీలిరంగు పొగమంచు మేలిముసుగుతో కప్పబడి వున్నాయి. అంతలో అకస్మాత్తుగా గరుడ పర్వతాగ్రంపై తొలి గులాబి ఉషోరేఖలు విరిశాయి.

గరుడ పర్వతంపై గడ్డి పైన పడుకొని ఉన్నాడు స్తెపాన్. క్రింద పర్వత శ్రేణి యావత్తూ పరచుకొని ఉంది. ఎడమ ఒడ్డున మరతుపాకులు మ్రోగుతున్నాయి.

ఫిరంగి గర్జ ఆ మరతుపాకి మ్రోతలను ముంచెత్తింది. దష్నక్‌లకు ఫిరంగుల్లేవు, ఫిరంగి కాల్పులకు వాళ్ళ తమ మరతుపాకి కాల్పులతో బదులు చెప్తున్నారు.

నిటూరు కొండల నడుమ లోయ అంచులను బంగరువన్నె తేనె వంటి కాంతితో ముంచెత్తుతూ సూర్యుడు మరింత పైకి లేచాడు. ఎర్ర సైనికుల కందకాలు అక్కడే వున్నాయి. ఎండలో మునిగి, పుష్పిస్తున్న లోయ వంక చూస్తూ, స్తెపాన్ కమ్యూనిస్టులను గురించి ఆలోచిస్తున్నాడు.

అతను పడుకున్న చోటు నుంచి దష్నక్‌ల స్థావరాలు కూడా అతనికి స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాని వాళ్ళని గురించి ఆలోచించడానికి అతనికిష్టం లేకపోయింది. స్తెపాన్‌కి వాళ్ల సంగతి చాలా బాగా తెలుసు. గచ్చకాయ రంగు గొర్రెతోలు టోపీ పెట్టుకున్న ఒక దష్నక్, ఒక మరతుపాకి వెనక చేరాడు, అప్పుడది నిరంతరాయంగా నిప్పులు కక్కసాగింది. కందకాల్లోని ఎర్ర సైనికులు మరో దాడికి తలపడకుండా, వాళ్ల నది నిలవరించింది. కమ్యూనిస్టులు పర్వత శిఖరాల మీద తమ భారీ ఫిరంగిని పేలుస్తున్నారు. ఆ ప్రేలుళ్లకు కనుమలు దద్దరిల్లి, తన గదిలోని పెద్ద ఖాళీ గూన లాగ ప్రతిధ్వనిస్తున్నాయి. తుప్పరంగు ధూళిమేఘాలతో అన్నీ కప్పివెయ్యబడ్డాయి. ధూళి అణగిపోగానే దెబ్బతినని దష్నక్‌ల స్థావరాలు మళ్లీ దృష్టిపథంలోకి వచ్చాయి. మరతుపాకి మళ్లీ రౌద్రంగా నిప్పులు కక్కుతూ, ఎర్ర సైనికులు కందకాల్లోంచి కదలకుండా చేస్తోంది.

“దావీద్ జీవితం, భవితవ్యం, అదుగో ఆ క్రింద బంగరుటెండలో పచ్చగా మెరుస్తున్న లోయలో, ఎడమ గట్టు క్రింద వున్నాయి. అంటే, యీ దష్నక్‌లు నా కొడుకు మీద కూడా కాలుస్తున్నారన్న మాట” స్తెపాన్ తనలో తను అనుకున్నాడు.

అతను తన గొర్రెతోలు టోపీని తన రైఫిలు క్రింద పెట్టుకొని, జాగ్రత్తగా గురి చూశాడు. తర్వాత అతను ఊపిరి బిగపట్టి, తన రైఫిలు కాల్పు శబ్దం దష్నక్‌లకు వినపడకుండా ఉండేందుకు గాను ఫిరంగి గర్జించే దాకా వేచి వున్నాడు.

ఫిరంగి గర్జించింది, స్తెపాన్ తన రైఫిలు కాల్చాడు. గచ్చకాయ రంగు గొర్రెతోలు టోపీ ధరించిన దష్నక్ మరతుపాకీ మీద దభీమని పడ్డాడు.

దష్నక్‌ల కమాండరైన తార్‌ఖాన్, గుర్రంపై స్వారీ చేస్తూ తన స్థావరాలను

పరిశీలిస్తూ, తన మనుష్యులను ప్రోత్సహిస్తున్నాడు. తన గుర్రాన్ని అతను మరతుపాకి ముందు చటుక్కున అవు చేసి, క్రిందకు దిగాడు. గుర్రం ప్రమాదాన్ని శంకించినట్లు తన తలను వెనక్కి లాక్కుని, సకిలించింది. మృతుని శరీరంపై ఒంగుతూ తార్‌ఖాన్ రివాల్వరును తన నడుముప్రక్క అదుముకున్నాడు. అంతలోనే చటుక్కున లేచి నిలబడి, తన బైనాక్యులర్ కళ్ల దగ్గర పెట్టుకొని పర్వతాగ్రాలను జాగ్రత్తగా పరికించ నారంభించాడు. మరతుపాకి కాలుస్తున్న వ్యక్తి వెనకపాటున కాల్చబడ్డాడన్న సంగతి అతనికి తెలుసు.

స్త్రెపాన్ తన గడ్డాన్ని రెండు అరచేతుల్లోనూ అదుముకొని, ఎర్ర సైనికులు తమ కందకాల్లోంచి పైకి దూకి కనుమ దిశగా పరిగెత్తడం చూశాడు. దూరాన మరో మరతుపాకి కటకట శబ్దం చేస్తోంది, ఇంతకు ముందు నిస్తబ్దమైనదనుకున్న మర తుపాకి మరల నిప్పులు కక్కనారంభించింది.

ఈ మారు స్త్రెపాన్ ఫిరంగి మోగే దాకా నిరీక్షించలేదు. అతను రైఫిలు కాల్చాడు, మరతుపాకి గతుక్కుమని నిశ్శబ్దం వహించింది.

తార్‌ఖాన్ బైనాక్యులరు గరుడ పర్వతం వేపు తిరిగింది. స్త్రెపాన్ క్షణ కాలం తటపటాయించి, యీ మారు మళ్లీ దష్నక్ కమాండరు పైన తన రైఫిలు కాల్చాడు. గురి తప్పినందుకు లోగొంతులో తిట్టుకున్నాడు. దష్నక్‌లు అతని ఉనికిని కనిపెట్టి నలుమూలల్నుంచీ తుపాకులు కాల్చారు. అతని భుజంలో దబ్బు మంటూ ఒక గుండు యిరుక్కోవడంతో తీవ్రమైన నొప్పి అతని శరీరమంతటా వ్యాపించింది.

ఆకుపచ్చని యూనిఫారాలు ధరించిన సైనికులు చేస్తున్న సింహనాదాలతో కనుమ ప్రతిధ్వనించింది. ఎర్ర జెండా పట్టుకొని వాళ్ళు పర్వత లోయలోకి పరుగులు తీశారు. పర్వతాల పైకి లేచిన సూర్యకాంతి వారిపై తరగలు తరగలుగా ప్రసరిస్తోంది.

స్త్రెపాన్ బలం సన్నగిలుతోంది. దూరాన జరుగుతున్న కాల్పుల ధ్వనినీ, పర్వతాలు ప్రతిధ్వనిస్తున్న యుద్ధ నాదాన్నీ అతను కలలో వలె వినగలుగుతున్నాడు.... ప్రతిదీ మసకబారుతోంది. రక్తం క్రమంగా గరుడ పర్వతంపై గల గడ్డిని రక్తరంజితం చేసి, దాన్ని పైపైకి లేస్తున్న సూర్యుని సన్నెకు మారుస్తోంది.

"హల్లో! హల్లో! స్విచ్ బోర్డు ఆపరేటరేనా?" అంటూ ఫోనులోకి కెప్టెన్ రంకె లేశాడు. రిసీవరులోకి ఊది, నానా హంగామా చేసి, చివరకి దభేలున దాన్ని కింద పెట్టే శాడు. "లైను కట్ చేసేశారు!" తన కొరడానింకా పట్టుకొనే పక్కనే నిలబడ్డ గులం బారొవ్ కేసి తిరిగాడు. గులంబారొవ్ కొరడా గాభరాగా వున్న కుక్క తోక లాగా ఊగి సలాడుతోంది.

ఏదో ఒకటి మాట్లాడాలి కదా అన్నట్టు, "ఏం జరిగిందండి?" అని అడిగాడు లెఫ్టినెంటు.

కెప్టెన్ అతన్ని పక్కకు నెట్టేశాడు.

"వాళ్లొస్తున్నారు! కమ్యూనిస్టులొచ్చేస్తున్నారు!" కిటికీ బయట వీధిలో ఎవరో సంతోషాతిరేకంతో అరుస్తున్నారు. ఆ మాటలు ఏవోళ్ హృదయంలో తీక్ష్ణంగా గుచ్చుకున్నాయి.

"బ్రహ్మాండంగా ఉంది కదూ, ఔనా?" అని గొణుక్కుంటూ, బయట జీను అమర్చబడి సిద్ధంగా వున్న తన గుర్రం దగ్గరకి పరిగెత్తాడు. అతను తన పాదాన్ని రికాబులో పెట్టాడు, కాని, యింతలోనే గులంబారొవ్ అతని పైన తుపాకి కాల్చిన కారణంగా, అతనికి గుర్రం పైకెక్కే అవకాశం లభించలేదు. ఏవోళ్ గిర్రున తిరిగి లెఫ్టినెంటు వంక రూక్షంగా చూస్తూ తన రివాల్వరు పైకెత్తాలని ప్రయత్నించాడు, కాని అంతలోనే అతని కళ్లు బైర్లు కమ్మాయి, నేల పైకి ఒరిగిపోయాడు.

గులంబారొవ్ తన కెప్టెను గుర్రంపై ఊరివీధిలో దౌడుతీశాడు. అకస్మాత్తుగా తుపాకి కాల్పు వినిపించింది. రౌతులేని గుర్రం వెనక్కి తిరిగింది. రైఫిలు చేతధరించిన ఒక రైతు ఆ గుర్రాన్ని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. కాని, గులంబారొవ్ కొరడా దెబ్బల మూలంగా పొట్లు పెడుతున్న శరీరంతో, అతను దాన్ని లొంగదీసుకోలేకపోయాడు.

ఎర్ర సైనిక దళాలు గ్రామంలో ప్రవేశించాయి. వాళ్లంతా దుమ్ము కొట్టుకొని, అలసిపోయి వున్నారు, కాని సంతోషంగా ఉన్నారు. స్త్రీ పురుష బాలాదులతో కూడిన ఒక గుంపు వారి చుట్టూ చేరింది. వాళ్లు సైనికులను కౌగలించుకున్నారు. వాళ్లతో కరచాలనం చేశారు, స్త్రీలు వాళ్లకి కుండలకొద్దీ చల్లని పాలు యిచ్చారు.

దినపాదాల వాజాన్ తన రాతి గది గడపలో తన కొడుకు నెత్తుకొని నిలబడింది. తన సైపాన్ కోసం ఆతృతగా వెదుకుతూ, ఎర్ర సైనికుల ముఖాలను పరీక్షగా చూస్తోంది.

నల్లని ఆకాశం నక్షత్రఖచితమై వుంది. నడి నెత్తినా, అంతకన్న చాలా క్రిందా కూడా నక్షత్రాలున్నాయి. సైపాన్‌కి తానెక్కడున్నదీ బోధపడలేదు. ఈ నల్లని ఆకాశమూ, యీ చల్లని నక్షత్రాలూ ఎక్కడివబ్బా? అతను తన స్మృతిని కూడ దీసుకోవాలని ప్రయత్నించాడు. ఉక్కులా బరువుగా వున్న తన కనురెప్పలు మూత పడి పోతున్నట్టు అతనికి అనిపించింది. ఇప్పుడు వాటిని మూత పడనిస్తే అవి శాశ్వతంగా మూత పడిపోవడమేనని అతను గ్రహించాడు. అతను తన కుడి చేతిని కదపలేకపోతు న్నాడు. దానిలో చేతన లేదు. సైపాన్ తన ఎడమ చేత్తో చల్లని తుషార బిందువులు

పొగు చేసి, దాన్ని తడియారిపోయిన తన పెదవుల పైనా, మండుతున్న తన నుదుటి పైనా, కళ్ల పైనా పెట్టుకున్నాడు. పైకి అనంతమైన అంధకారంలోకి చూశాడతను. అందులో అనంతకోటి జ్వాలలు తెల్లగా మండుతున్నాయి, కాని రాత్రి చీకటిని అవి చెదరగొట్ట లేకపోతున్నాయి. అన్నీ క్రమంగా మరింత నల్లగా దట్టంగా తయారవుతు న్నాయి. తెల్లని జ్వాలలు ఆరిపోతున్నాయి. ఇప్పుడవి మినుకు మినుకుమంటూ, పర్వత గుహ నివాస గృహాల్లోని దీపం బుడ్లలా చిన్న చిన్న పసుపుపచ్చని దీపాల్లా మారాయి. స్తెపాన్ కిప్పుడు తను గరుడ పర్వతం పైన యిక వెంత మాత్రం లేనని, యింటికి తిరిగి వెళ్లానని అనిపిస్తోంది. తెరిచిన ద్వారం గుండా తన పల్లెలోని దీపాల నివ్వడతను చూడగలుగుతున్నాడు. ప్రతి యింట్లోనూ మినుకు మినుకుమనే పసుపు పచ్చని దీపా లున్నాయి. దీపాల యీ కదలికల్లో ఆదుర్దా, ఏదో తెలియని భయమూ ఉన్నాయి. పెద్దగా దావీద్ ఏడుపూ, లేస్తూనే వాజాన్ సుమధురమూ, సుపరిచితమైన అవులింతా, అటు తర్వాత, ఉయ్యాల ఊగేటప్పుడయ్యే లయబద్ధమైన కిర్రుకిర్రు శబ్దమూ వినాలని అతను ప్రతీక్షిస్తున్నాడు.

బరు వెక్కిన అతని కనురెప్పలు అంతకంతకు దగ్గర పడటంతో పసుపుపచ్చని మిణుగురుపురుగులు క్రమంగా కాంతి తరిగి, ఒక దాని తర్వాత ఒకటిగా ఆరిపో సాగాయి. మరో సారి స్తెపాన్ తుషార బిందువులను చేతిలోకి తీసుకొని దానితో మండుతున్న తన నుదుటినీ, తడారిపోయిన పెదవులనీ తడువుకున్నాడు. అతని బుర్ర మళ్లీ తెరిపిన పడింది. రాత్రి చీకట్లోని జ్వాలలు ఇప్పుడు మళ్లీ ప్రకాశంగా జ్వలించాయి. తను గరుడ పర్వతాగ్రం పైన ఉన్నానని, యివి నక్షత్రాలని స్తెపాన్‌కి అకస్మాత్తుగా గుర్తొచ్చింది. అతను ప్రయత్నం మీద గుర్తుచేసుకున్నాడు: తన రైఫిలు, సూర్యకాంతిలో మునిగి వున్న పచ్చని లోయపై మృత్యువును వర్షిస్తున్న మరతుపాకిని స్తంభింపచేసేందుకుగాను తను కాల్చిన కాల్పు. మరతుపాకిని మరోసారి నోరు మూయించిన తన రెండవ కాల్పు. ఎర్ర సైనికులు తమ కందకాల్లోంచి బయటకు దూకి కనుమలోకి పరుగెత్తడం. అప్పుడు తను మళ్లీ తన రైఫిలు కాల్చాడు, ఈ మారు దష్నాక్ కమాండరు పైకి, కాని, తన గురి తప్పింది. ఎర్ర సైనికులు లోయను చేరుకున్నారు. ఈ మారు వాళ్ళ ఎక్కువ వరుసలు తీరి, తమ ఎర్ర జెండా సూర్యకాంతిలో జాజ్వల్యంగా ప్రకాశిస్తూం డగా ముందుకు వేగంగా సాగిపోయారు.

"వాళ్లే కనక... ధర్మపరులూ... దయాపరులూ అయితే... అప్పుడిక నా కొడుకు సుఖంగా సంతోషంగా జీవిస్తాడు...."

కాని, మరో మారు అతని కనురెప్పలు బరువెక్కి మూతలు పడ్డాయి. తడారి

పోయిన అతని పెదవులు దాహంతో భగ్గు మంటున్నాయి. అతని గుండె మండిపోతోంది.

అచేతనంగా వున్న అతని చేతి నుంచి రక్తమింకా స్రవిస్తూనే వుంది. కొండ గడ్డీ, రాత్రి వికసించే గడ్డి పూలూ అతని రక్తంలో నానుతున్నాయి. స్టైపాన్ నిస్సహాయంగా, అంతులేని నీలిసిరా సంద్రం వంటి నిశిలో మునిగిపోయాడు.

* * *

బయట నుంచి పకపక మంటూ నవ్వులూ, గింగురుమనే బాల్యస్వరమూ, ట్రామ్ కార్ల గణగణ శబ్దమూ, ట్రాఫిక్ శబ్దాలూ వినిపిస్తున్నాయి.

చదువుల గదిలో మధ్యవయస్కుడైన ఒక పండితుడు పురాతన లిపి చెక్కబడి వున్న కాల్చిన మృణ్మయ ఫలకాన్ని పఠించేందుకు తంటాలు పడుతున్నాడు. బార్లా తెరిచి వున్న కిటికీల గుండా గాలితరగ లోపలకు చొరుచుకొచ్చి నెరసిన అతని బూడిద రంగు జుట్టునూ, అతని కాగితాలనూ చెదరగొడుతోంది. కాని ఆ పండితునికి యీ మంద పవనం సంగతి గాని, వీధిలోని కలకలం సంగతి గాని ఏమీ పట్టినట్లు లేదు. అతను సుదూర గతంలో మునిగి వున్నాడు, మోటారు వాహనాలు లేని కాలంలో, పైకి ఆకాశంలోకి ఎగిరే విషయంలో కలలు గంటున్న కాలంలో, నగరాల చుట్టూ, కూచి ఆకారపు అక్షరాలు గోడ యిటుకల్లో తొలచబడిన కాలంలో అతను మైమరచి విహరిస్తున్నాడు. ఈ అక్షరాల అర్థమేమిటో గ్రహించేందుకు గాను అతను బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాడేమో, అతని నుదురంతా సన్నని చెమట బిందువులతో నిండి ఉంది.

వారం తర్వాత వారం గడుస్తోంది. అతని సిగరెట్లు బూడిద గుట్టలవుతున్నాయి. ఇప్పుడతని జుట్టులో తెల్లని పాయలేర్పడ్డాయి. అయినా అతను తన పట్టుదల విడవ లేదు. అభేద్యంగా వున్న యీ గత కాలావశేషపు రహస్యాన్ని అతనెలాగైనా ఎప్పటికైనా భేదించి తీరుతాడు!

అతని చదువుల గది తలుపు దఢాలున తెరుచుకుంది, "నాన్నా!" అని అరుస్తూ, ఓ కుర్రాడు లోపలకి పరుగెత్తుకొచ్చాడు.

గింగురుమనే ఆ బాల్యస్వరం అతన్ని గతంలోంచి ప్రస్తుతంలోకి తీసుకు రావడంతో పండితుడు తన తల పైకెత్తాడు.

"ఇలారా, స్టైపాన్" అంటూ అతని భుజాల చుట్టూ చేతులేశాడు.

"ఆ పాత యిటుకపెళ్లల కేసి చూస్తూ నువ్వంత సేపెందుకు గడుపుతావు, నాన్నా?"

"ఎందుకంటే, నీ పూర్వీకులను గురించి నువ్వు మరింత ఎక్కువ తెలుసుకోవాలని, వాళ్ళేం చేశారో, ఎలా జీవించారో మరింతగా నువ్వు తెలుసుకోగలిగేందుకని."

కుర్రాడు చిరునవ్వు నవ్వి ఆ ఫలకాల మీదకి వంగాడు. అతని తండ్రి తన కుర్చీలో వెనక్కి జేరబడ్డాడు. వీధుల్లో శబ్దాలు మరో మారు మందగించాయి. కుర్చీ చేతి మీద వున్న తన చేతి వంక అతను సాలోచనగా తేరిపార చూసుకున్నాడు. దానిలో యిటీవల వృద్ధాప్యపు లక్షణాలు కనిపిస్తున్నాయి. అతను తన యవ్వనాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు. తనకెన్నడూ బొత్తిగా తెలియని తన తండ్రిని గురించి తలుచుకొని మరో మారు అబ్బురపడ్డాడతను. అతని తండ్రి యీ లోకంలో ఒక్క స్మృతిచిహ్నాన్ని కూడా, చివరకు తన ఫోటోను సైతం వదల్లేదు. అతని తండ్రి ఒక చీకటి రాత్రి పూట, మూల గుప్త స్థానంలో వున్న రైఫిలు తీసుకుని, "నేను వెళ్ళొస్తాను!" అని చెప్పి వెళ్లి పోయాడని అతని తల్లి అతనితో చెప్పింది. ఆ పోత పోత ఆయన మళ్లీ తిరిగి రాలేదు.

ఆ పండితుడు యీ రహస్యాన్ని మాత్రం ఎన్నడూ తెలుసుకోలేదు. తన తండ్రి అస్థికలు దుర్గమమైన గరుడ పర్వత శిఖరంపై ఉన్నాయన్న సంగతి అతని కెన్నడూ తెలియదు. తన తండ్రి సాహసమూ, మరణమూ, తనకి తన జీవితంలో అవకాశాలు సమకూర్చి పెట్టాయనీ, గతంలోకీ, భవిష్యత్తులోకీ తొంగి చూడగల పండితుడయ్యేందుకు తనకు అవకాశం కల్పించాయన్న సంగతి మాత్రం అతనికెన్నడూ తెలియదు.

రాచీయ కొచార్

రాచీయ కొచార్ (1910–1965) పశ్చిమ ఆర్మీనియాలో జన్మించాడు.

కొచార్ తన తొలి పెద్ద రచన అయిన "వాన్ వెర్దియాన్"ని 1934లో రాశాడు. దాని తర్వాత ఆయన "ఒగ్సెన్ వమ్ప్యార్ యాత్ర" (1937) ప్రచురింప బడింది. ఈ రెండు పుస్తకాలూ మేధావులను గురించినవే. ఎంతో కవితాత్మకమైనవి, రచయిత పౌర చైతన్యాన్ని ప్రతిబింబించేవే.

జర్మన్ ఫాసిస్టులతో యుద్ధ కాలమూ (1941–1945), యుద్ధానంతర కాలమూ యీ రచయిత జీవితంలో అత్యంత సృజనాత్మకమైన దశ. యుద్ధ విలేకరిగా కొచార్, నాజీలకు వ్యతిరేకంగా సోవియట్ ప్రజలు జరిపిన వీరోచిత పోరాటానికి ప్రత్యక్ష సాక్షి. ఆ దశలో ఆయన రాసిన వ్యాసాలూ, కథానికలూ "ప్రాంగణం" (1942), "వీరులు పుడతారు" (1942), "పవిత్ర ప్రమాణం" (1945) పేర మూడు సంపుటాలలో వెలువడ్డాయి.

యుద్ధ సంవత్సరాల్లో ఆయన దర్శించిన విశేషాలూ, పొందిన అనుభవాలూ రెండు భాగాలుగా వెలువడిన ఆయన "పెద్ద ఇంటి పిల్లలు" (1953–1957) అనే నవలలో చిత్రింపబడ్డాయి. అత్యంత ఆసక్తిదాయకమైన సమకాలీన ఆర్మీనియన్ నవలల్లో యిదొకటి.

జీవితేచ్ఛ

ఇంకా పూర్తిగా తెలివి రాకపోయినా అతను నెమ్మదిగా కనురెప్పలు పైకెత్తి, తేట్టైన కళ్ళతో చుట్టూ కలయజూశాడు. అతని శరీరానికి స్పర్శజ్ఞానమింకా చేకూర లేదు, పైన్ అడవిలోంచి నిరంతరాయంగా వెలువడుతున్న తుపాకి కాల్పుల శబ్దం అతని వీనులకింకా సోకడం లేదు. ఆ రోజున మిలమిల మెరిసే స్ఫటికస్వచ్ఛమయిన మంచుపొర ఒకటి చల్లని నీటి ఉపరితలాన్ని కప్పి ఉంది. పొలాల్లోని ఎండు గడ్డీ, ప్రొద్దు తిరుగుడు మోళ్ళూ, చెట్ల మీది ఆకులూ అన్నీ కూడా పిండి మంచుతో కప్పబడి వున్నాయి. రాబోయే శీతువు తొలి ఊర్పు యిది.

సూర్యకిరణమొకటి అతని కళ్ళలో గుచ్చుకుంది, అతని కణతల్లోనూ, తల వెనుక భాగంలోనూ మందమైన బాధ ఆరంభమైంది, నెమ్మదిగా అస్పష్టమయిన అయోమయావస్థ లోంచి, అతని పరిసరాలు రూపుదాల్చనారంభించి, వాస్తవ రూపాన్ని సంతరించుకుంటున్నాయి. కోసైన యింటికప్పుతో అదుగో ఒక యిల్లు, దగ్గర్లో ఉన్న కొండ పైనుంచి జీవ జంతువు నోటి వెంట వెలువడే వెచ్చని ఊపిరి లాగ ఆవిరి పైకి లేస్తోంది, కొన్ని చెట్లు కూడా ఉన్నాయక్కడ. కాని, ఆకులిలా తెల్లగా ఉన్నాయేమిటి చెప్మా? అతని శ్రవణశక్తి కూడా జాగృతమైంది, మొదట నిశ్శబ్ద వాతావరణంలో దూరాన ఉరుము ఉరుముతున్న శబ్దం, అటు తర్వాత, అంత కన్న దగ్గర్లో, చాలా దగ్గర్లో చారలకాకి కూతా అతనికి వినవచ్చాయి.

అనాలోచితంగా, అతను లేచేందుకు ప్రయత్నించాడు గాని, ఒరిగిపోయిన యింటి కప్పు మాదిరిగా, వెన్వెంటనే కూలిపోయాడు. తన ఎముకలన్నీ పళపళ మంటూ పెద్ద శబ్దంతో విరుగుతున్నాయా అనిపించిందతనికి. అంటే, తన మనస్సు పనిచేస్తోందన్న మాట, తనింకా బ్రతికే ఉన్నాడన్న మాట, అంటూ కొంత తృప్తి చెందాడతను.

అతని మనస్సు పునరుజ్జీవితం కాసాగింది. తన పేరు మికాయెల్ అన్న సంగతి అతనికి గుర్తుకొచ్చింది. తన పేరు అతని చెవుల్లో గింగురు మనసాగింది. అడవి లోంచి వెలువడే శబ్దాలను మించి తన పేరు అతనికి వినిపిస్తోంది.

చీకట్లు తొలగి పోతున్నాయి. వెల్తురు ప్రసరించ నారంభించింది. సూర్యుడు పైకి లేస్తున్నాడు. సూర్యుడు తీక్ష్ణమైన దృక్కులను అతడి నుండి మరలించుకోలేక పోతున్నాడా అనిపించింది. ఇప్పుడతను తన శరీర స్పృహను తిరిగి పొందాడు, కాలజ్ఞానం, పరిసరాల పరిజ్ఞానం తిరిగి అబ్బాయి. ఇప్పుడు ఫిరంగి మ్రోతలూ, మరతుపాకుల కట కట శబ్దం మరింత స్పష్టంగా, అంతకంతకు మరింత సన్నిహితంగా అతనికి వినవస్తున్నాయి.

తనెంత సేపు అక్కడ పడివున్నాడు? మందుగుండు గిడ్డంగిపై అంటించిన వ్యూజను తను విసిరేశాడు, తర్వాత, బ్రహ్మాండమైన ప్రేలుడు శబ్దంతో భూమి దద్దరిల్లింది, కారునల్లని పొగ తరగలుతరగలుగా లేచి అంతటినీ క్రైగప్పేసింది. ఆ పొగ లోంచి, చీకటి లోంచి తన క్రామేడ్సు ముఖాలూ, బొద్దుగా బలిష్ఠంగా వుండే తన జనరల్ ఆకారమూ అతనికి కానవచ్చాయి.

తన శక్తినంతటినీ కూడదీసుకొని, అతను ఒత్తిగిలి, పాక నారంభించాడు. ఊపిరి కోసం బాధగా రొప్పుతూ, పైకి లేస్తున్న సూర్యుని దిశగా అతను పాకుతున్నాడు. అతని తల తిరుగుతోంది, అతని కాళ్ళు కొయ్యబారినట్లయ్యాయి. అతను గడ్డిలో, ఇంకిపోయిన ఏటిపాయల్లో ఫిరంగి మ్రోతలు వింటూ, అతి తరచుగా తన దిశ మారుస్తూ, ముమ్మందుకు పోతూ, మరింత తరచుగా మధ్యమధ్య విశ్రాంతి కోసం ఆగుతున్నాడు. ఇప్పుడతనికి తను రక్షింపబడగలనన్న ఆశ కలిగింది.

అతనా పగలంతా, రాత్రంతా, తన ముక్తికి చిహ్నమయిన నది ఒడ్డును ఒక్కొక్క మారు సమీపిస్తూ, అంతలో దానికి దూరంగా వెళ్తూ పాకాడు. మూడవ రోజు ఉదయం అతనికి సాయుధ అశ్విక గస్తీ సైనికు డొకడు తగిలాడు.

"నన్ను జనరల్ పన్ఫీలొవ్ దగ్గరకి తీసుకెళ్ళు" అని అతనితో చెప్పి మికాయెల్ స్మృతి కోల్పోయాడు. అంతే, అతని స్థల, కాల జ్ఞానం లుప్తమైపోయింది.

సైనికులు ఎలాగైతేనేం అతని పెదవులు తెరిచి, అతని గొంతులో కొంచెం ఒడ్కా పొయ్యగలిగారు. ఆహ్లాదకరమైన వెచ్చదనం అతని శరీరంలో వ్యాపించింది. క్షతగాత్రుడు అప్పుడే మరుగు పడిపోబోతున్న భౌతిక ప్రపంచానికి తిరిగి వచ్చాడు. అప్పుడతని నోట్లోకి ఓ రొట్టె ముక్కని పెట్టారు. అతను నెమ్మదిగా దాన్ని కొరికి నములుతూ తనెంత పూర్తి నిస్త్రాణలో వున్నాడో గ్రహించాడు.

అప్పుడు తిరిగి మళ్లీ పరిచిత ముఖాలు అతని కళ్ల ముందు కదిలాయి, కాని యిప్పుడవి, అలసిపోయి, గజిబిజిగా ఉన్న తన మనస్సు ఊహించుకొన్న అస్పష్ట ఆకృతులు కావు, నిజమైన ముఖాలవి.

పెద్ద ప్రయత్నం మీద, "తిఖోన్!" అంటూ అతను బిగ్గరగా పిలిచాడు, ఆ ప్రయత్నక్రమంలో అతని ముఖం కందిపోయింది.

వెచ్చని అరిచెయ్యొకటి అతని నుదుటిపై ఆనింది. అచ్చే తను కలగనడం లేదు, అది జనరల్ పన్‌ఫీలొవే.

"ఓర్చుకో బాబూ, ఓర్చుకో."

మూడు రోజుల క్రితం "వెళ్లు. నీలో మాకు పూర్తి నమ్మకముంది!" అన్న ఆందోళిత స్వరమే అది.

"అతనికి మరో గ్లాసుడివ్వండి" అని జనరల్ చెప్పడం అతను విన్నాడు.

మికాయెల్ ఒడ్కా తనే తాగేసి, ఖాళీ గ్లాసును జనరల్ ప్రక్క నిలబడి వున్న సైనికునికి అందించాడు.

"నువ్వు చచ్చిపోయా వనుకొన్నాం సుమా" అని పన్‌ఫీలొవ్ చిరునవ్వు నవ్వాడు. "మేము సంతాపసభ కూడా జరిపాం. నువ్వేమో మళ్లీ వెనక్కి తిరిగొచ్చావు. నిన్నిక్కడ మళ్లీ మా మధ్య చూడటానికి మేమెంత సంతోషిస్తున్నామో నేను మాటల్లో చెప్పలేను."

మికాయెల్ జనరల్ వంకా, ఆయన చుట్టూ వున్న సైనికుల వంకా ఆశ్చర్యంగా విప్పారిన కళ్లతో చూశాడు, వాళ్ల మాటల అర్థాన్నీ, అబ్బురపాటుతో మిళితమయిన వాళ్ల మందహాసాల అర్థాన్నీ అతడు గ్రహించాడు.

"చచ్చినందువల్ల ప్రయోజన మేమిటి? నేను బ్రతకాలని కోరుకుంటున్నాను."

"భేష్! అలాగన్నావు, బాగుంది!" అన్నాడు జనరల్. "చావడానికేముంది, ఎవ్వ డైనా చావచ్చు. పైగా దానికి పెద్ద తెలివితేటలు కూడా అక్కర్లేదు."

మికాయెల్ మనస్సిప్పుడు తేటగా వుంది, అన్నీ అతని మనస్సులో స్పష్టంగా మెదులుతున్నాయి.

"నేను విజయోత్సవ దినం దాకా బ్రతకాలనీ, నాజీల ఓటమిని కళ్లారా చూడాలనీ కోరుకుంటున్నాను. ఈ రెండూ చూశాక, అప్పుడిక చచ్చిపోవడానికి నాకేమీ అభ్యంతరం లేదు."

జనరల్ పకాలున నవ్వాడు. తర్వాత, తన పక్క నున్న సైనికుని వంక తిరిగి, యిలా అన్నాడు: "తిఖోన్, నువ్వే నాకు సాక్ష్యం: విజయోత్సవ దినం వచ్చి తీరుతుంది, కాని అప్పుడు మికాయెల్ చచ్చిపోవాలని ససేమిరా కోరుకోడు."

ఇది 1941 అక్టోబరు నాటి మాట.

మరఫిరంగి మ్రోతలకు భూమి దద్దరిల్లుతోంది.

* * *

రోజులూ, వారాలూ గడిచాయి. ఎక్కడ చూసినా శవాలు చెల్లాచెదరుగా పడి వున్నాయి. జనరల్ వన్‌ఫీలొవ్ యుద్ధంలో నేలకొరిగాడు. వన్‌ఫీలొవ్ సైనిక డివిజనుకి చెందిన వీరులు, మికాయెల్ షేత్రొస్యాన్ క్రామేడ్సు మాస్కో పొలిమేరల్లో నిహతు లయ్యారు. వాళ్ల పేర్లు చరిత్ర పుటల్లో స్వర్ణాక్షరాలతో లిఖింపబడ్డాయి. తీవ్రమైన శీతకాలం గడిచిపోయింది. ఇప్పుడిక కరుగుతున్న మంచు, గత వత్సరపు రక్తపుచారికలను తుడిచివేస్తూ నేలలోకి యింకిపోయింది.

మరల వసంతం వచ్చింది. పంట పొలాలు, పళ్ల తోటలు, చెట్ల బారులు మరోమారు పచ్చబడ్డాయి. నేలకొరిగిన సైనికుల సమాధులపై తొలి పచ్చిక మొలిచింది. వసంతం వేసవిగా మారింది.

దక్షిణాదిన శత్రువు దోన్‌నది దాకా పురోగమించాడు. అటు తర్వాత దాన్ని దాటి, వోల్గా, కాకసస్‌ల దిశగా ముందుకు సాగిపోయాడు.

మరో ఆకురాలు కాలమొచ్చింది. మరో భయంకరమైన శీతకాలమొచ్చింది. యుద్ధానికి అంతమంటూ యిక ఉండదేమో ననిపించింది. ఈ కాలమంతట్లోనూ కూడా మికాయెల్, ఎప్పుడూ యుద్ధాగ్ని గుండం మధ్యనే వుంటూ, లక్ష్యశుద్ధితో ఆత్మసాక్షిగా పోరాడుతూనే ఉన్నాడు. ఒక్కొక్కమారు అతనికి, తన పరసన తనతో బాటు పోరాడిన సైనికులు తుపాకి కాల్పుల పొగ లోంచి, ఫిరంగుల గర్జనల మధ్యనుంచే పుట్టుకొచ్చారేమో ననిపించేది. యుద్ధం మినహా మరో జీవితం ఎన్నడూ లేదేమో, యిక ముందు కూడా ఉండబోదేమో ననిపించేది.

చిట్ట చివరకు చిరనిరీక్షిత క్షణం ఆసన్నమైంది. సోవియట్ సైన్యం ప్రపంచంలో ఏ శక్తికీ నిరోధించ సాధ్యంకాని బ్రహ్మాండమైన ఎదురు దాడిని ప్రారంభించింది. సోవియట్ సేనలు, మికాయెల్‌నూ, అతని క్రామేడ్సునూ తమతో కలుపుకొని ఉప్పెనలా ముందుకు సాగాయి. మికాయెల్ కళ్ల ముందు వందలూ వేలాది ముఖాలు తరలిపోయాయి. అవన్నీ తనకి పరిచితమైనవే ననిపించిందతనికి: బంగరు, రాగి వన్నె జుట్టు, స్లావ్ ముఖకవళికలు, తారు నలుపు కకేషియన్ కనుబొమలు, కళ్లూ.

తానెల్లప్పుడూ వీళ్ల మధ్యనే ఉన్నాననీ, వీళ్ల నుండి తానెన్నడూ విడిపోననీ అనిపించింది మికాయెల్‌కి.

అటు తర్వాత ఒక రోజున అతనికి యిక చావు తప్పదనిపించింది. మికాయెలూ, అతని క్రామేడ్సిద్దరూ సమాచార సేకరణ కోసం శత్రు సేనల వెనకభాగానికి స్కౌట్లుగా పంపబడ్డారు. పగటి పూట పొదల్లో దాక్కొంటూ, రాత్రి పూట తమ

సొంత సైనిక శ్రేణులకు తిరిగి వెళ్లేందుకు దోవ వెదుక్కుంటూ వాళ్లొక వారం రోజులు అరణ్యమార్గాల్లో తిరిగారు. వారిలో ఒకడు గాయపడడంతో మిగిలిన తామిద్దరూ వంతులవారీగా ఒకరి తర్వాత మరొకరు అతన్ని మోశారు. రాత్రిపూట చీకటిని మంటలూ, రాకెట్లూ చీల్చి చెదరగొడుతూండేవి. వాళ్ల సహచరుని అర్ధమృత దేహం వాళ్ల భుజాలను క్రుంగదీస్తూండేది. "శత్రు రక్షణవలయపు అగ్రశ్రేణి" అనబడే దాన్ని దాటి వెళ్తూండగా వాళ్లు ఒక ఊబిలో దిగబడ్డారు. మంచునీటిలో వాళ్ల పాదాలు బిగిసి పిడచకట్టుకు పోయాయి. బంకగా వున్న బురద వాళ్ల రొమ్ముల దాకా వచ్చింది. శత్రువుల తుపాకిగుళ్లు కసిగా రాత్రి ఆకాశాన్ని చీలుస్తున్నాయి.

క్షతగాత్రుని వెచ్చని నెత్తురు మికాయెల్ మెడ మీదుగా బొట్లు బొట్లుగా కారుతోంది. "మృత్యువలయం" దాటగానే అతను తన కామ్రేడ్‌ను నేల పైన పడుకోబెట్టాడు.

నిన్నటి రోజున జరిగిందిది. ఈ రోజున, వాళ్లిద్దరు మాత్రమే ఉన్నప్పుడు, ఒత్తుగా పెరిగిన గడ్డి గుండా వాళ్లు అడవిని దాటారు. చెట్లు సువాసనలు వెదజల్లుతున్నాయి. మికాయెల్ గాయపడిన తన కాలితో కుంటుతూ, తీఖోన్ భుజాన్ని ఆసరా చేసుకు నడుస్తున్నాడు. గడ్డి వాళ్ల కాళ్ల క్రింద పరపరమని సవ్వడి చేస్తోంది. ఎక్కడా మబ్బు తునక కూడా లేకుండా నీలాకాశం నిర్మలంగా ఉంది. అయితే, అడవికి అవతల తుపాకి మ్రోతలు పిక్కెట్లు వాళ్ల యూనిట్‌ను చేరుకోకుండా యింకా అవరోధంగా ఉన్నాయి.

తీఖోన్‌కి ఏదో మాట జ్ఞాపకం వచ్చి, కిసుక్కున నవ్వాడు. "నువ్వు మన దాడి కోసం ఎంతగా తపించావో జ్ఞాపకముందా? దాడి జరిగే దాకా బ్రతికి వుంటే, అప్పుడిక చచ్చిపోయినా బాధపడనన్నావు. మన జనరల్‌కి నువ్వు చెప్పింది యిదే మాట, కాదా? అందుకని ఆ టైమొచ్చిందనుకొంటాను!"

"ఏమిటి, చచ్చిపోవడానికా? నీకేమన్నా మతిపోయిందా! యుద్ధంలో పూర్తిగా విజయం సాధించకుండా చచ్చిపోవాలనుకునే వెర్రివాడెవడైనా ఉంటాడా? మన దేశం విముక్తం కావడాన్ని నేను చూడనే చూడనంటావా? అబ్బే, అదేంకాదు. మనం మన సరిహద్దు చేరుకుని, మన స్వతంత్ర దేశం వంక వెనుదిరిగి కళ్లారా చూశాక, అప్పుడిక నా గుండెలో ఒక గుండు దూసుకుపోయినా నేను లెక్కచెయ్యను. అప్పుడిక ఎటువంటి కించా లేకుండా నేను శాంతంగా ప్రాణాలు విడవగలను."

* * *

అవిరామంగా పోరాటం సాగుతోంది. వసంతం త్వరగా గడిచిపోయింది. అడవి గోధుమకంకులు భారంగా ఒరిగివున్నాయి. యుద్ధం ప్రారంభమయ్యాక యిది వాళ్ళ వ వేసవి. రోడ్ల దుమ్ము సైనికుల ముఖాలపైన, వాళ్ల రైఫిళ్ల, తుపాకుల పైన, టాంకుల పైన, ట్రక్కుల పైన, గుర్రాల జూలు పైన, అడవి గడ్డి పైన మందంగా పేరుకొని వుంది. ఒక్కొక్క బాంబు ప్రేలినప్పుడల్లా మట్టి నీటిబుగ్గలా పైకి చిమ్ముతోంది, బాంబు పెంకులు వడగళ్ల వర్షంలా కురుస్తున్నాయి. నేలతల్లి బాధతో అన్నట్లు మూలుగుతోంది. రోడ్లవెంబడి పట్టణాల్లోనూ, పల్లెల్లోనూ, సైనికులు పోరాటం జరిపిన అన్ని చోట్లా కొత్త సమాధులు చిన్న చిన్న దిబ్బల్లా లేస్తున్నాయి. ఎండవేడి దుర్భరంగా ఉంది. ఆటు తర్వాత కుండ పోతగా తెరిపి లేకుండా వర్షాలు కురవ సాగాయి. మరో కొత్త ఆకురాలు కాలం వచ్చింది, చెట్లు ఆకులు రాలుస్తున్నాయి, కొత్త పోరాటాలు జరుగుతున్నాయి.

ఒక రోజున మికాయెల్ ఒక నిర్జన గృహంలోని తన యూనిట్ ఫిరంగులను శత్రువుపై గురికి వీలుగా అమరుస్తున్నాడు. జర్మన్లు కొత్తగా ఎదురుదాడి చేసే సూచనలు కనిపిస్తున్నాయి. నాజీలు అతని రహస్య స్థావరం దిశగా ముందుకొస్తున్నారు. మికాయెల్ తన ప్రాణాన్ని సైతం లెఖ్ఖచెయ్యకుండా తన వంక కాల్పులు సాగించాల్సిందిగా తన యూనిట్‌ను ఆజ్ఞాపించాడు. అతని ఆజ్ఞ మేరకు ఫిరంగి గుళ్లు వర్షించాయి.

మికాయెల్ స్పృహ కోల్పోయాడు. తెలివి రాగానే అతనికి మొట్టమొదట తెలిసి వచ్చినది చేదువిషం లాంటి ద్రవమేదో తాను గుటక వేస్తున్నానని. "ఇతను బలే అదృష్టవంతుడు. ఇతనికి కనీసం గీరుకోనైనా లేదు" అంటూ సమీపంలో ఒక స్వరం వినవచ్చింది.

ఆ సాయంత్రమే అన్ని భాషల్లోనూ, సోవియట్ సైన్యం దేశ సరిహద్దును చేరుకుందన్న వార్త ప్రపంచ మంతటా మూల మూలలకీ ప్రసారం చెయ్యబడింది.

"నువ్వు మృత్యు దేవతని మళ్లీ బురిడీ కొట్టించావోయ్!" అంటూ అతని వంక తిరిగి తీఖాన్ చిరునవ్వు నవ్వాడు.

చిత చితలాడే కందకంలో వాళ్లిద్దరూ ఒకరి పక్క మరొకరు నడుం వాల్చారు. సన్నగా తుప్పర పడుతోంది. మికాయెల్ తన కామ్రేడ్ మెడచుట్టూ తన చెయ్యి చుట్టి "నేస్తం, నేనింకా చాలా కాలం బతుకుతా ననుకుంటాను!" అన్నాడు.

* * *

మరో ఆకురాలు కాలం గడిచింది, ఆటు తర్వాత మరో శీతకాలం గడిచి, మళ్లీ వసంతం వచ్చింది. మికాయెల్ కంపెనీ, రెజిమెంటూ శత్రువుకి చెందిన పట్టణాల గుండా, పల్లెల గుండా వెళ్తున్నాయి. విదేశపు దుమ్ము అతని బూట్లపై పేరుకుంది, నెత్తిపైన అపరిచితాకాశం వుంది. గులాబి పొదలపై మొగ్గలు విచ్చుకుంటున్నాయి. కాని ఫిరంగు లింకా గర్జిస్తూనే ఉన్నాయి. యుద్ధ వార్తల నింకా ప్రపంచం ఊపిరి బిగపట్టి ఆదుర్దాగా వింటూనే ఉంది.

మికాయెల్ పోట్స్‌డాంలో* ఆపరేషను టేబిలు పైన ఉన్నాడు. గాయపడిన అతని శరీరంలోని ప్రతి అంగుళం భగ్గున మండుతోంది.

మృత్యువు మరోమారు అతని శరీరాన్ని ఆవహించింది. శస్త్రవైద్యుడు అతని పైకి వంగాడు. ఇప్పుడు మళ్లీ మరో సారి ప్రపంచంలోని సమస్తం, చివరకు తమా విస్మృతి సుడిగుండంలో పడిపోయాడు. సునిశితమైన కత్తి అతని రొమ్మును చీల్చి తెరిచింది.

మికాయెల్ ఆరోజున మరోమారు మృత్యువుతో పోరాడి జయించాడు.

విజయోత్సవ దినం సందర్భంగా బాణసంచా కాల్పుల కోసం వాళ్ళు ఎదురు చూస్తున్నారు. మే మాసపు ఒక సూర్యాస్తమయం ఆస్పత్రి కిటికీల వెనకగా క్రమంగా మాసిపోతోంది.

"నా మంచాన్ని కిటికీ దగ్గరికి యీడుస్తారా" అన్నాడు మికాయెల్.

అతని మంచాన్ని కిటికీ దగ్గరకీడ్చారు. క్షతగాత్రుడు కిటికీ గుండా విశాలమైన బహిరంగ ప్రదేశాలను తనివిదీర చూశాడు. ఆ సాయంత్రం మికాయెల్ బాణసంచా ప్రేలుళ్లను వీనులవిందుగా విన్నాడు. విదేశ నీలాకాశాన్ని విజయోత్సవ దీప కాంతి పుంజాలు ప్రకాశవంతం చెయ్యడాన్ని కన్నుల పండువుగా తిలకించాడు.

పచ్చని పర్వత సానువులతో, లోతైన లోయలతో కూడిన అతని జన్మభూమి ఎంతో దూరాన వుంది. అద్భుతావహమైన కథలతో, తన జన్మస్థానమైన పల్లెప్రాంతపు స్మృతులతో కూడిన అతని బాల్యం అతన్ని చూసి మందహాసం చేసినట్లు నిపించింది. మాస్కో కూడా చాలా చాలా దూరాన ఉంది. అక్కడ, రాజధాని పొలిమేరల్లో, అతను తన మొదటి విజయవంతమైన పోరాటం జరిపాడు. తన సైనికుల పట్లా, యుద్ధంలో తమ విజయం పట్లా అంతటి మహత్తర విశ్వాసం కలిగిన వీరుడైన తన జనరల్ సమాధికీ తనకీ మధ్య వేలాది కిలోమీటర్ల ఎడముందిప్పుడు.

---

* బెర్లిన్ సమీపంలో ఒక పట్టణం. — సం.

మరునటి ఉదయం తీఖొన్ అతన్ని చూడటానికి వచ్చాడు.

"నేస్తం, నువ్వు మృత్యువుని మరో సారి బురిడీ కొట్టించావ్! నీకు త్వరలోనే నయమవుతుంది, తప్పకుండా నయమవుతుంది, ఎందుకంటావేమో, ఇప్పుడిక నసేమిరా చచ్చిపోవాలని కోరుకోవు కదా నువ్వు."

మికాయెల్ పకపక నవ్వాడు. "నువ్వు సరిగా చెప్పావు. మనమింకా యింటికి తిరిగి వెళ్లాలి. జీవితంలో మనం చూడాల్సిందింకా బోలెడంత ఉంది. నేను బతకాలని కోరుకుంటున్నాను!"

"నువ్వొక్కడివే కాదు. మనమంతా పోరాడుతున్నదే అందుకు, నేస్తం, బతకడానికే."

అది 1945 మే.

విగేన్ హెచుమ్యాన్

విగేన్ హెచుమ్యాన్ (1916–1975) ఎరెవాన్‌లో జన్మించాడు. తండ్రి ఆఫీసు ఉద్యోగి. 1941లో ఎరెవాన్ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగం నుండి పట్టా తీసుకు న్నాడు. ఆయన విద్యార్థిగా ఉండగానే రచనా వ్యాసంగం ప్రారంభించాడు. కాని 1941లో యుద్ధం ప్రారంభం కావడంతో ఆయన రచనా పథకాలు దెబ్బతిన్నాయి.

హెచుమ్యాన్ చారిత్రక నవలికల ప్రథమ సంపుటి 1943లో వెలువడింది. మధ్యయుగ వాతావరణంలో రచింపబడిన ఆ కథలన్నింటికీ ఆర్మీనియన్ పురాతన వ్రాత ప్రతులూ, కథలూ గాథలే ఆధారం.

హెచుమ్యాన్ రచించిన ఒకే నవల "జీవ గ్రంథం" (1967) విశేషంగా ప్రజాభిమానాన్ని చూరగొన్నప్పటికీ కథా రచయితగానే ఆయన ప్రసిద్ధుడు.

వంతెన

తాపీమేస్త్రీ నావాసార్ద్ రోడ్డు కేసే తదేకంగా చూస్తున్నాడు. తన ఏకైక పుత్రుడు ఆర్మేనాక్‌తో కలిసి తనీ కొత్త వంతెన నిర్మాణాన్ని పూర్తి చేద్దామనుకున్నాడు. వాడి రాక కోసం అతను కళ్లు కాయలు కాసేలా చూస్తున్నాడు. వంతెన కమాను యిప్పటికే నీటిపైకి ఎత్తుగా లేచింది. కట్టడం పని మంచి ముమ్మరంగా సాగుతోంది. తను త్వరలోనే పటాలం నుండి విడుదల చెయ్యబడబోతున్నట్లు జర్మనీ నుండి రాసిన తన కొడుకు యింతవరకు రాలే దేమిటా అని నావాసార్ద్ మథన పడుతున్నాడు.

ప్రతి వసంత కాలమూ, పర్వతం పైనుంచి ఉప్పొంగి పరవళ్లు తొక్కుతూ ప్రవహించే నది ఉరవడికి లెర్నాషెన్ దగ్గరున్న చిన్న కొయ్య వంతెనలో కొంత భాగం కొట్టుకుపోతూ ఉంటుంది. దానితో అనేక వారాల పాటు ఆ గ్రామస్తులకు మిగిలిన ప్రపంచంతో సంబంధాలు తెగిపోతూ ఉంటాయి. వసంత కాలపు వరదలు వెనకపట్టగానే, తమకి చేతనైనంతలో ఆ వంతెనని వాళ్లు మరమ్మతు చేసుకుంటూ ఉంటారు. అయితే యీ సంవత్సరం, వరదల్లో మొత్తం వంతెన ఐవూ ఆనవాలూ లేకుండా సమూలంగా కొట్టుకుపోయింది. దానితో లెర్నాషెన్ గ్రామ ప్రజలు వంతెన నిర్మాణంలో నిపుణుడైన నావాసార్ద్‌ని రాతి వంతెన నిర్మించాల్సిందిగా కోరారు. అదుగో అందుకనే, ఆ వృద్ధుడు, తన కొడుకింకా తిరిగి రాకముందే వంతెన నిర్మాణం మొదలుపెట్టాడు.

కొత్త వంతెన కట్టే చోటు నావాసార్ద్‌కి చిన్నప్పట్నుంచీ బాగా తెలుసు. నది జన్మ స్థానం దాకా వెళ్లి చూసివచ్చాడు. నది దిగువన తన తాత లుంకియానొస్ కట్టిన మూడు కమాన్ల అందమైన వంతెనని కూడా నావాసార్ద్ చూశాడు.

నది పర్వతాలపై నుంచి క్రిందికురికి, రెండు గట్టి కొండల నడుమ గల యిరుకైన లోతైన కనుమ గుండా ప్రవహిస్తోంది.

దాని రెండు గట్ల పైనా బాదం చెట్లూ, సీమ చింత చెట్లూ, విల్లో చెట్లూ బారులు తీరి వున్నాయి. లేత విల్లో కొమ్మలు దాదాపు నీటి అంచుపైకి వంగి వున్నాయి. రంగు రంగుల రకరకాల పూలతో ఆ కనుమ కన్నులకింపుగా ఉంటుంది.

జూలై మాసపు మండుటెండలకు, వసంత కాలపు పచ్చని మొక్కలు అక్కడక్కడ మాడిపోగా, యిప్పుడక్కడ వెడల్పాటి వాడి రేకుల గడ్డి కొత్తగా మొలుచుకొచ్చింది. ఉదయ వాయువులకు ఆ గడ్డి రెపరెపమని శబ్దం చేస్తూ అటూ యిటూ ఒరుగుతోంది.

ఉదయం నుంచి సాయంత్రం దాకా నడుమెత్తకుండా పని చేస్తున్నాడేమో, వేసవి తెచ్చిన ప్రకృతి శోభను నావాసార్ద్ గమనించనే లేదు.

సాయంత్రం వేళ కార్మికులు రాత్రి విశ్రాంతి కోసం లెర్నాషెన్ గ్రామాని కెళ్తారు. కాని, నావాసార్ద్ మాత్రం, చిట్టచివరి రాతిని సైతం సరైన స్థానంలో పొందించాక, తన గుడారాని కెళ్లి, అక్కడ కూర్చుని చురుకైన తన కళ్లతో కనుచూపు మేర దాకా పరిశీలనగా చూస్తూ ఆలోచనల్లో మునుగుతాడు.

నది నీటిలో ఇంకా పూర్తి కాని కమాను భాగాల నీడను చూస్తూ దాని వెంట తన చూపులను యీ చివర నుండి అవతలి గట్టు దాకా బరపుతూ కమానును పూర్తి చేస్తున్నట్లు ఊహించుకోవడమంటే అతనికి మహా యిష్టం. ఖాళీని అతను మానసికంగా పూర్తి చేస్తూ, యింకా పూర్తి కాని వంతెన అంచును, యినుప కమ్మీల నిర్మాణాన్ని ఊహించుకొంటూ చివరి వెలుగు రేకల్ని చీకటి మింగి రాత్రి పడే దాకా గడుపుతూండేవాడు.

తన తండ్రితాతలందరూ వంతెన నిర్మాతలే. నిత్యం, తను నిద్ర పోయేలోగా వాళ్లని గురించి ఆలోచించడమంటే నావాసార్ద్‌కి మహా యిష్టం.

అతని తండ్రి ఖాచాటూర్ లాగే అతని తాత కూడా రాతి వంతెనలు కట్టాడు. అతని తండ్రి మహా పట్టుదల మనిషి. సంప్రదాయాలను తు చ తప్పకుండా పాటించే మనిషి. తన కొడుకు ఆర్మేనాక్ తన సరసన పనిచేస్తూ వృత్తి నేర్చుకున్నట్లే, తనూ తన తండ్రి పక్క పనిచేస్తూ ఆయన వృత్తిని నేర్చుకున్నాడు.

"ఆర్మీనియాలో విశృంఖలంగా ప్రవహించే నదులపై నా వంశీకులు వంతెనలు నిర్మించబట్టి యిప్పటికి డెబ్బై అయిదేళ్లయి వుండాలి. అంటే దాదాపుగా ఒక శతాబ్దమన్న మాట" అనుకున్నాడు నావాసార్ద్. "ఏమో వాళ్ల కన్న ముందు వాళ్ల తండ్రి తాతలు యిదే వృత్తిని అవలంబించలేదని ఎవరు చెప్పగలరు? సాక్ష్యాలన్నీ యిక్కడ, ఎట్ట ఎదుటే వున్నాయి: వంద ఏళ్లకి పైగా కాలంలో, వంద ఏమిటి వెయ్యేళ్ల కాలంలో నిర్మించబడిన వందలాది చిన్నా పెద్దా వంతెనలు కళ్లెదుట వున్నాయి. నది

హేను లేక యిరవై తరాలంటే ఏమంత ఎక్కువ కానట్లు కనిపిస్తుంది గాని, లెక్కేసి చూసుకుంటే ఏ వెయ్యేళ్లో, లేక పదిహేను వందలేళ్లో తేలుతుంది."

తన కుటుంబ సభ్యుల శ్రమ ఫలితాలైన శిలా "సాక్ష్యా"లతో బాటు జరిగిన వనంతటినీ గుర్తు చేసుకొని, వృద్ధ వావాసార్డ్ తన ఆలోచనలు కొనసాగించాడు. అవి క్రమంగా సాగి అతని ప్రధాన భావానికి రూపమిచ్చాయి:

"అనాది కాలం నుంచీ నా తాతముత్తాతలు ఆర్మీనియా నదులపై వంతెనలు కడుతూ వచ్చారు. అలాగే యిప్పుడు మేము — నేనూ, నా కొడుకూ వంతెనలు కడుతున్నాం." తన భావాలను పరిచితు లెవరైనా కనిపిస్తే వాళ్లతో చెప్పాలన్నట్లు అతను చుట్టూ కలియజూశాడు.

అతని మనోనయనం ముందు అతను తన కొడుకును చూశాడు, కాని, ఆర్మేనాక్ తన మాటల్ని ఆమోదించడం లేదనీ, వాటిని అనుమానిస్తున్నాడనీ అనిపించిందతనికి. వావాసార్డ్ అదుర్దాగా తన కొడుక్కి నచ్చచెప్పసారంభించాడు:

"నేను చెప్పిన మాట అక్షరాలా నిజంరా అబ్బాయ్ — మన దేశం చిన్నది, ఆ రోజుల్లో జనం కూడా చాలా తక్కువగా ఉండేవారు. అప్పట్లో ఎక్కువమంది యీ వృత్తిని చేపట్టాల్సిన అవసరం లేకపోయింది, అందుకని అది ఒక్క కుదురుకే కేటాయించబడింది. మన కుదుటికి చెందినవాళ్లు ఆర్మీనియా అంతటా చెల్లాచెదరుగా వ్యాపించారు. మా తాత లుంకియానొన్ తను ఎర్జింక్ నుంచి వచ్చినట్లు చెప్పాడు. మీ తాత ఖాచాతూర్ మూష్ లోయలో పుట్టాడు, తర్వాత, ఏళ్ల తరబడి సామూన్ పర్వత ప్రాంతాల్లో నివసించాడు. పోతే, మీ బామ్మ దియార్‌బెకిర్ నుంచి వచ్చింది. ఆ తర్వాత మన మిద్దరం, నువ్వూ నేనూ ఆరాక్స్ నది దాటి, యిక్కడ ఉండేందు కొచ్చాం."

వావాసార్డ్ మౌనంలో మునిగాడు. పగిలిన తన పెదవులను లోపలకి ముడుచుకున్నాడు. అతని మనస్సుని చిన్న అనుమాన మొకటి దొలచసాగింది: ఇంతకీ ఆర్మేనాక్ వృత్తివానికి తిరిగి వస్తాడా, వచ్చినా తన తండ్రితాతల వృత్తి చేపడతాడా?

"నిజం చెప్పు బాబూ, అప్పుడిక నేనేం చెయ్యాలో తేల్చుకుంటాను" అంటూ వృద్ధ వావాసార్డ్ గొణుక్కున్నాడు, అతని కళ్లు పూర్తి కాని వంతెన మీదనే మగ్నమై యున్నాయి. ఆ చీకట్లో ఆకస్మికంగా అది కూల్చివెయ్యబడినట్లు నిపించిందతనికి.

జవాబు లేదు, వృద్ధుడు రాత్రి పూట వినవచ్చే శతానేక శబ్దాలు వింటూ తిరిగి మౌనంలో మునిగి పోయాడు.

నదిపైనుండి వీచే గాలి పర్వతశిఖరాల్లోని పగుళ్లలో ప్రవేశించి ఈలలూదినట్లు శబ్దిస్తోంది. గడ్డిలో చిన్న జంతువేదో జర్రున పాకి పోతూంటే గడ్డి పరపర శబ్దం

చేస్తోంది. వడ్రంగి పిట్ట అకస్మికంగా టక్కుటక్కుమంటూ సుదీర్ఘంగా శబ్దం చెయ్య వారంభించింది. శిఖరం నుంచి విరిగిపడ్డ ఒక రాయి డబడబమంటూ దొర్లివచ్చి నీళ్లల్లో దభాలున పడింది. తర్వాత నిశ్శబ్దం ఆవహించింది.

వావాసార్డ్ కిప్పుడీ రాత్రి శబ్దాలేవీ వినరావడం లేదు. అతనిప్పుడక్కడ కొత్త ఆలోచనల్లో మునిగి వున్నాడు. కొద్ది సేపే అయినా, ఆ ఆలోచనలు అతని మనస్సును తన కొడుకు నుంచీ, తన శంకల నుంచీ దూరంగా తీసుకెళ్లాయి. రాత్రి, కనిపించని ఏదో వస్తువుపై తన కళ్లను నిలిపి, సుదూరమైన, ఎన్నడో మరచిపోయిన రూపమేదో అకస్మికంగా అంధకారంలో రూపు దాల్చినదేమో నన్నట్లు, అతనక్కడే నవ్వుతూ కూర్చు న్నాడు. అతను తన కళ్లు మూసుకొని, ఎన్నడో యీ లోకం విడిచి మరో లోకానికి తరలిపోయిన వాళ్లతో, ఒకప్పుడు తనకు సన్నిహితులుగా వుండి, తనకెన్నో మధుర స్మృతులను మిగిల్చి పోయిన వాళ్లతో మాట్లాడ నారంభిస్తాడు.

ఒక సాయంత్రం పూట సైనిక బృందమొకటి రోడ్డు వెంట రావడం వావాసార్డ్ చూశాడు. అతనికి తన కొడుకును చూడాలన్న తీవ్రమైన తపన కలిగింది. సైనికులు త్వరలోనే వెళ్లిపోయారు, కాని వృద్ధుడు తనకు అభిమానపాత్రమైన స్థలంలో కూర్చుని, రాత్రి చాలా పొద్దు పోయే దాకా అవతలి గట్టు వంకా, లెర్నాషెన్ గ్రామంలోని మినుకు మినుకుమనే దీపాల వంకా పాలోచనగా చూస్తూ ఉండిపోయాడు.

ఈ రోజు ఉదయం పూట ఒక రాతినెత్తి గోడ మీద పెట్టడానికి తనకి సాయం చెయ్యమని కూలీల్లో ఒకడిని అడుగుదామనుకున్నాడు, కాని అలా అడగడానికి అతని అభిమానం అడ్డం వచ్చింది. ఇప్పుడు అతని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ అతని కుడిచెయ్యి నొప్పి పెడుతోంది. అతను తన చేతిని రుద్దుకొంటూ నొప్పి మరచిపోయేందుకు ప్రయత్నిస్తున్నాడు.

అతని శక్తి సన్నగిలుతోంది. కాని ఒకప్పుడు అతను పెద్ద పెద్ద రాళ్ళు అవలీలగా రొమ్ము దాకా పైకెత్తి కావాలన్న చోట పెడుతూండేవాడు. అలాంటిదిప్పుడు బరువైన రాతిని మోకాళ్ల దాకా ఎత్తడం కూడా గగనమై పోతోంది.

"నొప్పి అదే పోతుంది" అనుకున్నాడతను బిగ్గరగా. "దాన్ని గురించి ఆలోచించ కుండా ఉంటే సరి. ఆలోచిస్తే ఓవట్టాన వదలదు."

వావాసార్డ్ యీ మంత్రాన్ని పాటించాడు. అతను తన కళ్ళు మూసుకున్నాడు. మరో సారి ఎన్నడో చనిపోయిన ఆప్తుల మధుర స్మృతులు అతని మనస్సును ముసురుకున్నాయి.

"లుంకియానొస్ తాతా 'మంచి పనివాడు కట్టిన వంతెనకి మరమ్మతు చెయ్యా ల్సిన అవసరం ఎన్నడూ ఉండదు, అది శాశ్వతంగా నిలిచి వుంటుందని' చెప్పావు. నువ్వు

చెప్పింది నిజం తాతా. కాని, నీ కొడుకు ఖాచాతూర్, ఆయన ఆత్మ శాంతించు గాక, సానయాన్ దగ్గరి ఎత్తైన వంతెనకు ఒక సారి మరమ్మతు చెయ్యాల్సి వచ్చింది. రివెట్ మెంటులోని కొన్ని రాళ్ళు ఊడి పడిపోయాయి, అప్పుడాయన వాటిని యథాస్థానంలో పొందించాడు. మరో పన్నెండేళ్ల తర్వాత అవే రాళ్ళు మళ్లీ ఊడాయి. వాటిని నేను పొందించాను, యిప్పటికీ చెక్కు చెదరకుండా అవి అలాగే వున్నాయి. అందులోని కిటుకు చెప్పమంటారా? ఆ రాళ్లని యినప గసికలతో బిగించాను. ఖాచాతూర్ ఆఁ, యీ ఇనప గసికలతో పని లేదు, అవి లేకపోయినా రాళ్ళు లక్షణంగా ఉంటాయన్నాడు. కాని, అవి అలా నిలవలేదు! ఒక మేస్త్రీ, మన కుదుటికి చెందిన పెద్ద పనివాడు, ఒక వెయ్యేళ్ల క్రితం లోహపు గసికలు వాడాడంటే, దానికేదో గట్టి కారణం ఉండి ఉండాలి. ఆయన ఆత్మ శాంతించు గాక.''

నావాసార్డ్ మరేదో చెప్పబోయాడు, కాని అంతలోనే తన చెయ్యి పట్టుకుని, మూలిగాడు.

చివరికతను ఊపిరి పుంజుకున్నాక, ''బహుశా నేను కట్టే చివరి వంతెన యిదే నేమో'' అంటూ గొణిగాడు.

ముసలాడు యింతకు ముందెన్నడూ చావుని గురించి ఆలోచించి ఎరగడు. అతని చేతి నొప్పి యిప్పుడతని చేత చావుని గురించి ఆలోచింప చేసింది. ఏమైనా, యిప్పుడా ఆలోచన అతని బుర్రలో నాటుకుందేమో, వృద్ధుడు దాన్ని విదిలించుకోలేకపోయాడు.

అతను లేచి, నది ఒడ్డు దాకా వెళ్లి, వంతెన పునాది రాళ్లెలా ఉన్నాయో చూద్దామని తన చేతిని గూటి దాకా నీటిలో ముంచాడు. పాకుడు పట్టిన రాళ్లపై చేతులు జారిపోతున్నాయి.

''కాలం తన పని చేసింది'' అని అతను తృప్తిగా నిట్టూర్చాడు. ''ఇవి యిప్పుడు పట్టి రాళ్ళు కావు, భూమిలోకి దింపబడిన దృఢమైన కాళ్ళు. నా కాళ్లూ చేతుల్లోని కొంత బలాన్ని నేను వాటికిచ్చాను. ఇప్పుడవి బలాన్ని పుంజుకుంటున్నాయి, నేను నా బలాన్ని కోల్పోతున్నాను.''

రాత్రి పూట చేతి నొప్పి మూలంగా నావాసార్డ్‌కి చాలా సార్లు నిద్ర మెలకువ వచ్చింది. అతను అటూ యిటూ ఒత్తిగిలాడు, దొర్లాడు, చివరకి నిద్ర పట్టక, లేచి కూర్చున్నాడు. తూర్పు దిక్కుకి చూస్తూ సూర్యోదయం కోసం ఎదురుచూశాడు.

ఆకాశం అంధకారంగా ఉంది. రోడ్డు వెంట కాంతి పుంజమొకటి వేగంగా వస్తూండటం అతనికి కనిపించింది. ఆ కాంతి ఒక్కొక్క మారు పర్వత శిఖరం మీద పడి అక్కడి నుంచి బాదం చెట్ల తలలపైకి జారి అంతలోనే ముందుకు పొడుచుకొచ్చిన కొండకొమ్ముల వెనక మాయమవుతోంది.

త్వరలోనే అతనికి కారు ఇంజను చప్పుడు వినవచ్చింది. కారు కొండ మార్గం మంచి మళ్లి వంతెన దగ్గర ఆగింది. ప్రయాణికులు కారులోంచి దిగారు.

"మనం నడవాల్సి వుంటుంది" అందొక గంభీర స్వరం.

"రేవు యిక్కడికి చాలా దూరమా?"

"ఏటి దిగువన యింకొంచెం దూరంలో ఉంది" గంభీర స్వరం జవాబిచ్చింది. "తాపీమేస్త్రీ మేల్కొని వుంటే, అడుగుతాను."

వాళ్ల బూటుకాళ్ల క్రింద రాతిమొరుం కరకర పలుగుతున్న శబ్దమవుతోంది.

నావాసార్డ్ కుడి చేతి మీద ఆని లేచేందుకు ప్రయత్నించాడు, అతని చెయ్యి విప రీతమైన నొప్పి పుట్టింది.

"చల్లబడిన మూలంగా అయ్యుంటుంది. చన్నీళ్లలో చాలా సేపు ఉంచాను కదా" అనుకున్నాడతను.

"లేచే వున్నారా?" అని ఎవరో అడగడం అతనికి వినవచ్చింది.

నావాసార్డ్ వక్రంగా నవ్వాడు. నొప్పి విపరీతంగా ఉండటంతో అతనికి ప్రాణం గిల్లార్చుకుపోయినట్లుంది. అతను మాట్లాడలేకపోయాడు, లేవనూ లేకపోయాడు.

"ఏమిటి సంగతి, ముసిలాడా? నీ చివరి వంతెనను పూర్తిచెయ్యాలి, లేవోయ్, లేలే!" మోకాళ్ల మీద లేస్తూ అతను తనలో తను గొణుక్కున్నాడు.

బయట ఎవరో అగ్గి పుల్ల గీసి, తన తలను గుడారంలోకి జొనిపాడు.

"ఏటి దిగువన యిక్కడికి నంబై యాభై అడుగుల దూరంలో ఉంది రేవు" అని నీరసంగా చెప్పి నావాసార్డ్ వెనక్కి పక్క మీద పడిపోయాడు.

"తొందరగా రండి! ముసిలాయన జబ్బుగా ఉన్నాడు!" కొత్త వ్యక్తి హడావిడిగా అరిచాడు.

"అబ్బే, ఏం లేదు" అని గొణిగి, నావాసార్డ్ కళ్లు మూసుకున్నాడు.

అతనికి జ్ఞాపకమున్నదంతా అంతే.

అతను తిరిగి కళ్లు తెరిచే సరికి సూర్యుడు పర్వత శిఖరం మీదికి చేరుకున్నాడు. గట్టుపై పడిన అసంపూర్తి వంతెన నీడ ఓ ఆకారం పాడూ ఏమీ లేకుండా ఓ రాళ్ల గుట్టలా ఉంది.

కారు గాని, దానిలోని ప్రయాణికులు గాని కనుచూపు మేరలో ఎక్కడా లేరు. గుడారం బయట ఆదుర్దాగా కార్మికులు గుమిగూడి వున్నారు.

నావాసార్డ్ కళ్లు తెరిచి చుట్టూ వింతగా చూస్తూండగా "ఆయన కళ్లు తెరిచాడు!" అన్నారెవరో.

"వాళ్లు డాక్టరు కోసం వెళ్లారు. త్వరలోనే రావాలి మరి" అన్నాడు మరొకడు.

వావాసార్ద్ కనుబొమలు పైకెత్తి, తన కుడి చేతిపై ఆనుకొని లేచి కూర్చున్నాడు. నొప్పి పోయింది.

"ఎందుకు మీరంతా యిక్కడ మూగారు, పని చెయ్యకుండాను?" అని కూక లేశాడతను కటువుగా. "కమాను రాళ్ల మలిచావా ముషేగ్? నేను లేస్తున్నాను" అని గొణుగుతూ, మరి కొంచెం సేపటికి నిజంగానే నిబ్బరంగా లేచినిలబడ్డాడు.

"మీరు పడుకోవాలి. త్వరలోనే డాక్టరొస్తాడు" ఆదుర్దాగా అన్నాడు ముషేగ్.

వావాసార్ద్ అతని వంక గుర్రుమని చూసి, పొట్టి య్యాప్రన్ వేసుకుని, తన పని ముట్లు తీసుకుని మారు మాట్లాడకుండా బయటికి నడిచాడు.

కూలీలు పాయలుగా చీలి అతనికి తోవ యిచ్చారు.

అతని భుజం ఒంగింది గాని, ఐతని అడుగులు దృఢంగా పడుతున్నాయి. కూలీలు కళ్లప్పగించి అతని వంక తేరిపారచూశారు. వావాసార్ద్ ఒడ్డును చేరుకొని నీటి అంచు కెళ్లాడు. వంగి దోసిట్లోకి నీళ్ల తీసుకొని ముఖం కడుక్కున్నాడు. తర్వాత నిటారుగా లేచి నిలబడి సూర్యుడి వంక చూశాడు.

"పగలు గడిచిపోయింది. నేను పగలంతా నిద్రపోయాను" అని గొణుక్కున్నాడు. రాత్రి జరిగిందేమిటో అప్పుడే అతను మొదటిసారి గ్రహించాడు.

రాత్రి జరిగిన ఘటనలు యిప్పుడతనికి విచిత్రంగా కనిపించాయి. కారు వచ్చిన రోడ్డు వంక అతను ఆశ్చర్యంగా చూశాడు, తర్వాత చుట్టూ నిలబడివున్న కార్మికుల వంక చూశాడు. వేల వంక చూస్తూ వంతెన వైపు నడిచాడు.

"నిన్ను నువ్వు నవ్వుల పాలుచేసుకున్నావ్ వావాసార్ద్. నీకింతకు ముందెన్నడూ యిలా జరగలేదు. చివరి రాయి మోపే దాకా తట్టుకోలేవా నువ్వు?" అనుకున్నాడు.

డాక్టరు వచ్చేసరికి ఆ ముసలి తాపీమేస్త్రీ పైనెక్కడో పరంజా మీద నిలబడి ఏకాగ్రంగా కట్టడం పనిలో నిమగ్నుడై వున్నాడు. అతన్ని అలా చూసిన వాళ్లెవ్వరూ కూడా అతనికేమైనా జరిగిందని గాని, యిక ముందేమైనా జరుగుతుందని గాని నమ్మలేరు.

జుట్టు పొట్టిగా కత్తిరించుకున్న యువతి, డాక్టరు, నీటి అంచు దాకా వెళ్లింది, కాని ఊగిసలాడుతున్న పరంజా పైకెక్కడానికి భయపడింది. ముసలి మేస్త్రీ క్రిందికి రావడానికి మొండిగా నిరాకరించాడు.

"ఎందుకీ పిల్లనిక్కడికి తీసుకొచ్చారు? నాకేం కాలేదు, నేను బాగానే ఉన్నాను" అన్నాడతను.

"మీరు పొరపడుతున్నారు. బహుశా మీకు మందు అవసరమనుకుంటాను" డాక్టర్ని తీసుకొచ్చిన మనిషి అన్నాడు.

ఆ గంభీర స్వరం వావాసార్డ్‌కి గుర్తొచ్చినట్లనిపించింది. "నిన్న రాత్రి వచ్చింది మీరేనా?" అన్నాడు.

"ఔను. కిందకి రండి. మిమ్మల్ని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లమంటారా?"

"మీ పేరేమిటి?" అని అడిగాడు వావాసార్డ్.

"ఆర్మేన్."

ముసలాడి కళ్లు స్నేహార్ద్రమయ్యాయి. అపరిచితుని వంక అతను ఆపేక్షగా చూశాడు.

"బాగుంది. అయితే నీ పేరు ఆర్మేనాక్ అన్నమాట" తనలో తను అనుకుంటు న్నట్లన్నాడతను. తర్వాత అతను తొందర తొందరగా చెప్పాడు, "నువ్విప్పుడెళ్లు బాబూ. నాకు ఒంట్లో బాగా లేనప్పుడు నేనక్కడికొస్తాను. మేమీ వంతెన పూర్తి చేసేశాక నేనొచ్చి నిన్ను కలుస్తాను."

ఆర్మేన్ తల ఊపి, చిరునవ్వు నవ్వాడు. కనీసం రాత్రిళ్లు లెన్నాషెన్ గ్రామంలో పడుకునే లాగైనా ఒప్పిద్దామని తంటాలు పడ్డాడు. కాని వావాసార్డ్ అందుక్కూడా ససేమిరా ఒప్పుకోలేదు. "అదేమీ కుదరదులే అబ్బాయ్. నేను కడుతున్న వంతెనని విడిచి వెళ్లడమన్నది నా జీవితంలో యింత వరకెన్నడూ జరగలేదు."

డాక్టర్నీ, ఆర్మేన్‌నీ తీసుకుని కారు వెళ్లిపోయింది. వావాసార్డ్ వాళ్ల వంక చూసి "ఆర్మేనాక్" అంటూ గొణిగాడు.

రోజంతా అతని చెయ్యి గాని, నడుము గాని పోటు పెట్టలేదు. ముసలాడు తన అస్వస్థత సంగతే మరచిపోయాడు. నిపుణమైన తన చేతులతో రాయి తర్వాత రాతిని పొందిస్తూ, మధ్య మధ్య ఆగి తన నుదుటి పైనుంచి జాలు వారుతున్న చెమటను తుడుచుకొంటూ విబ్బరంగా పని చేశాడు. అతని ముఖమంతటా గచ్చకాయరంగు రాతి బూడిద పూతలా పడింది.

మరునటి రోజు మొదలెట్టబోయే అవతలి వైపు దిమ్మ కట్టడం కోసం, కూలీలు ఆ సాయంత్రం అతని గుడారాన్ని నదికి అవతలి వైపుకి తీసుకెళ్లడంలో అతనికి సాయం చేశారు.

మిగిలిన వాళ్లని ముందుకు పోనిచ్చి, ముషేగ్ అతన్ని కలుసుకొని "నేను మీతో బాటు యిక్కడ ఉండిపోతాను" అన్నాడు.

"ఎందుకు?"

"మేమంతా కలిసి ఆలోచించాం. బహుశా మీకేదైనా అవసరమొస్తే నేను సాయంగా ఉంటాను."

వావాసార్డ్ అతని వంకా, తర్వాత అప్పుడే యింటికి బయల్దేరిన మిగిలిన కార్మికుల

వంకా చూసి, అన్నాడు, "జౌనౌను, నేను మరిచే పోయాను. రేపు నువ్వు పనిలో కొచ్చే టప్పుడు నాకు కొంచెం బ్రెడ్ తెచ్చిపెట్టు. నా దగ్గరున్న రొట్టె ఈ రోజుతో అయిపోయింది. ఇంక పో మరి, రేపు పనిలోకి టైముకి రా" అని, అతను కిలాడీగా చిరునవ్వు నవ్వాడు.

ముషేగ్‌ని పంపించేశాక అతను గుడారం చుట్టూ తిరిగి కొత్త జాగాని జాగ్రత్తగా పరీక్షించాడు. ఇక్కడి నుంచి ఊరు కనిపించదు. లెర్నాషెన్‌కి ఎత్తైన పదిఒడ్డు అడ్డం వచ్చింది. కొండల మీద రిబ్బను ముక్కలు చిందర వందరగా పరిచినట్లున్న రోడ్డు భాగాలు మాత్రమే అతనికి కనిపిస్తున్నాయి.

పగటి పూట-యీ రోడ్డు వెంట కార్లు పోతూవుంటాయి, మధ్య మధ్య నదికి బాగా దగ్గరగా వస్తూంటాయి. అయితే, అవి హొరస్తా దగ్గర పక్కకి మళ్లి కనుమరుగవుతూ ఉంటాయి. వాటిలో కొన్ని కార్లు లెర్నాషెన్‌కి మళ్లుతూ వుంటాయి. కాని, అసంపూర్తి వంతెనని చూడగానే ఆగిపోతాయి. ప్రయాణికులందరూ కిందకి దిగి నది వంక చూస్తూ చర్చ మొదలుపెడతారు. వావాసార్ద్ కెప్పుడూ ఆ మాటలు స్పష్టంగా వినపడవు బోధపడవు, కాని వాళ్లేమనుకుంటున్నారో మటుకు అతనెప్పుడూ ఊహించుకోగలుగుతాడు.

"వాళ్లకి నేను కడుతున్న వంతెన అవసరం" తనలో తను అనుకుంటాడతను. వెళ్లిపోతున్న కారు వంక కృతజ్ఞతా పూర్వకంగా చూస్తాడు.

ఆ రాత్రి వావాసార్ద్‌కి కలత పెట్టే ఆలోచన ఒకటి తట్టింది. "అయితే, యిదే నీ ఆఖరి వంతెన అంటావ్?" అని తనను తనే కోపంగా ప్రశ్నించుకున్నాడు. "మరైతే, నువ్వు పోయాక జనానికి వంతెన లెవరు కడతారు? మరి నీ అర్మేనాక్ సంగతేమిటి? వాడింత వరకింకా రానేలేదు."

తన తర్వాత తన పనిని కొనసాగించే వాళ్లని గురించీ, తన వంతెనల అవసరమున్న వాళ్లని గురించీ వావాసార్ద్ ఆలోచించసాగాడు. అతనికి నిద్ర ఎడమైంది. అతను లేచి, బయట కెళ్లాడు, అక్కడ ఆరుబయట కూర్చున్నాడు.

ఈ రోజు రాత్రి నక్షత్రాలు తక్కువగా కనిపిస్తున్నాయి. గాలి తేమగా ఉంది. ఒక పిట్ట బిగ్గరగా అరిచి, తన కూత ప్రతిధ్వని వినడానికన్నట్లు, ఆగింది. దగ్గర్లో గొర్రెల మందను కాపలికాస్తున్న కుక్కలు మొయ్యోమంటూ అరుస్తున్నాయి. నిద్ర మత్తులో వున్న గొర్రెల అరుపులూ, విచిత్రమైన పర పర శబ్దం అతనికి వినవచ్చాయి. ఆ శబ్దం బహుశా గొర్రెలు రాతి ఉప్పు నాకుతున్న శబ్దమైయుండవచ్చు.

పెద్ద పెద్ద పొగమేఘాలు రేపుతూ చలిమంట మండుతోంది. అకస్మాత్తుగా,

పరిసరాలన్నింటినీ కాంతివంతం చేస్తూ మంటలు పైకి లేచాయి. చలిమంట పైకి వంగిన గొర్రెల కాపరి ముఖం నావాసార్ద్‌కి కనిపించింది.

"అతను మాంసం కాలుస్తున్నాడు" అనుకున్నాడు నావాసార్ద్. ప్రతి కొత్త వంతెన పూర్తి అయినప్పుడూ తన తండ్రి ఖాచాతూర్ రాతి దిమ్మల పక్క ఇసుక ఉంచి మాంసం తగిలించి దాన్ని కాలుస్తూండేవాడు. శుభ్రంగా ఉన్న రాళ్ళ మసిబారి నల్లగా తయారై పాత వాటిలా కనిపించేవి. అయితే కాలిన మాంసపు కమ్మని వాసన మన్నపు నుర్కీ ఘాటుని కూడా ముంచెత్తేది.

"పెద్ద మేస్త్రీ ఖాచాతూర్, నీ ఆ ఆచారం నాకిప్పటికీ విచిత్రంగానే ఉంటుంది" అనుకున్నాడు నావాసార్ద్. "బహుశా నీ పురాతన దేవతలకి నువ్వు పొగచీ మంటచీ బలిపెట్టి, నీ వంతెనని శాశ్వతంగా కాపాడమని మొక్కుకునే వాడివేమో, అంతేనా? నువ్వు శిలువ గుర్తు కూడా వేసుకునేవాడివి. కాని, నీ ప్రార్థన మటుకు శిలువ వెయ్యబడిన ప్రభువుని ఉద్దేశించి చేసినది మాత్రం కాదన్న సంగతి నాకు గుర్తుంది. 'హే సూర్య భగవానుడా, నీ సాయంతో నేను మరో వంతెన కట్టాను. ప్రజలకి దీని అవసరముంది, అందుకని దీన్ని కాపాడు దేవా' అని ప్రార్థిస్తూండేవాడివి."

సమీపంలో ఓ కుక్క మొరిగింది. మరుసటి క్షణంలో ఓ గొర్రెల కాపరి చీకట్లోంచి దగ్గర కొచ్చాడు. అతనేదో తీసుకొస్తున్నాడు.

"దండాలు బాబూ! కాల్చిన మాంసం కొద్దిగా తింటారా?" అని అడిగాడతను.

పొడవాటి పుల్లకి గుచ్చి వున్న మాంసాన్ని నేర్పుగా ఊడదీసి, మందపాటి రొట్టె పైన దాన్నుంచి, గొర్రెల కాపరి నావాసార్ద్ పక్క కొచ్చి కూర్చున్నాడు.

గొర్రెల కాపరి పదహారేళ్ల కుర్రాడు. బండ పెదవుల కారణంగా అతను మరీ లేత కుర్రాడిలా కనిపిస్తున్నాడు.

నావాసార్ద్ కళ్ళు చీకట్లో చూసేందుకు అలవాటు పడ్డాయేమో, ఆ కుర్రాడి బుగ్గ మీద వున్న పెద్ద మచ్చని అతను చూడగలిగాడు. "నీకా గాయమెక్కడ తగిలింది?" అని అడిగాడు.

"నాకీ దెబ్బ చాలా చిన్నతనంలో తగిలింది. నేను మన వంతెన మీద పరుగెడుతు న్నాను. అంతలోనే చెక్క పలక పళపళమని విరిగి కూలిపోయింది, దానితోబాటే నేనూ నీళ్లల్లో పడిపోయాను. అక్కడ ఏ మేకో, కొస్సైన మన్నువో పైకి పొడుచుకొని ఉండి వుంటుంది, దానితో నా బుగ్గ చీరుకుపోయింది. ఇదుగో యిప్పుడీ మచ్చ మిగిలింది దానికి గుర్తుగా."

కుర్రాడు నవ్వుతూంటే ముత్యాలసరాలలాంటి వాడి తెల్లటిపళ్ళు బయటపడ్డాయి.

తర్వాత వాడు నది వంక తిరిగి, "బాబా, నువ్వు కడుతున్న యీ వంతెన ఒక వెయ్యేళ్ళు ఉంటుందా?" అని అడిగాడు.

"చూద్దాం" అని నిబ్బరంగా జవాబిచ్చాడు వావాసార్డ్, తర్వాత తన మాటలకి తనే ఆశ్చర్య పడ్డాడు. అయినా కూడా, "చూద్దాం" అని రెట్టించాడు.

తర్వాత నిద్రపోదామని పడుకున్నప్పుడు అతని గుండెలో కలుక్కుమని నొప్పి వచ్చినట్లనిపించింది. అంతకు ముందు గొర్రెల కాపరికి అనాలోచితంగా తానిచ్చిన జవాబు అతనికి జ్ఞాపకం వచ్చింది. "దీన్ని చూడటానికి నువ్వు బతుకుతావా?" అని తనను తనే ప్రశ్నించుకున్నాడు. వెన్వెంటనే "నువ్వింకా చాలా వంతెనలే కట్టాలి ముసిలాడా" అని జవాబు చెప్పుకున్నాడు.

రాత్రి నిద్రలో కూరుకుపోయే ముందూ, ఉదయం నిద్ర లేచి లేవగానే అతని మనస్సులో యిదే ఆలోచన మెదిలింది. లెర్నాషెన్ గ్రామం నుంచి కార్మికులు యింకా రాక ముందే అతను పనిలోకి వంగాడు. పగలంతా అతని గుండెల్లో చాల మార్లు పోటు వస్తూనే వుంది. ఎవరో సూదులతో గుండెల్లో పొడుస్తున్నారేమో నన్నట్లుంది ఆ బాధ. "నా చేతి నొప్పీ భుజం నొప్పీ నా గుండెకి పాకాయేమో?" అని అనుమాన పడ్డాడతను. తన పని పక్కన పెట్టి ఆయాస పడుతూ విశ్రాంతి కోసం కూర్చున్నాడతను. కాని యింతలోనే మరో కూలి యువకుడు కూడా పని పక్కన పెట్టెయ్యడం చూసి, అతను మళ్లీ లేచి, "కూర్చునేందుకు సమయం కాదిది, ఆ రాళ్లిలా అందించు" అంటూ కూకలేశాడు.

ఆ రాత్రి అతనికి నడుం వాల్చగానే గాఢంగా నిద్రపట్టేసింది. ఉదయం లేచే సరికి, అతనికి యౌవనం తిరిగి వచ్చినట్లు, మంచి ఉత్సాహంగా ఉల్లాసంగా ఉన్నట్లని పించింది. నదిలో ముఖం కడుక్కున్నాడు, గత కొద్ది రోజులుగా తనెంత వంతగా ఉంటున్నదీ తలుచుకుని తనలో తను నవ్వుకున్నాడు.

పాంటు మోకాళ్ల దాకా మడుచుకుని నీళ్లలో దిగుతూ "చన్నీళ్ల ఇంతవర కెవరికీ చెరుపు చేయలేదు" అనుకున్నాడు.

అతనక్కడలా నీళ్లలో దిస తలతో, చొక్కా లేకుండా నిలబడి సంతోషంగా నవ్వు కున్నాడు. అతని కళ్ల చుట్టూ వున్న సన్నని ముడతలు అలల్లా కదులుతున్నట్లున్నాయి.

సూర్యుడు పర్వతశిఖరాల పైకి లేస్తున్నాడు.

"యాభై ఏళ్ల క్రితం కూడా యిది యిలాగే ఉండేది. రాత్రి నాన్న నిద్ర పోగానే, మేమ నీళ్ల దాటి అవతలి పక్కకెళ్లే వాడివి" యువావస్థలో తను గడిపిన నిద్రలేని రాత్రు లను ఎంతో స్పష్టంగా గుర్తు చేసుకొంటూ వావాసార్డ్ అనుకున్నాడు.

ఆ వేసవి కాలం నాన్నా వాళ్లూ వొరొతాన్ నది మీద రెండు కమాన్ల వంతెన పూర్తి చేస్తున్నారు. ఇంక మిగిలిందల్లా పక్క యినప కమ్మిలు బిగించడం, క్రింద రాళ్ళు పరచడం మాత్రమే. ఆ వేసవికాలం ఎండలు మండిపోతున్నాయి. పగలల్లా బిగపట్టిన గాలి రాత్రి మాత్రమే వీచి వంతెన నిండా దట్టమైన దుమ్ముపొర నింపేది. రాత్రి కాగానే అతని తండ్రి నిద్రపోయేవాడు. తను నది దాటి నాజాన్ తన కోసం నిరీక్షిస్తున్న చోటుకి వెళ్లేవాడు. మారు కంటే వాడికి కనిపించకుండా తామిద్దరూ విల్లో చెట్ల కింద కూర్చునేవారు. నాజాన్ తలకి కట్టుకున్న మెత్తని రుమాలు ముందామె భుజాల మీదకీ తర్వాత గడ్డి మీదకీ జారిపోయేది. నక్షత్రాలు కనుమరుగయ్యే దాకా ప్రతి రాత్రీ అలా జరుగుతోంది.

ఓ రోజు రాత్రి నావాసర్ద్ బాగా అలసిపోయి, ప్రేమ మత్తులో యింకా పూర్తి కాని వంతెన మీదుగా తిరిగి వచ్చాడు. గుడారం దగ్గరకెళ్ళే ఓపికలేక, వంతెన పక్క పచ్చగడ్డి మీద నడుం వాల్చి అలాగే ఒళ్లుమరిచి నిద్రపోయాడు. తను అలా ఒక గంట పడుకున్నాడో లేదో ఖాచాతూర్ వచ్చి తనని లేపి, వంతెన అవతలి కాలిబాటల వంక చేత్తో చూపించాడు.

నావాసర్ద్ రహస్యం ఆ విధంగా బయటపడింది.

"ఆ రోజున నువ్వు నన్ను చావ బాదేశావ్ ఖాచాతూర్" అనుకుని ముసలాడు ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు. " 'గ్రామంలో తలెత్తుకోకుండా చేస్తున్నావు కదరా' అన్నావ్. అంతే వెంటనే టోపీ తీసుకుని నాజాన్ తలిదండ్రులతో మాట్లాడటానికెళ్లావు. నువ్వా రోజున పనిచెయ్యలేదు. సాయంత్రం తిరిగి వచ్చేటప్పటికి నువ్వు తాగిన మైకంలో తూలుతున్నావు. ఒక వారం రోజుల్లోగా, నువ్వు మా పెళ్లికి వంతెన పక్కన ఏర్పాట్లు చేశావు."

నావాసర్ద్ నీటి పైకి వంగి, దోసిటిలో నీళ్ళు తీసుకుని ముఖమూ, ఎండకి కమిలిన తన రొమ్మూ మరో మారు తడుపుకుని, నిబ్బరంగా అడుగు లేసుకొంటూ గట్టు వేపు బయల్దేరాడు.

"ఓహ్, ఎక్కడున్నావ్ నాజాన్? నీ ఆత్మ శాంతించు గాక. అప్పుడే రెక్కలొచ్చిన పక్షి పిల్ల తన తల్లి రెక్కల కింద ఉన్నప్పుడున్నంత వెచ్చగా ఉండే దానివి, చక్కని కల అంత మధురంగా ఉండే దానివి. నువ్వు కన్ను మూశాక నేను కట్టిన ప్రతి వంతెనా నీ స్మృతికే అంకితం చేశానన్న సంగతి నువ్వు గుర్తు పెట్టుకోవాలి నాజాన్."

ఆ రోజు మధ్యాహ్న భోజనంతో బాటు, చనిపోయిన తన అప్తుల స్మృత్యర్థం, నావాసర్ద్ ఓ గ్లాసుడు కార్నీలియన్ చెర్రీ, ఓడ్కా పుచ్చుకున్నాడు.

"మీరు నాకొక వంతెన అయి, నేనీ వైపుకి దాటి రావడానికి నాకు తోడ్పడ్డారు."

తన నలతలు మటుమాయమైనందుకు, అతను మాంచి హుషారుగా ఉన్నాడు. పని చేస్తూంటే అతని కొక పాత సామెత గుర్తు కొచ్చింది: "ముందెళ్లినవాడు వెనకొచ్చే వాళ్ల కొక వంతెన." అతనింకా యిలా అనుకున్నాడు, "నేనో వంతెన కాగానే, నేను నీ దగ్గర కొచ్చేస్తాను నాజాన్. కొంచెం ఓపిక పట్టు ప్రియతమా."

ఆ రోజు మొదలుకొని, తన కొడుకు ఆర్మేనాక్ పునరాగమనం కోసం అతను మరింత ఆత్రపడసాగాడు. ఆర్మేనాక్ దగ్గర్నుంచి అప్పటికీ జాడా జాబూ లేకపోయింది.

"ఏమ్రా ఏం జరిగింది నీకు?" అనుకున్నాడు గాని, అతని కొడుకు జవా బివ్వలేదు.

ఆదివారం ఉదయం జిల్లా కేంద్రానికెళ్లాలని నావాసార్ద్ నిశ్చయించుకున్నాడు. వంతెన స్థలం నుంచి అది కొంచెం యించుమించు ఆరు కిలోమీటర్ల దూరంలో వుంది. ఏ లారీ మీదో వెడితే ఎక్కువ టైము పట్టేది కాదు. కాని అతను నడిచివెళ్లాలని నిర్ణయించుకుని, నది అవలి పక్కకి దాటి, యిరుకు కనుమ గుండా బయల్దేరాడు.

అనేక సెల ఏళ్లు శిఖరాల మీద పుట్టి నదిలోకి ప్రవహిస్తున్నాయి. వాటిలోని నీరు ఒక దానిలో కన్న మరొక దానిలో మరింత చల్లగా మరింత రుచిగా ఉన్నాయి. ఒక సెల ఏటి జన్మ స్థానంలోని చిన్న మడుగులో నావాసార్ద్‌కి చిన్న తెల్ల చేప కనిపించింది.

బాదంకాయలు పండుతున్నాయి. వాటిలో కొన్నింటి పెచ్చు యింకా పచ్చగానే వున్నా లోపలి పలుకులు మాత్రం తెల్ల పడి గట్టి పడ్డాయి. అతను బాదంకాయలు పగలకొట్టి పలుకులు చాలా తిన్నాడు. వాటికి పాల రుచి వచ్చింది.

నాక పళ్ళు ఎర్ర పడుతున్నాయి. దూరాన్నుంచి అవి బాగా పండని నేరేడు పళ్లలా కనిపిస్తున్నాయి.

ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్న ముసలాడిని ఆసక్తిగా పరిశీలిస్తూ, గడ్డి తోను, పువ్వులతోను నిండిన అవతలి గట్టుమీద యిద్దరమ్మాయిలు నడుస్తున్నారు.

"నువ్వీ మధ్య నాకు తరచుగా జ్ఞాపకం వస్తున్నావు నాజాన్. నువ్వూ ఈ అమ్మాయిల్లాగే ఉండేదానివి. ఒక్కటే తేడా, నీ లాగ వీళ్లు తలకి రుమాలు కట్టుకోరంతే వీళ్లు వేరే తరానికి చెందిన వాళ్లు కదా."

కనుమ వెడల్పయి, నది వంపుతిరిగిన చోట ఆ అమ్మాయిలు వెనకబడ్డారు. నావాసార్ద్ వాళ్ల వేపు చూసేందుకని ఆగి, ప్రకాశంగా తన ఆలోచన కొనసాగించాడు: "నీ కొడుకు తిరిగి వచ్చాక వాడికి పెళ్లి చేసేస్తాను. ఏం, ఏమంటావ్? నీకు అంగీకారమేనా

వాజాన్? నా కోటు జేబులోని బంగారు ఉంగరం తీసుకెళ్లి ఆడపిల్లల తలిదండ్రు లతో మాట్లాడి వస్తాను."

అలా వెదుకుతూ వెదుకుతూ తన చిరకాల స్వప్నం ఆచరణలో కొస్తున్నట్లు ఊహించుకున్నాడు. లెర్నాషెన్ గ్రామానికి కెళ్లి, తనకి నచ్చిన పిల్ల దొరికే దాకా, గ్రామస్తుల్లో ఒకరి తర్వాత మరొకరితో మాట్లాడుతా ననుకున్నాడు. తర్వాత తను ఆ అమ్మాయి తలితండ్రులతో మాట్లాడి, పెళ్లి ఉంగరం బయటకి తీసి టేబిలు మీద పెడతాడు. వలానా వాళ్ల అమ్మాయిని ప్రధాన మేస్త్రీ నావాసార్డు కొడుక్కివ్వబోతున్నారన్న వార్త నది పొడుగునా ఆ చివర నుంచి యీ చివరి దాకా వున్న ఊళ్లన్నింట్లోనూ మోగిపోతుంది. నావాసార్డ్ కుటుంబంలో పడబోతున్నందుకు ఆ అమ్మాయి అదృష్టాన్ని తలుచుకొని జనం ఈర్ష్యపడతారు.

"నీ పెళ్లిలో నేను నాట్యం చేస్తాను ఆర్మేనాక్. అప్పుడు మనమిద్దరం కలిసి ఓ కొత్త వంతెన కడదాం, ఆ తర్వాతంటావా నేను చచ్చిపోయినా యింక నాకు బెంగలేదు."

అతను కనుమ చివర నిలబడి, అక్కడ ఆ నది ఒడ్డున, ఆ బాదం చెట్ల కింద, అప్పుడే తన కల నిజం కామన్నట్లు కిందకి చూశాడు. ఆటు తర్వాత అతను నిట్టూర్పు విడిచి అనుకున్నాడు, "అయినా, మనవడు పుట్టే దాకా బతకననుకుంటాను."

తన కొడుకు రాసిన చివరి ఉత్తరం తీసి టేబిలు మీద పరచి, నావాసార్డ్ పదో మారు దాన్ని మళ్లీ చదివాడు. తర్వాత అతను ఒక్కొక్క అక్షరమే చెక్కుతున్నట్లు జవాబు రాయ నారంభించాడు.

"ఆశీస్సులు. ప్రియమైన ఆర్మేనాక్, నువ్వులేని లోటు తప్ప ఇక్కడ మేమంతా కులాసాగానే ఉన్నాం. నీ తిరుగు ప్రయాణానికంత ఆలస్యమెందుకైందో బోధపడకుండా వుంది. నీ స్నేహితులూ, మన బంధువులూ, చిన్నా పెద్దా అందరూ నీకు తమ గౌరవాభివందనాలు తెలిపారు. నీకు నా శుభాకాంక్షలు. నా వంతెన నీ కోసం ఎదురు చూస్తోంది. నా మనస్సులో ఈ మధ్య ఒక ఆలోచన మెదులుతోంది: నీ కాబోయే భార్య యీ కొత్త వంతెన దాటి మన వేపు రావాలని నేను కోరుకుంటున్నాను. నువ్వు బయల్దేరే ముందు నాకు టెలిగ్రామివ్వడం మరచిపోకు."

అన్ని సంగతులూ సవిస్తరంగా రాసినట్లే. అయినా, ఉత్తరం మరో సారి చదివి, యింకొక్క పంక్తి జోడించాడు నావాసార్డ్: "నీ జవాబు కోసం, నీ రాక కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూసే మీ నాయన నావాసార్డ్."

ఉత్తరం పూర్తి చేసి గుమాస్తాకి అందించేసరికి మిట్టమధ్యాహ్నమైంది. విదేశీ చిరునామా రాయడంలో ఆ గుమాస్తా అతనికి సాయం చేశాడు.

అతను బయటకెళ్ళి రోడ్డు మధ్య నిలబడ్డాడు. "కాలినడకన వెనక్కెళ్తే అలిసి పోతాను, రేపు ప్రొద్దుట పెందరాళే పని మొదలెట్టాలి కూడా." అందుకని అతను ఏ లారీ మీదో పోవాలని నిశ్చయించుకున్నాడు.

కప్పులేని లారీ పైన కూర్చుని వెనక్కి వస్తున్నంత సేపూ అతనొక్క మాట కూడా మాట్లాడలేదు, తన పక్కనే కూర్చున్న వాళ్ళెవళ్ళ సంగతీ పట్టించుకోలేదు.

అతనలా కూర్చుని, తన కాబోయే కోడల్ని గురించి ఆలోచిస్తూ పగటి కలలు కనసాగాడు. నాజాన్‌కి లాగే ఆమెకి ఒత్తైన జడలుంటాయి, నల్లటి కళ్ళుంటాయి. తన కొడుకు కళ్ళూ కనుబొమలూ తుమ్మెదరెక్కల్లా నల్లగా ఉంటాయి. ఆర్మెనాక్ పొడుగ్గా వుంటాడు, రొమ్ము వెడదగా వుంటుంది. తన మనవడు కూడా అలాగే ఉండాలి. తన కోసం ఆగకుండా కాలం గడిచిపోతుంది. తనప్పుడు బతికి ఉండడు. కాని, వంతెన నిర్మాతలైన తన కుటుంబ సభ్యులు మాత్రం, తరతరాలుగా, వాళ్ళు కట్టిన అనేక రాతి వంతెనల్లాగే అవినాశంగా కొనసాగుతారు.

అప్పుడతని చూపులు తన ఒడిలో బరువుగా ఆని వున్న తన అరచేతుల పైన వాలాయి. మొరటుగా, కాయలు కాచి, చిట్లి, నలిగిన మనిషి చేతులు సృష్టించని పనేముంటుంది ప్రపంచంలో!

ఏదో జ్ఞాపకం రాగా అతను అకస్మాత్తుగా నవ్వుకున్నాడు. ఆ ఘటన ఎప్పుడో చాలా కాలం క్రితం జరిగింది, చాలా చాలా కాలం క్రితం. అది వేసవి కాలం. ఓ సాయంత్రం పూట తను బాగా తాగి వచ్చి మంచం మీద పడి నిద్రపోయాడు. నాజాన్ తన తలాపి దిక్కున కూర్చుని తన నుదుటి మీది చెమటను ఒత్తుతోంది. తను జబ్బు పడ్డానేమోననుకుని ఆమె ఆరాటపడింది. ఆమె చల్లని హస్తం తన నుదుటిని తాకిన ప్రతిసారీ తను తన కళ్ళు తెరవాలని ప్రయత్నించాడు, కాని తెరవలేకపోయాడు. అప్పుడు మళ్ళీ గాఢమైన నిద్రలో మునిగిపోయాడు. అర్ధరాత్రి వేళ తను లేచి సగం తెరిపినపడ్డ తన కనురెప్పల సందులోంచి తన భార్యని చూశాడు. ఆమె తన పక్క మోకాళ్లపై వంగి కూర్చుని, బరువైన తన మోటు చేతుల్ని ముద్దు పెట్టుకుంటోంది.

అప్పుడామె అన్న మాటల్ని తనీ జన్మలో మరచిపోలేదు: "నీ యీ చేతుల కోసం నేను నా ప్రాణాలను అర్పించగలను— ఇవి రాతి వంతెన అంత దిట్టమైనవి."

రోడ్డు చీలిన చోట ఆగింది లారీ. నావాసార్డ్ క్రిందకి దిగి నది వేపు తిరిగాడు, గట్టు పైన కొంతమంది జనం గుమిగూడి ఉండటం చూశాడు. ఒక మగ మనిషీ, ఆరేడేళ్ల కుర్రాడొకడూ వంతెన పక్క నిలబడి వున్నారు. వాళ్ల దగ్గర్లో ఒక పెట్టె

మీద ఓ యువతి కూర్చుని వుంది. మెడ పైకి దూముడి వేసి వున్న పట్టుకుచ్చులాంటి ఆమె జుట్టు సూర్య కాంతిలో బంగారంలా మెరుస్తోంది.

"ఈ పాటికి వంతెన పూర్తయి వుంటే, వాళ్ళు తిన్నగా దాటి వెళ్లిపోయేవారు కదా" అనుకున్నాడు వావాసార్ద్ విషణ్ణంగా. "అయినా నీళ్లిక్కడ ఎందు కాగినట్టు? నీళ్లవారకి దిగితే, పెట్టె మీదుగా అవతలకి దాటిపోవచ్చు కదా?"

అతను మరి కొంచెం ముందుకెళ్లి ఆగి కళ్లు నులుముకొని చూశాడు. అతనికి వంతెన పక్కనున్న మనిషి తనకేసి చెయ్యి ఊపినట్లూ, తన వైపుకి వస్తున్నట్లూ అనిపించింది. అతని గుండె వేగంగా కొట్టుకో సాగింది, అతని ఉచ్ఛ్వాసనిశ్వాసాల వేగం హెచ్చింది.

"ఇతనెవడో యూనిఫారంలో ఉన్నట్లున్నాడే.... ఆర్మేనాక్ కాదు కదా?"

మరు క్షణంలో తన వేపు పరిగెత్తుకొస్తున్న తన కొడుకును అతను గుర్తు పట్టాడు. ఔను, అది వాడే! పట్టుకుచ్చు వంటి జుట్టు కలిగిన యువతినీ, ఆమె పక్కనున్న కుర్రాణ్ణీ తన మనస్సులోంచి చెరిపెయ్యాలని ప్రయత్నించాడు. "బహుశా వాళ్ళు అపరిచితులేమోలే" అని ఆశగా సరిపెట్టుకొంటూ తన నడకను త్వరితం చేశాడు వావాసార్ద్.

ఎన్నో ఏళ్ల తర్వాత తండ్రీ కొడుకులు చివరకిప్పుడు కలుసుకున్నారు. తమ ఉద్వేగానందాతిరేకాలను దాచుకునేందుకు ప్రయత్నిస్తూ పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. కాని ఆర్మేనాక్ తన అరచేత్తో కన్నీటి బొట్టొకదాన్ని తుడుచుకున్నాడు. వృద్ధుడు డగ్గుత్తిక చెందిన తన గొంతు సవరించుకొని కంపిస్తున్న స్వరంతో "బాబూ! ఆర్మేనాక్! అమ్మయ్య, చివరకింటి కొచ్చేశావ్!"

ఆర్మేనాక్ తన తండ్రిని మరో మారు కౌగలించుకొంటూ "నాన్నా! నాన్నా!" అన్నాడు.

వావాసార్ద్ తన కొడుకు కళ్లలో ఏదో పసికట్టి, సంకోచంగా పక్కకి తిరిగాడు. అతని పక్కనే నిలబడి వున్న కుర్రాడి జుట్టు కూడా, ఆ యువతి జుట్టు లాగే పట్టుకుచ్చులాగుంది. వాడు తన నీలి కళ్ళు విప్పార్చుకొని వాళ్లకేసే చూస్తున్నాడు. ఆ యువతి ట్రంకు పెట్టె మీదనుంచి లేచి, సిగ్గుసిగ్గుగా ఆర్మేనాక్ వంకా, కుర్రాడి వంకా మార్చి మార్చి చూస్తోంది.

వృద్ధుడు ఆ యువతి వంక చూపు బరుపుతూ, తన కొడుకును మెల్లగా "ఎవరా అమ్మాయి?" అని అడిగాడు.

ఆర్మేనాక్ ఆమెతో రష్యన్ భాషలో ఏదో చెప్పాడు. ఆమె తొందరగా ముందుకొచ్చి

వావాసార్డ్‌కి తన చేతి నందించి, సిగ్గుగా "కులాసేనా, మామగారూ?" అని పలకరించింది.

వావాసార్డ్ చిరాకుగా ముఖం చిట్లించి, తన కొడుకు వంక చూశాడు. "నీకు ఆశ్చర్యం కలిగించాలని, నేను నీకు ముందు రాయలేదు నాన్నా. ఈమె నా భార్య. ఇదిగో, వీడు నీ మనవడు" అన్నాడు ఆర్మేనాక్.

వావాసార్డ్ కనుబొమలు పైకి లేచాయి. ఆర్మేనాక్ మాటలు అర్థం కాలేదన్నట్లు వావాసార్డ్ దిగ్భ్రాంతిలో ఉండిపోయాడు. అతని ఉద్వేగమంతా మాయమైంది. అతనా యువతితో కరచాలనం చేశాడు గాని తన చేతిని చటాలున వెనక్కి తీసేసుకొని, "నా మనవడా? ఈమె బిడ్డేనా?" అని అడిగాడు. అతని ముఖం పైన ఆశాభంగంతో కూడిన మందహాసం మెదిలింది.

ఆ యువతి మధ్యమధ్య తన భర్త వంక చూస్తూ తత్తరపాటుతో "ఆర్మేన్ మిమ్మల్ని గురించి చాలా చెప్పాడు. ఇప్పటికి మిమ్మల్ని కలుసుకోగలిగినందుకు నాకు చాలా సంతోషంగా వుంది" అంది.

ఆమె రష్యన్లో మాట్లాడిన అన్ని మాటల్లోనూ ముసిలాయనకి ఒకే ఒక్క మాట అర్థమైంది: అది తన కొడుకు పేరు. ఆ మాట అతనికి కర్ణకఠోరంగా వినిపించింది. అతను వంకరగా నవ్వి, "నీ పేరు ఆర్మేనాక్ అయితే నిన్నీవిడగారు ఆర్మేన్ అంటుందేంరా, తనకో భర్తని ఎలాగైతేనేం సంపాదించుకుందనుకో, కనీసం వాణ్ణి సరైన పేరు పెట్టి పిలవచ్చు కదా" అంటూ గొణిగాడు.

ఆర్మేన్ తన కుటుంబంతో లెర్నాషెన్ గ్రామంలో కాపురం పెట్టాడు. ముసిలాయన పగటి పూట వాళ్లతోనే గడిపేవాడు. కాని, అతను తన కోడలు పట్లా, కుర్రాడి పట్లా, తన కొడుకు పట్లా తన ప్రతికూల భావాన్ని అదుపులో పెట్టుకోలేకపోయేవాడు.

తన కొడుక్కి ఆర్మీనియన్ వధువును ఎంపిక చెయ్యాలన్న ముసిలాయన ఆశలు కూలిపోయాయి. తన కోడలూ, మనవడూ మాట్లాడే మాటల్లో తనకి ఒక్కటీ అర్థమై చావడం లేదు. అతని కొడుకే అతనికి అపరిచితుడయ్యాడు. తమ వియోగ కాలంలో తను ఎంతగానో ఊహించుకున్న ఆత్మీయత తన కొడుకు వైఖరిలో యిప్పుడ తనికిక ఎంతమాత్రం కానరావడం లేదు.

తీరా యిప్పుడు వాడు తన దగ్గరున్నప్పుడు, వావాసార్డ్‌కి దిగులుగా ఒంటరిగా ఉన్నట్లనిపిస్తోంది. ఇంతకు ముందరి తన అవస్థతల కారణంగా తనకి కలిగిన బాధ కన్న యిప్పుడీ బాధ మరింత దుర్భరంగా ఉంది. తన కొడుకు కుటుంబానికి సంబంధిం

చిన ప్రతీదీ అతనికి విజాతీయంగా పరాయిదిగా కనిపిస్తోంది. వాళ్లతో కలిసి వుండటం అతనికెంతో యిబ్బందిగా యిరకాటంగా అనిపిస్తోంది.

అతని కోడలికి కూడా అతనికి లాగే యిబ్బందిగా యిరకాటంగా అనిపిస్తోంది. వాళ్లిద్దర్నీ సన్నిహితులను చెయ్యడం, తన తండ్రిని తన్మాంతి పరచడం ఎలాగో ఆర్మేనాక్‌కి తెలియకుండా వుంది. తమ యిద్దర్నీ బంధించిన ప్రగాఢమైన ప్రేమను, యుద్ధాగ్ని మధ్యంలో పుట్టిన ప్రేమను ముసిలాయన ఎప్పటికైనా అర్థం చేసుకోగండా? ఆమె ఆర్మీనియన్ కాని మాటా, ఆమెకి ఒక కొడుకున్న మాటా నిజమే, కాని ఆమె ప్రేమా, సున్నితమైన ఆమె సేవా.శుశ్రూషలే తన ప్రాణాన్ని కాపాడాయి.

ఆర్మేనాక్ యీ విషయమెన్నడూ తన తండ్రికి చెప్పలేదు, అయినా, ముసిలాయన కెలాగూ ఆసక్తి లేదు.

ప్రతి ఉదయం ఆర్మేనాకూ, అతని తండ్రీ పనికి కలిసే వెళ్లేవారు. వాళ్ళ మాటామంతీ లేకుండా మౌనంగా పని చేసే వారు. అతని తండ్రి కొడుకు వంక గాని, నది ఒడ్డున ఆడుకొనే తన మనవని వంక గాని చూడకుండా ఉండేందుకు ప్రయత్నించేవాడు.

వేసవి ముగియవస్తోంది. బాదం పళ్ళు రాలిపోతున్నాయి. సీమచింత కొమ్మలు ఎర్రగా విచ్చిన పండ్లతో ఒరిగి వున్నాయి. ఎండకి రెండోమారు వాడిపోయినా మంచు తాకిడిని తట్టుకొనే గడ్డి పసుపుపచ్చగా కుదిమట్టంగా ఏపుగా ఉంది.

వంతెన త్వరలోనే పూర్తవుతుంది. ఏవో చిల్లరమల్లర పనులు తప్ప పని అంతా పూర్తయినట్లే. అయినా ముసిలాయన ఎడముఖం తగ్గలేదు.

ఓ రోజు రాత్రి వర్షపుజల్లు పడవారంభించింది. ఇంకా సేపటికి తెల్ల వారుతుం దనగా పర్వతాల మీంచి చల్లని ఈదురుగాలి వీచ నారంభించింది. ఆ గాలి ఎండుటాకులను చెట్ల నుంచి రాల్చి, గుడారం చుట్టూ సుడితిప్పుతోంది. వావాసార్ద్ ఆ చలికి తొందరగా లేచాడు. మహా చిరాకుగా వున్నాడు.

అంతకు ముందురాత్రి అతను భవిష్యత్తు గురించి తన కొడుకుతో మాట్లాడాలని ప్రయత్నించాడు. మొదట వాళ్ళు శాంతంగానే మాట్లాడుకున్నారు. ముసిలాయన అడిగిన ప్రశ్నలకు ఆర్మేనాక్ జవాబిచ్చాడు. తన తండ్రితో, యుద్ధ కాలంలో తను వంతెనలు కట్టనూ కట్టాను, వాటిని కూల్చనూ కూల్చానని చెప్పాడతను. కాని, ఎప్పుడైతే ఆర్మేనాక్ ఉక్కు వంతెనలని గురించీ, వాటినెంత వేగంగా నిర్మించవచ్చునన్నదాన్ని గురించీ, వాటి అందాన్నీ, వాటి తక్కువ బరువుని గురించీ పొగడుతూ చెప్పవారంభించాడో అప్పుడు వాళ్ళ సంభాషణ అనవ్యాయమైన మలుపు తీసుకుంది.

ముసలాయన ముఖం జేవురించింది. తన పూర్వీకులు నిర్మించిన వంతెనలు తన కొడుక్కి పనికిరావన్న మాట?

"నీ తాత ఖాచాతూర్ గాని, నీ తండ్రి గాని ఎన్నడూ ఇనప వంతెనలు కట్ట లేదు" అన్నాడతను కోపంగా. "ఆర్మీనియా గడ్డకి రాయే పునాది. ఏ వంతెన కట్టినా రాతితోనే కట్టాలి, అందులోనూ బాగా మలచని రాతితో కట్టాలి. అలా కట్టినప్పుడే జనం దాన్ని చూసి, నిర్మాత వృత్తిలోని కష్టాన్నీ, అతని అపారమైన బలాన్నీ గుర్తి స్తారు! లుంకియానొవ్ తాతా, ఖాచాతూర్ నాన్నా, లేచి రండి, వచ్చి మీ మునిమనవడు కట్టే యినప వంతెనలు చూడండి!"

"నిన్ను నేను అర్థం చేసుకోగలను నాన్నా. ఇంతకీ నువ్వసలు వాటిని చూడలేదు కదా" అన్నాడు ఆర్మేనాక్. కాని ముసిలాయన అతని మాటలు చెవిన చొరనివ్వలేదు.

"అయితే, నువ్వు చాలా వంతెనలే కూల్చావన్న మాట? కాని, నీ మనస్సు చివు క్కుమని కూడా అనలేదన్న మాట? అలా చెయ్యడానికి నీ అంతరాత్మ కొంచెం కూడా కించపడలేదన్న మాట?"

యుద్ధ కాలంలో వంతెనలు కూల్చినందుకు తన కొడుకును గట్టిగా చివాట్లు పెట్టడమన్నది నావాసార్ద్ సంకల్పం కానే కాదు. వాటిని శత్రువుకి వదలడం సాధ్యం కాదన్న సంగతి అతనికి తెలుసు. తండ్రిగా కొడుకును కూకలేసే హక్కు తన కుంది కనక మాత్రమే అతను కూకలేశాడు. తద్వారా, శతాబ్దాల తరబడి వంతెన నిర్మాతలైన తన కుటుంబీకుల మార్గానికి తన కొడుకును కూడా మళ్లించడమే అతని ఉద్దేశం. మరో జాతికి చెందిన స్త్రీని యింటికి తెచ్చి, తన కులంను కూల్చేసినందుకు, ఆర్మే నాక్‌ని యీ విధంగా శిక్షించాలని అతను ప్రయత్నించాడు.

తామిద్దరూ అనుకున్న మాటలన్నీ జ్ఞాపకం చేసుకొని, "నువ్వెలాంటి పనిచేశావు ఆర్మేనాక్!" అనుకున్నాడు ముసిలాయన. "నేనీ లోకం విడిచిపోయాక, మన కుటుంబ వారధిని యీ గట్టు నుంచి అవతలి గట్టుకి ఎవరు వేస్తారు?"

అది నిన్నటి సాయంత్రం సంగతి. నావాసార్ద్ మూలిగాడు. అతను తన తలను అరచేతుల మధ్య వుంచుకొని, "బహుశా ఆ యినప వంతెనలు మరీ అంత చెడ్డవి కావేమో" అనుకున్నాడు. కాని అతనీ విషయం చచ్చినా ఎన్నడూ బహిరంగంగా ఒప్పుకోడు. అందుకని అతను గాభరాగా పైకి అనుకున్నాడు "అయితే నేను చచ్చిపోయాక నువ్వు ఇనప వంతెనలు కడతావన్న మాట, కదురా అబ్బాయ్! సరే, సరే, చిన్నా పెద్దా మా అందరి సవాలక్ష కృతజ్ఞతలు అందుకో నాయనా!"

అలా అనుకుంటూ అతను, నల్లని ఆకాశం వంక, అస్పష్టంగా వున్న నదీ జలం

వంకా చూస్తూ, శతాబ్దాలుగా వస్తున్న తన పూర్వీకుల సంప్రదాయాలు చీకటిలోనే భూస్థాపితం చెయ్యబడ్డాయేమోనన్నట్టు కాళ్ళు తాటించుకొంటూ గుడారం దగ్గర్నుంచి బయటికెళ్ళాడు.

అతను ముఖం కడుక్కోడానికి నీటి అంచుకి వెళ్ళాడు. అక్కడ అతని మనవడు వదిలేసిన బొమ్మ కారు కనిపించింది. ఒక క్షణం దాని వంక చూస్తూ నిలబడి, తర్వాత వంగి, దాన్ని పైకి తీశాడు. దానిలో వావాసార్డుకి పట్టుకుచ్చులాంటి జుట్టు కలిగిన నీలి కళ్ల బాలుడు దర్శన మిచ్చాడు.

ఆ బొమ్మని పట్టుకొని, దాన్ని ఏం చెయ్యడానికీ తోచక, వావాసార్డ్ అక్కడే నిలబడిపోయాడు. కొంత కాలంగా అతని మనస్సునొక ముఖ్యమైన ప్రశ్న వేధిస్తోంది. తన కొడుకు కుటుంబాన్ని తను అలా అశ్రద్ధ చెయ్యడం పొరపాటేమోనన్నదే అది. కాని తన పొరపాటును ఆమోదించడం అంత తేలికైన పని కాదు. కాని ఆ ప్రశ్న నింక దాటవెయ్యడం కూడా ఎంతమాత్రం సాధ్యం కాదు.

తన మనవడ్ని గురించి ఆలోచిస్తూ, "నువ్వు మంచి వాడివిలాగే ఉన్నావురా" అనుకున్నాడతను నిట్టూరుస్తూ. మళ్లీ అతనికి తన మీద తనకే కోపం వచ్చింది. "ఇంతోటి గొప్ప విషయం నాకింతకు ముందు తెలియదన్నట్లు" అని చిరాకు పడ్డాడు.

అతని చేతులు వణికాయి. ఆ బొమ్మని తల్క్రిందులు చేసి చూశాడు. ఓ చక్రం వదులుగా ఉంది. అతను సాలోచనగా గుడారంలో కెళ్లి, ఆ చక్రాన్ని బిగించి, మళ్ళీ బైటకెళ్ళాడు.

తూర్పున ఆకాశపుటంచు బూడిద రంగుకి మారింది. పిచ్చుకలు అక్కడక్కడ కీచుకీచుమంటున్నాయి. నీరు యిప్పుడు మకిలి పట్టిన వెండిలా కనిపిస్తోంది.

బొమ్మను తడుముతూ, తన చేతులెందుకు వణుకుతున్నాయా, తన కళ్ళు పొగకి మండినట్లెందుకు మండుతున్నాయా అని ఆశ్చర్యపడుతూ వావాసార్డ్ అక్కడే నిలబడ్డాడు. అతను తన కళ్లను చొక్కా అంచులతో తుడుచుకొని, బాదం చెట్ల వేపు వెళ్ళాడు. బాదం పళ్లతో తన జేబులు నింపుకొని, గ్రామానికి బయల్దేరాడు.

అతను వాళ్ల యింటి కెళ్లే సరికి అతని కొడుకూ, కోడలూ నిద్ర లేచారు. ఆర్మెనాక్ టీ తాగుతున్నాడు. అతని భార్య అతని మధ్యాహ్న భోజనం పొట్లం కడుతోంది. వావాసార్డ్ లోపలకి రావడం చూసి వాళ్లిద్దరూ గాభరా పడ్డారు.

"తఫావతేం జరగలేదు కదా, నాన్నా?"

వావాసార్డ్ తన టోపీ తీస్తూ, "ఏమీ లేదు" అని జవాబిచ్చాడు.

ఓ క్షణం నిశ్శబ్దం ఆవరించింది.

"రండి కూర్చోండి మామగారూ, కొంచెం వాస్తా చేద్దురు గాని" అతని కోడలు సిగ్గుపడుతూ అంది. మౌనం భగ్నమైంది.

"కుర్రాడింకా నిద్ర పోతున్నాడా?" అర్మేనాక్‌ని వావాసార్ద్ అడిగాడు.

అతని మాటలను అర్మేనాక్ తన భార్యకు అనువదించి చెప్పాడు.

"ఆఁ" అందామె తల ఊపుతూ.

ముసలాయన తన మనుమని పక్క దగ్గరకెళ్లాడు, ఆట బొమ్మని నేల మీద పెట్టాడు, బాదం పళ్లు దుప్పటి మీద పోశాడు, నిద్రిస్తున్న కుర్రవాని నుదురు ముద్దు పెట్టుకొని మెల్లగా గొణిగాడు: "లేరా మనవడా, ఇది మనిషికి పడుకునే సమయం కాదు. మనం పనికి పోవాలి. వంతెన మన కోసం ఎదురుచూస్తోంది."

అర్మేనాక్ కూడా లోగొంతులోనే తండ్రి అన్న మాటలు తన భార్యకి అనువదించి చెప్పాడు. ఉద్వేగ కారణంగా ఆమె మరింత బిడియంతో కొడుకు పక్క దగ్గర కెళ్లి "లే, బాబూ. నీ కోసం మీ తాతగారొచ్చారు. ఊఁ, లే మరి, బట్టలు మారుస్తాను రా" అంటూ తట్టి లేపింది.

వాళ్లు ముగ్గురూ పనికి బయల్దేరారు, తాతా మనవళ్లు ముందర వెళ్తూంటే, అర్మేనాక్ వాళ్లకి నాలుగడుగులు వెనక నడుస్తున్నాడు. ముసలాయన కుర్రాడితో మాట్లాడినప్పుడల్లా అర్మేనాక్ వాళ్లని కలుసుకుని, తండ్రి అన్న మాటల్ని కొడుక్కి అనువదించి చెప్తున్నాడు.

కుర్రాడి చేతిని తన చేత్తో నలుపుతూ, "నీకు నేను రాతి వంతెనలు కట్టడమెలాగో నేర్పుతాను" అంటూ వావాసార్ద్ చెప్ప నారంభించాడు. "ఇది నీ పూర్వికుల సంప్రదాయం. నాకో కొడుకున్నాడు. ఒకప్పుడు వాడూ రాతి వంతెనలే కట్టేవాడు, కాని, యిప్పుడు వాడు ఇనుప వంతెనలు కడుతున్నాడు, వాడు మన పద్ధతి నుంచి తప్పుకున్నాడు. నువ్వు నీ మొదటి వంతెన కట్టే రోజొస్తుంది. అప్పుడు నేనీ ఒడ్డు మీదే ఉండిపోతాను, అప్పుడు నువ్వు నా శరీరమనే వంతెన మీదుగా దాటి అవతలి ఒడ్డు కెళ్తావు. అప్పుడిక పొంగి పారే మన నదుల మీదుగా, మా తాత ఉంకియాహొన్, చనిపోయిన మా నాన్న ఖాచాతూర్, మీ సొంత తాత ప్రధాన మేస్త్రీ వావాసార్ద్ం చాలులో నువ్వూ రాతి వంతెనలు కడుతూ ఉంటావు."

ఆ రోజు పని ముగిశాక, మనవడు వావాసార్ద్ గుడారంలోనే ఉండిపోయాడు.

వావాసార్ద్ తన కొడుకు చూపును తప్పించుకొంటూ "పట్టుకుచ్చు వంటి జుట్టు కలిగిన యిలాంటి మనవడిని నాకిచ్చినందుకు నేనామెకు శాశ్వతంగా కృతజ్ఞుడినని నా కోడలితో చెప్పు. పట్టుకుచ్చులాంటి జుట్టూ, యింతటి నీలి కళ్లూ కలిగిన పిల్లలు

ఆర్మీనియాలోనూ ఉన్నారనుకో. అయినా, మరీ గర్వంతో పొంగి పోవద్దని చెప్పు ఆమె గారితో. మన ఆచారం ప్రకారం వాడు నా దగ్గర ఉండాలని కూడా చెప్పు. నేను చెప్పల్సిందింతే. చీకటి పడుతోంది ఆర్మేనాక్, నువ్వింక యింటికెళ్ళు."

ఆర్మేనాక్ వెళ్ళిపోయాక, తన మాటలెవరికీ వినిపించకుండా ముసిలాయన మెల్లగా జోడించాడు. "ఆమెకి నా గౌరవాభివందనాలు అందచెయ్యి. ఆమె తల్లి, స్త్రీ, ఆమె హృదయం చాలా విశాలమైనది."

తన మనవడికి కప్పేందుకని ఆ రోజు రాత్రంతా ముసిలాయన లేస్తూనే వున్నాడు. తనలో తనే ఏదేదో గొణుక్కునేవాడు. అతని హృదయం తరగని జీవితేచ్ఛతో ఆకృష్టమైంది.

"మనవడా, యిప్పుడు నా జీవితానికి ఒక లక్ష్యం సమకూడింది. సూర్య భగవానుడు నీ లాంటి వాడిని నాకిచ్చాడంటే, దాని అర్థం, ఆయన నా మరణాన్ని వాయిదా వేస్తున్నాడన్న మాట. నిజం చెప్పాలంటే, నావాసర్డ్ కి జీవించేందుకిప్పుడిక బుల్లి వంతెన లాంటి వాడొకడున్నాడు కనక, ముసిలి నావాసర్డ్ నిప్పుడిక ఏ మిత్తి ఎత్తుకుపోలేదు."

* * *

ఆర్మీనియాలోని ఒక పర్వత ప్రాంతంలో, పరవళ్ళు తొక్కుతూ ప్రవహించే ఒక నది మీద, ఓ కొత్త రాతి వంతెన కడుతున్నారట. ఇది ఎత్తైన పెద్ద వంతెనట. ప్రధాన మేస్త్రీ నావాసర్డ్ గుడారం నది ఒడ్డున బిగించబడింది. గుడారం లోపల రెండు మంచా లున్నాయి. పని అయిపోయాక ముసిలాయన ఒక మంచం మీద పడుకుంటాడు, రెండో దాని మీద అతని మనవడు, పట్టుకుచ్చులాంటి జుట్టూ, తెలివైన నీలి రంగు కళ్ళూ కలిగిన పద్నాలుగేళ్ళ కుర్రాడు పడుకుంటూ వుంటాడు.

మృత్యువు యింతవరకు ముసిలి నావాసర్డ్ జోలికీ, అతని వంశం జోలికీ పోకుండా తప్పించుకు తిరుగుతోంది.

సెరో ఖాంజాద్యాన్

సెరో ఖాంజాద్యాన్ (జననం 1915) రైతు బిడ్డ. బాల్యంలో గొర్రెల కాపరి. ప్రాథమిక పాఠశాలోపాధ్యాయుడుగా శిక్షణ పొంది, 1934లో పట్టా తీసుకున్నాడు. 1941లో యుద్ధం ప్రారంభమయ్యే దాకా పర్వతప్రాంత గ్రామాల్లో ఉపాధ్యాయుడుగా పని చేసి, యుద్ధం ప్రారంభం కాగానే సైన్యంలోకి వెళ్ళాడు. ఖాంజాద్యాన్ యుద్ధంలో కొన్ని సార్లు క్షతగాత్రుడయ్యాడు, ఎన్నో పతకాలు పొందాడు.

ఖాంజాద్యాన్ మొదటి పుస్తకం "మా రెజిమెంటు మనుషులు" (1949), సాహసోపేతులైన లెనిన్‌గ్రాడ్ పరిరక్షకులను గూర్చిన రచన. అది వెలువడగానే ప్రశంసలను పొందింది. తదాదిగా ఆయన అనేక నవలలను, కథా సంపుటాలను, బాల బాలికలకూ, కౌమార వయస్కులకూ పలు పుస్తకాలనూ రచించాడు. "తెల్ల గొర్రెపిల్ల" సత్ప్రవర్తనకూ, నైతిక సూత్రాలకూ సంబంధించిన కథ.

తెల్ల గొర్రెపిల్ల

ముసలి తోటమాలి నావాసార్ద్ బాదం చెట్టు మొదట్లో వున్న నీటిబుగ్గ దగ్గరకు ముఖం కడుక్కొని కాసేపు విశ్రమించడానికి వెళ్ళాడు. ఆ శీతల జలాలను ఎండకు కగ్గిన ముఖంపై జల్లు కోవాలని వంగాడో లేదో యింతలోనే వాళ్ల మేస్త్రీ "ఓయ్ నావా సార్ద్! త్వరగారా! నీ కొడుకు అర్సాక్ వచ్చేశాడు!" అంటూ బిగ్గరగా అరిచి చెప్పాడు.

"ఏమిటి?!" అంటూ కష్టం మీద నిటారుగా లేచి నిలబడ్డాడు వృద్ధుడు. ఆయన వయస్సులో ఆశ్చర్యం గొలిపే లాఘవంతో తన మేస్త్రీ ఉన్న చోటుకి పరుగు తీశాడు. "ఏమిటి నువ్వన్నది? మా వాడెప్పుడొచ్చాడు? ఎక్కడున్నాడు?" అంటూ అతనిపై ప్రశ్నల వర్షం కురిపించాడు.

"మన ఊళ్లోనే ఉన్నాడు. నేను స్వయంగా చూశాను. నీలం రంగు పెద్ద కారుమీద వచ్చాడు. నువ్వు బలే అదృష్టవంతుడివి నావాసార్ద్, దేవుడు నీకు చక్కటి కొడుకుని ప్రసాదించాడు!"

సూర్యుడు అంతకు ముందరి కన్న పదింతలు జాజ్వల్యంగా ప్రకాశిస్తున్నట్లు కనిపించాడు. నావాసార్ద్‌కి తను గాలిలో తేలిపోతున్నట్లు నిపించింది. అతని హృదయం ఉత్సాహోద్వేగాలతో పొంగిపోతోంది.

గ్రామం వంక చూస్తూ నావాసార్ద్ ఏవేవో ఆలోచనల్లో మునిగినట్లు కనిపించాడు. కాని గ్రామంలోకి వెళ్దామని బయల్దేరిన మనిషి చటుక్కున వెనక్కి తిరిగి ద్రాక్షవళ్ల నుండి రసం తీసే మర వేపు పరుగు తీశాడు.

అర్సాక్‌ను తను చూసి యిప్పటికప్పుడే పదేళ్లై పోయింది. ప్రతి ఏడూ రోడ్డు వంక ఆశగా ఎదురుచూస్తూ తన అర్సాక్ రాక కోసం కళ్ళు కాయలుకాసేలా ఓపికగా

ప్రతిక్షించాడు. అర్నాక్ మంచి సమయంలో వచ్చినందుకు నావాసార్డ్‌కి ఆనందంగా ఉంది. తోటలో పళ్లు పక్వానికొచ్చి వున్నాయి. తనింకా మూల పడకుండా ఆరోగ్యంగా, హుషారుగా వున్నాడు.

నావాసార్డ్‌కి గ్రామంలో చుట్టాలెవరూ మిగిలిలేరు. అతని జీవితం సంతోషంగా ఏమీ గడవలేదు. అతనికి సొంత పిల్లలు ఎవరూ లేరు. అతని భార్య చాలా ఏళ్ల క్రిందటే చనిపోయింది. అతని అన్నా వదినా యుద్ధకాలంలో ఆకలిబాధకు చనిపోయారు. వాళ్ల ఏకైక సంతానమే అర్నాక్.

గుంటవారి నేల మీద పడి వున్న పార తీసుకొని నావాసార్డ్ తవ్వనారంభించాడు. తడితడిగా వున్న మట్టి ద్రాక్ష సారావాసన కొడుతోంది. ఎప్పుడో పదేళ్ల క్రితం తను పాతిపెట్టిన చిన్న మట్టిజాడీని అతను పైకితీశాడు. చల్లగా వున్న జాడీని చేత్తో తడిమి సంతృప్తిపడ్డాడు. సన్నగా గుబాళించే ద్రాక్షసారా సువాసనను ఆఘ్రాణించి ముసిముసిగా నవ్వుకొంటూ "ఇది సింహపు పాలలా తయారైంది" అనుకున్నాడు. నది ఒడ్డున వున్న పెద్ద మల్బరీ చెట్టు మొదట్లో వున్న పుచ్చ పాదుకి పక్వానికొచ్చిన చాలా పెద్ద పుచ్చ కాయ ఒకటి ఉన్న సంగతి అతనికి గుర్తుకొచ్చింది. దాన్ని అతను కోసి దాని పైన వున్న బూడిద వంటి నూగును తన పొడుగు అంగీ అంచుతో తుడిచి, మిలమిల మెరిసే చారల వంక మెచ్చికోలుగా చూశాడు.

"మా అర్నాక్‌కి పుచ్చకాయలంటే మహా యిష్టం" అంటూ గొణుక్కున్నాడు. అతను మోకాళ్లపై వంగి, పుచ్చకాయను తన చెవికి ఆన్చుకొని ఊపి చూసి, ఆ శబ్దానికి తృప్తి పడ్డాడు. తర్వాత అతను అత్తిచెట్టు దగ్గర కెళ్లి, కష్టం మీద పైకెక్కి చిలకలు కొట్టిన తియ్యని పళ్లను ఏరి ఏరి కోశాడు. వాటిలో మంచి మంచి వాటిని ఏరి గంపలో వేసుకున్నాడు.

తర్వాత నావాసార్డ్ నది ఒడ్డు వెంబడి పచ్చిక మేస్తున్న ఆర్నెల్ల తెల్ల గొర్రెపిల్ల దగ్గరకెళ్లాడు. ఇలాంటి శుభసందర్భం కోసమే దాన్ని అతను అట్టేపెట్టాడు.

నావాసార్డ్ తనలో తను "అర్నాక్ యిన్నేళ్లకి యింటి కొచ్చాడు. ఈ రోజు కోసమే నేను ఇంత వరకూ బతికి వున్నాను" అనుకొంటూ గొర్రెపిల్ల పలువు విప్పాడు. అది బిగ్గరగా అరిచింది.

"పదవే పోదాం యింటికి" అన్నాడు నావాసార్డ్. "రా, రా, అర్నాక్ యింటి కొచ్చాడు."

అతను గ్రామానికి పోయే ఏటవాలుగా యిరుకుగా వున్న గట్టు పైకెక్కాడు. బరువైన గంప అతని భుజాలను క్రుంగదీస్తోంది. జాడీలోని ద్రాక్షసారా తొణికి

సలాడుతోంది. పాధువైన సాత్వికమైన గొర్రెపిల్ల ఒక్కొక్క సారి ముందుకు దౌడు తీస్తోంది మరో సారి అతనికన్న వెనక పడుతోంది.

త్రోవలో అతనికి కలిసిన వాళ్ళ "ఏమిటీ రోజు యింత పొద్దుండగా యింటి కెళ్తున్నావ్?" అని ప్రశ్నించారు.

"మా అర్నాక్ ఇంటి కొచ్చాడు" అంటూ ముసలాడు సగర్వంగా జవాబిచ్చాడు.

దారి వెంట కనిపించిన ప్రతి చెట్టూ, ప్రతి పొదా, ప్రతి రాతి బండా, ప్రతి నీటి బుగ్గా అర్నాక్ బాల్యాన్ని అతనికి గుర్తుకు తెచ్చాయి. అర్నాక్ చిన్న బిడ్డగా వున్నప్పుడు వాడిని తన భుజం మీది కెక్కించుకుని యీ ఏటవాలు త్రోవ వెంట అనేక మార్లు ఉప్పొంగిపోతూ మోసుకెళ్లాడు. అయాసం వచ్చినప్పుడు యిదిగో ఈ రాతి మీద వాళ్ళ కూర్చునేవాళ్ళు. వావాసార్డ్ అర్నాక్ చేతిలో ఒక బేరికాయ పెట్టి, పొడవాటి తన అంగీ అంచుతో వాడి ముక్కు తుడిచేవాడు. అదిగో ఆ బుగ్గ మంచి మంచినీళ్ళ తాగడమంటే అర్నాక్‌కి చాలా యిష్టంగా ఉండేది. వావాసార్డ్ తన దోసిట్లోకి నీళ్ళ తీసి అర్నాక్‌కి పట్టించేవాడు. ఈ చిన్న పళ్లతోట అప్పుడూ వుండేది. అందులో చెట్లు యింకా పుష్కలంగా కాస్తూనే వున్నాయి. ఆకురాలు కాలం వచ్చి చాలా రోజులు గడిచిపోయే దాకా ఆ చెట్లు పచ్చగానే ఉండేవి. ఏడేళ్ల వయస్సప్పుడు అర్నాక్ ఒక చెర్రి చెట్టు మీదనుంచి కిందపడి కాలు విరగ్గొట్టుకున్నాడు. ఎక్కడో కొన్నిమైళ్ల దూరాన గల గ్రామంలో వున్న డాక్టరు దగ్గరకి వావాసార్డ్ వాడిని మోసుకెళ్లాడు.

ఇదిగో ఆ చిన్న తోట. దాంట్లో ప్రతి వేసవి కాలంలో పళ్ళ పండుతాయి. ఆకురాలు కాలం ఆఖరి రోజుల వరకు దాని చెట్ల నీడలో ఆహ్లాదకరంగా వుంటుంది. చాలా కాలం క్రితం వావాసార్డ్ ఆ తోటను అమ్మేశాడు. పై చదువుకి పంపినప్పుడు అర్నాక్‌కి నగర జీవితానికి అవసరమైన దుస్తులూ వస్తువులూ అమర్చడానికని తను ఎన్ని వస్తువులు అమ్మేయ్యాల్సి వచ్చిందో వావాసార్డ్ గుర్తు చేసుకున్నాడు. ఆ పాత పాత అర్నాక్ అక్కడే చాలాకాలం ఉండిపోయాడు. అర్నాక్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ తీసుకుని, అక్కణ్ణుంచి మాస్కోలో చదవడానికెళ్లాడు. వాడు జీవితంలో ఉన్నతమైన స్థాయికి చేరుకున్నాడు.

వావాసార్డ్ తరచు తన తోటి గ్రామస్తులతో రాజధాని నగరంలో అర్నాక్ చాలా ముఖ్యమైన ఉద్యోగం చేస్తున్నాడనీ, వాడికి పెద్ద కారుందనీ, మాస్కోలో అన్నింట్లోకీ చాలా పెద్ద యింట్లో నివసిస్తున్నాడనీ గర్వంగా చెప్పుకొంటూండేవాడు.

ముసలి వావాసార్డ్ యింటికి త్వరగా చేరుకోవాలని తొందర పడుతున్నాడు. జాడీలోని ద్రాక్షసారా తొణికిసలాడుతోంది. సాత్వికమైన గొర్రెపిల్ల అతన్ని అనుసరించి నడుస్తోంది.

నావాసార్ద్ చివరకి యింటికి చేరుకున్నాడు. కాని, యింటి ముందు అర్షాక్ కారు కనిపించలేదు. "అర్షాక్ కారింకా రాలేదేమబ్బా?" అనుకుంటూ నావాసార్ద్ ఆశ్చర్య పోయాడు. "అయినా, నా మతి మండ, యిక్కడ రోడ్డింత గతుకులుగా వుంటే కారెలా వస్తుందిక్కడికి? బహుశా తన కారు టైర్లు పాడవుతాయని వాడు భయపడి వుంటాడు. కారు తీసుకుని నేరుగా యింటికి రాకపోవడం మంచిదే అయింది."

అతని ఒంటి అంతస్తు మిద్దె, మట్టిమెత్తిన నేలతో కొండ కొమ్ముల్లో రాబందులు కట్టుకున్న గూడులా వుంది. ఊళ్లోని అలాంటి అనేక యిళ్లలో యిదొకటి.

నావాసార్ద్ యింటి ముందరి ఆవరణలో ప్రవేశించాడు. ద్రాక్ష సారా జాడీ, పళ్ల గంప కింద పెట్టాడు. గుప్పెడు పచ్చగడ్డి పరకలు తీసి గొర్రెపిల్ల ముందేసి, చుట్టూ కలయ జూశాడు. జీవితంలో మొట్టమొదటి సారి అతనికి తన యిల్లు పాతదైపోయి బావురుమంటున్నట్లు కనిపించింది.

"అయినా అర్షాక్ యిల్లూ యిదే కదా. వాడీ యింట్లోనే పెరిగాడు. తన సొంత యిల్లు చూసి వాడు సిగ్గు పడతాడనుకోను" అని తనను తాను సమాధాన పరచుకొని నావాసార్ద్ ఆవరణ శుభ్రం చెయ్యనారంభించాడు. దడి మీదుగా చూస్తూ పొరుగింటి ముసలమ్మ అడిగింది:

"అభినందనలు నావాసార్ద్. మీ అర్షాక్ తిరిగి వచ్చాడట కదా."

నావాసార్ద్ మనస్సు సంతోషంతో ఉప్పొంగింది, "ధన్యవాదాలు. మీ దేశ సంచారి కూడా తిరిగి వచ్చుగాక" అని జవాబిచ్చాడు.

"నేను మీ అర్షాక్‌ని చూశాను."

"ఏమిటి! వాడిక్కడి కొచ్చాడా?"

"అబ్బే లేదు. నేను మాదుల పొట్లం కొనుక్కుందామని అంగడి కెళ్లాను. మీ అర్షాక్‌ను వ్యవసాయ క్షేత్ర కార్యాలయం ముందు చూశాను. ఓహ్, కుర్రాడెంత బాగున్నాడనుకున్నావ్, రాజ కుమారుడిలా ఉన్నాడనుకో. నేను వాడి మించి నా దృష్టి మరల్చుకోలేకపోయానంటే నమ్ము. దేవుడు నీకు మేలు చేయుగాక."

ఉద్వేగంతో బొంగురు పోయిన స్వరంలో ముసలాయన "సంతోషం" అన్నాడు. మరింత పట్టుదలగా ఆవరణ పరిశుభ్రం చెయ్యసాగాడు.

మొదట అతను కసువంతా ఊడ్చి, పోగు ఎత్తేశాడు. "మా బాబు బూట్లు మట్టి కావడం నేను సహించలేను" అనుకున్నాడు. తర్వాత అతను పైకి పొడుచుకుని వున్న ఒక మేకును, "అర్షాక్ అంగీ చేతులు దీనికి తగులుకుని చిరిగి పోవచ్చు" ననుకుంటూ, రాతితో అణగకొట్టాడు.

నావాసార్ద్ వాకిలి తెరిచాడు. ఒక మంచం బోసిగా వున్న గోడకి చేర్చి వుంది. "బాబు గదిలోకి రాగానే, ఒరే అర్సాక్, నువ్వీ మంచం మీదా, నేనీ నేల మీదా ఎలా పడుకునే వాళ్లమో గుర్తుందా నీకు?" అని గుర్తు చేస్తాను అంటూ అతను దుప్పటి సవరదీస్తూ పైకే ఆలోచించ నారంభించాడు. "వాడికి నేనింకో విషయం కూడా గుర్తు చేస్తాను: 'ఇదిగోరా నీ పాత గిన్నె. దీంట్లోనే నువ్వు అన్నం తినేవాడివి. అర్సాక్, యీ క్రచెమ్చా చూశావా. వ్రడంగి బత్తుడు మనాస్ దగ్గర నేనీ చెమ్చా తీసుకొచ్చిన రోజు నీకు గుర్తుందా? దీని మీద పువ్వులూ లతలూ లేవని నువ్వు మారాం చేశావు. అప్పటికప్పుడు నేను వెళ్లి పనివాడిచేత దాని మీద రంగులతో బొమ్మలు వేయించి తీసుకొచ్చాము, గుర్తుందా?' "

అర్సాక్‌తో ఊహామాత్రంగానే అలా సంభాషిస్తూ నావాసార్ద్ నీటిబుగ్గ దగ్గర కెళ్లి, నీళ్లు పట్టుకొచ్చి ఆవరణలోనూ, మిద్దె పైనా, యింట్లో నేల పైనా చిలకరించాడు. అప్పుడిక ఊడవడం మొదలెట్టాడు.

కంచె మీదుగా పొరుగింటి ముసలామె ముఖం మరోమారు దర్శనమిచ్చింది.

"నావాసార్ద్, మీ అర్సాక్ వ్యవసాయ క్షేత్ర అధ్యక్షుని యింటి కెళ్లాడట విన్నావా?"

"లేదే, ఎప్పుడెళ్లాట్ట అక్కడికి?"

"సరిగా నువ్వింటికొచ్చే ముందరే."

"ఇంటి దగ్గర ఎవరూ లేకపోవడం చూసి, విశ్రాంతి తీసుకునేందుకు బహుశా అక్కడకెళ్లి వుంటాడు. కాసేపట్లో వచ్చేస్తాడు, దారి తప్పిపోడులే."

"అంతేలే."

నావాసార్ద్ కొన్ని చిదుకులేరుకొచ్చి, బయటి పొయ్యి పక్క పెట్టాడు. తర్వాత తన బెల్టుకున్న చాకును పైకితీసి, గ్రేపెల్లి దగ్గర కెళ్లాడు. చివ్వరి నిమిషంలో మళ్లీ మనసు మార్చుకున్నాడు. "అర్సాక్ వచ్చే దాకా ఆగుదాం" అని నిర్ణయించుకుని అధ్యక్షుని రెండంతస్తుల మేడ వంక చూడసాగాడు. "ఏడింత ఆలస్యం చేశాడెందుకబ్బా? కాసేపట్లో చీకటి కూడా పడిపోయేలా వుంది. అత్తి పళ్ళు పాడైపోతాయి. చెర్రీ పళ్ల రుచి చెడుతుంది" అనుకున్నాడు.

అతను గంపలోంచి పళ్లను బయటకు తీసి కిటికీ గట్టు మీద పెట్టాడు. తర్వాత అతను పొరుగువాళ్ల యింటి నుంచి ఓ కొత్త టేబిలుక్లాత్ బదులుపట్టుకొచ్చి, టేబిలు మీద పరిచాడు. జంబుఖానా శుభ్రంగా దులిపి, మంచం మీద పరిచాడు. దాని మీద ఒక తలగడ 'పెట్టాడు.

ఇప్పుడంతా సర్వస్వం సిద్ధంగా ఉంది. అప్పటికీ, అర్నాక్ రాలేదు. "ఏం జరిగిం దబ్బా! పిడుసలు అధ్యక్షుని యింటి కెందుకెళ్లినట్లు?" నావాసార్డ్ చిరాకుగా ఆశ్చర్యంగా అనుకున్నాడు. అతని చేతులు కంపించాయి. "అర్నాక్ ప్రముఖ వ్యక్తి కదా. అందుకని అధ్యక్షుని దగ్గర ఆగి గ్రామంలో పరిస్థితులెలా వున్నాయని వాకబు చెయ్య డానికి వెళ్లి వుంటాడు. అయినా, యింతలోనే కొంప యేం మునుగుకు పోయింది? వాడిని మూడు నాలుగు రోజుల పాటు బయటికి కదలకుండా తనీగా నా దగ్గరే అట్టే పెట్టేసుకుంటాను. నా కళ్ల ఎదుట నుంచి కదలనివ్వను. ఇప్పుడు ఆలస్యమైనందుకు అదే మందు."

సూర్యుడు అస్తమిస్తున్నాడు, అప్పటికీ అర్నాక్ యింటికి రాలేదు. ముసలాయన ఆదుర్దా పెరిగిపోయింది. అధ్యక్షుని యింటి కెళ్దామా అని క్షణకాలం ఊగిసలాడాడు, కాని తర్వాత మనస్సు మార్చుకున్నాడు.

వాకిట్లోకి వెళ్లి, పొరుగింటాయన మనవడిని పిలిచాడు.

"బాబూ పరుగెత్తి కెళ్లి మా అర్నాక్ ఏం చేస్తున్నాడో చూడు. వాడితోనేం, నేనింటి దగ్గరే ఉన్నానని, వాడి కోసం ఎదురుచూస్తున్నానని చెప్పిరా" అన్నాడు నావాసార్డ్.

కుర్రాడు పరిగెట్టుకెళ్లి అంతలోనే తిరిగొచ్చాడు.

"ఏం బాబూ, అర్నాక్ కనిపించాడా?"

"ఆ."

"వాడేం చేస్తున్నాడు?"

"ద్రాక్షసారా తాగుతున్నాడు."

"నేనింటి దగ్గరే ఉన్నానని చెప్పావా, నువ్వు వాడితో?"

"ఆ."

"మరి వాడేమన్నాడు?"

"ఏం చెప్పాడంటే, 'సరేలే' అన్నాడు."

నావాసార్డ్ ఆ మాటల్ని పునశ్చరణ చేసుకున్నాడు. "అంటే, వాడు త్వరలోనే యింటి కొచ్చేస్తాడన్న మాట. సరే, ఈలోగా నేను చీకులు కాల్చేందుకు నిప్పు రాజేస్తాను."

అతను త్వరలోనే పొయ్యి కణకణమండేలా రాజేశాడు. తర్వాత అతను మాంసం గుచ్చి కాల్చే ఊచలు శుభ్రం చెయ్య సాగాడు. అతను యింట్లోకెళ్లి బల్ల శుభ్రంగా తుడిచి, టేబిలు దగ్గర కూర్చుని అర్నాక్ కోసం ఎదురుచూడసాగాడు.

కాలం అదే పనిగా గడిచిపోతోంది. గ్రామంలో అన్ని యిళ్లలోనూ దీపాలు వెలి

గాయి. ఇళ్లన్నీ వెచ్చగా కనిపించసాగాయి. వీధుల్లో జన సంచారం పలచబడసాగింది. మరి కొంచెం సేపట్లో దూరాన విలాపస్వరంలో కుక్కల మొరుగులు తప్ప మరే శబ్దమూ వినరావడం లేదు.

అర్నాక్ అప్పటికీ యింటికి తిరిగి రాలేదు. పొయ్యి ఆరిపోయింది. పొయ్యిలో బొగ్గు లన్నీ బూడిదైపోయాయి. గొర్రెపిల్ల గడ్డి మీద పడుకుని తాపీగా నెమరేస్తోంది. వావాసార్ద్ కళ్ళు పొడుచుకొని చీకట్లోకి చూస్తూ, చీమ చిటుక్కుమన్నా శ్రద్ధగా ఆలకిస్తున్నాడు. అతని కళ్ళు అలసిపోయి పోట్లెత్తుతున్నాయి. అతని తల భారంగా వాదుగా తయారైంది. అతను లేచి నిలబడ్డాడు, కాని అతని కాళ్లు ముందుకు కదల కుండా భీష్మించాయి. "నేను వెళ్లి వాడినెందుకు ప్రాధేయపడాలి? వయస్సులో నేను వాడి కంటె పెద్దవాడిని. వాడే రావాలి నా దగ్గరకి" అంటూ గొణుక్కో నారంభించాడు. కాని అంతలోనే, "దాని దేముందిలే, వాడు పెద్ద హోదాలో ఉన్నాడు. బహుశా అధ్యక్షునితో చర్చించాల్సిన ముఖ్యమైన వ్యవహారమేమైనా ఉందేమో. వాడు పొద్దున్న తప్పకుండా వస్తాడులే" అని తనను తాను సమాధాన పరుచుకున్నాడు.

కాని, యింకా అతను నిరీక్షిస్తూనే వున్నాడు. తెల్లవారు ఝాము దాకా ఎదురు చూస్తూనే వున్నాడు. ఆకురాలు కాలపు రాత్రి ముగియవస్తోంది. చీకట్లోకి కళ్ళు పొడుచుకొని చూస్తున్నాడేమో ముసలాయన కళ్ళు మసకబారాయి. క్రమంగా నిద్ర అతన్ని ఆవహించింది. టేబిలు దగ్గర కూర్చున్న వాడు కూర్చున్నట్టే వావాసార్ద్ నిద్ర పోయాడు.

తనెంత సేపు నిద్రపోయాడో అతనికి తెలియదు. ఆవరణలోంచి పొరుగింటామె అరుస్తున్న అరుపులకు అతనికి మెలకువ వచ్చింది. అతను కళ్ళు తెరిచి, సూర్యుని తొలి కిరణాలు కిటికీ గుండా లోపలికి రావడం చూసి ఆశ్చర్యపోయాడు.

"వావాసార్ద్! ఓయ్ వావాసార్ద్!" పొరుగింటామె పిలిచింది.

అతను హడావిడిగా యింట్లోంచి బయటకెళ్లాడు. పొరుగింటామె కంచె మీదుగా చూస్తోంది.

"ఇదేమిటి, నువ్వీ రోజున యింత సేపు నిద్రపోయావు?"

"ఏమిటి సంగతి? అర్నాక్ యింటి కొచ్చేస్తున్నాడా?"

"అబ్బే, లేదు" అందామె తన తల అడ్డంగా ఆడిస్తూ. "మీ అర్నాక్ వెళ్లి పోతున్నాడు. చూడదుగో రోడ్డు కేసి."

వావాసార్ద్‌కి మిన్నువిరిగి మీదపడినట్లనిపించింది. అతను పరుగున వెళ్లి ఎత్తు

తక్కువగా వున్న షెడ్డు పైకప్పు మీదకెక్కి చూశాడు. ఆర్నాక్ కారు సూర్యకాంతిలో మిలమిల మెరిసిపోతూ ముమ్మందుకు దూసుకుపోతోంది. త్వరలోనే అది అంతకంతకు చిన్నదై కనుమరుగైపోయింది.

తడబడుతున్న అడుగులతో వావాసార్డ్ పళ్లతోటల వైపు బయల్దేరాడు. అతని నడకలో మరింత ముదిమి కానవస్తోంది. నేల కేసే చూస్తున్న అతని కళ్ళు గుంటలు పట్టినట్లున్నాయి. అతని నడుము ముందెన్నటికన్న మరింత వంగిపోయినట్లుంది. తెల్ల గొర్రెపిల్ల గంతు లేసుకొంటూ అతని వెంట వెళ్లింది.

వార్దగేస పేత్రొస్యాన

వార్ద్‌గేస్ పేత్రొస్యాన్ 1932లో జన్మించాడు. ఎరెవాన్ విశ్వవిద్యాలయానికి చెందిన జర్నలిజం విభాగం నుంచి 1954లో పట్టా తీసుకున్నాడు. జిల్లా, ఆర్మీనియన్ రిపబ్లిక్ యువజన, పిల్లల పత్రికల సంపాదక వర్గాల్లో పని చేశాడు.

పేత్రొస్యాన్ మొదటి పుస్తకం "మానవ గేయం" 1957లో వెలువడింది. మరో రెండేళ్ల తర్వాత ఆయన కథానికా సంపుటి "చివరి రాత్రి" ప్రచురింపబడింది. తదాదిగా ఆయన పలు కథానికా సంపుటాలూ, "నేను పెద్దదాన్నయానే అమ్మా" అన్న చిన్న నవలా ప్రచురించాడు.

గుడ్ మార్నింగ్ జాక్!

మేం మూడో అంతస్తులో ఉంటున్నాం. నా గది కిటికీ వీధికి ఎదురుగా ఉంది. అలా ఉండటం ఒక విధంగా మంచిదీ, మరో విధంగా చెడ్డదీ కూడాను. క్రింద నుంచి నా స్నేహితులు ఏ వేళప్పుడు పిలిచినా నాకు వినిపిస్తుంది, అందుకని అది మంచిది. అది ఒక విధంగా చెడ్డది, ఎందుకంటే... అది చెడ్డదనడానికి సవాలక్ష కారణాలున్నాయి. అన్నింట్లోనూ ప్రధానమైన దేమిటంటే ఉదయం పూట ఆదమరచి నిద్రపోవడానికి వీలుండదు. నాకు తరచుగా తొమ్మిది గంటలకి, ఒక్కొక్కమారు ఎనిమిది గంటలకే నిద్రాభంగ మవుతూ వుంటుంది. నేను ఎనిమిది గంటలకి లేచినా, చూసుకో యిక, ఆ రోజున మా నాన్న కంటి ఎదుట పడకుండా తప్పించుకోలేను. అలాంటప్పుడల్లా మా యిద్దరి మధ్యా సాధారణంగా సంభాషణ యిలా సాగుతుంది:

"గుడ్ మార్నింగ్ డాడీ."

"ఏమిట్రోయ్ యింత పెందరాళే లేచిపోయావు. ఒంట్లో బాగా లేదా యేం?"

"బాగానే వుంది."

"ఈ వేళ కార్యక్రమం ఏమిటి?"

"రేపేమిటో ఈ వేళా అదే."

"ఏమిటో అది?"

"విన్ననేమిటో అదే."

"ఇప్పటికైనా పనికొచ్చే పనేదైనా చెయ్యాల నిపించటం లేదేంరా నీకు?"

"ఉన్న జీవితమే లెక్క అంత. ఈ కాస్తలో ఆలోచనకి తీరికెక్కడ?"

"ఏటి పొడుగునా ప్రతి రోజూ యిదే పాచిమాట వినడం విసుగెత్తి పోతోంది."

"ప్రతి రోజూ ఎనిమిది గంటలకి లేవాలని నేననుకోవడం లేదు. దిక్కుమాలిన టాంగో నాట్య సంగీతం నెలకి రెండు సార్లు మాత్రమే వినడం సాధ్యం."

"అంతేలే నీ ప్రయోజకత్వం, మూర్ఖపు జోకులు విసరడంలో మాత్రం మొనగాడివి."

"అక్కడకి, నీలా ఫాక్టరీలో కాలం గడపడం మహాపెద్ద ఘన కార్యమైనట్టు."

"నోర్ముయ్!"

సర్వ సామాన్యంగా అదిగో ఆ "నోర్ముయ్!" అన్న ఘట్టం దగ్గర "శాబిక్ వచ్చాడు అర్యూష" అంటూ అమ్మ రంగప్రవేశం చేస్తుంది.

శాబిక్ మా నాన్న డ్రైవరు. అంటే అర్థం కారు వచ్చిందనీ, మా సంభాషణ అంతటితో ముగిసిందనీను. మా సంభాషణ నేను నోరు ముయ్యాల్సిన ఘట్టానికి చేరుకున్నాక సామాన్యంగా మా నాన్నకిక సంభాషణ కొనసాగించే వ్యవధి లేకపోవడమన్నది నా అదృష్టమనే చెప్పుకోవాలి. మా అమ్మని గురించి మరోసారి చెప్పుకుందాం. ముందు, ఆ పిల్ల సంగతి చెప్తాను.

అది ఎప్పటి మాదిరి సాదా ఉదయమే. అమ్మ నాకు అప్పుడే కాఫీ తెచ్చి యిచ్చింది, నేను మంచం మీదనుంచి లేవబోతున్నాను, అంతలో ఓ రాకాసి టవర్ క్రేను సరిగా నా గది కిటికీ ముందు ఆగింది. వీధికి అవతలి పక్క ఓ యింటి నిర్మాణం జరుగుతోంది. అక్కడ పనిచేస్తున్న క్రేన్లలో యిదొకటి. కాని అది మరీ యింత దగ్గరగా రావడం యిదే మొదటి సారి. కిటికీ బార్లా తెరిచి వుంది. క్రేన్ పక్కకి జరిగి, కనుమరుగవుతుందనుకున్నాను, కాని అది అక్కడే తిష్ఠవేసింది. దాని పొడుగు చెయ్యి క్రిందకి ఒంగుతూ లేస్తూ వుంది. దాన్ని చూడటానికి విసుగెత్తి కిటికీ తెరలు మూసేశాను. సరిగా సినిమాలోనూ అంతే. వార్తా చిత్రాల్లో ఫాక్టరీలున్న దృశ్యాలు కనిపిస్తే చాలు, నేను కళ్లు మూసేసుకుంటాను.

అలాంటిది, ఆ క్రేన్ మరునాటి ఉదయం కూడా అక్కడే ఉంది. ఇదో పెద్ద బెడద అయిపోయిందే అనుకున్నాను! అలవాటు ప్రకారం, లేద్దామా, యింకా పడుకుందామా అన్న విషయం తేల్చుకోలేకుండా వున్నాను. ఒంటి గంటకు పోయి నా స్నేహితుల్ని కలుసుకోవాలి. మరి అంత దాకా ఏం చెయ్యాలి? నేనిలా ఆలోచిస్తుంటే ఆ క్రేన్ గెడికొంగలాగ మళ్లీమళ్లీ పైకి లేచి కిందకి వంగుతోంది, కుడికీ ఎడమకీ ఇరువ తిరుగుతోంది. మహావిసుగ్గా వుంది. కిటికీ మూసేద్దామని లేచాను, యథాలాపంగా డ్రైవరు కూర్చునే క్రేన్ గూడు తొట్టెలోకి చూశాను. క్రేన్ ఆపరేటరు ఒక అమ్మాయి. అవును, అమ్మాయే. ఆమె సూటిగా నా కేసే చూస్తోంది. నేను అర్ధ

నగ్నంగా వున్నానేమో ఒక్క ఉదుటున పోయి పక్కలో దూరాను. బహుశా నేను వినోద కరంగా కనిపించానో ఏమో ఆమె యికిలించింది. పిల్లకి ఎంత పొగరు!

మా అమ్మని పిలిచాను. ఆమె వచ్చి తెరలు లాగింది. అప్పుడు నేను లేచి దుస్తు లేసుకున్నాను. ఉదయమంతా అలా తగులడిపోయింది.

మూడో రోజు ఉదయం కూడా క్రేన్ అక్కడే వుంది. ఆ అమ్మాయే మళ్లీ తయారైంది. నేను కిటికీ తెరిచాను, చెయ్యి ఊపి ఆమెను పలకరిద్దామని నిశ్చయించు కుని పలకరించాను. బదులుగా ఆమె కూడా చెయ్యి ఊపింది. అదిగో సరిగా అప్పుడే గమనించాను, పిల్ల మాంచి అందగత్తె అని. అరే! యీ విషయం నేనింతకు ముందే ఎందుకు గమనించలేదబ్బా?

"ఏయ్! ఆకాశం మీదనుంచి కిందకి దిగిరా!" అని అరిచాను.

ఆ పిల్ల గాజుతొట్టె లోంచి ముఖం పైకి పెట్టి, "నేను ఆకాశం నుంచి సాయంత్రం అయిదు గంటలకి దిగి వస్తాను" అంది.

సరిగా అయిదు గంటలకల్లా నేను పేవ్‌మెంటు మీద నిలబడ్డాను. ఆమె అయిదు గంటల పది నిమిషాల కల్లా అక్కడి కొచ్చింది. ఆమె దుస్తులు మార్చుకుని వచ్చిందేమో నేనామెను ముందు గుర్తుపట్టలేకపోయాను. ఇప్పుడామె మరింత అందంగా వుంది.

"నా పేరు మేరీ" అందామె.

"నా పేరు జాక్." నేనామెకి నా అసలు పేరు చెప్పలేదు. అది నాకో నియమం. ఏ పిల్లకీ నేను నా అసలు పేరెన్నడూ చెప్పను. అలాంటప్పుడు ఒక పెద్ద సమస్య ఎదు రవుతుంది. ఏ అమ్మాయితో ఏ పేరుతో వ్యవహరించానో గుర్తుపెట్టుకోవాల్సి వుంటుంది.

ఆమె నా వంక చూసి నవ్వి, "ఏమిటి సంగతి?" అంది.

సినిమాకి పోదామని సూచించాను.

"నేనీ రోజు రాలేను. నాకు తీరిక లేదు."

"ఎవరికైనా ఈ రోజు కలుసుకుంటానని మాటిచ్చావా?"

"కావచ్చు."

"పోనీ, రేపు వెళ్దామా?"

"రేపైతే సరే."

కాని, మరి కొన్ని గంటల తర్వాత ఆ రోజే మేము మళ్లీ కలుసుకున్నాం. సినిమా హాలు బయట నేను నా నేస్తాలతో కలిసి నిలబడివుండగా అకస్మాత్తుగా ఆమె కనిపిం చింది.

"మేరీ?"

"హల్లో జాక్!"

నా మిత్రులు వెకిలిగా నవ్వారు. "దీనితో యిరవై ఆరు" అన్నాడు ఆర్నేవ్.

"జాక్" అన్నది నా యిరవై ఆరవ మారుపేరని వాడి ఉద్దేశం. సరే దాని దేముంది. ముందు మేరీ సంగతి చూడాలి. ఆమె సగం ముందుకి తిరిగి, నా రాక కోసం ఎదురుచూస్తోంది.

"ఎక్కణ్నుంచి రాక?" అని అడిగాను.

"నువ్వున్న చోటు నుంచే."

"ఏమిటా పుస్తకం?"

"ఆర్చ్ ఆఫ్ ట్రయంఫ్."

"ఓ అదా?" రెమార్క్ రచనలు నేను ఏ కొద్దిగానో చదివాను. కాని, క్రేన్ ఆపరేటరైన ఒక అమ్మాయి వాటిని చదివివుంటుందనీ, సాహిత్యం పట్ల ఆసక్తి కలిగి వుంటుందనీ మాత్రం నేను ఊహించలేకపోయాను.

"దాన్ని విమర్శించే ఉద్దేశంతో చదువుతున్నావు, ఔనా? రెమార్క్ పుస్తకాలు చదవడం ఒక ఫేషనైపోయిందీ మధ్య" అన్నాను. ఇవి నా సొంత మాటలు కావు. రెమార్క్ రాసిన పుస్తకమొకటి నాకు చదవడానికిస్తూ హెన్రీ అన్న మాటలివి.

"ఆయన రాసే పద్ధతి నాకు నచ్చుతుంది."

"నీకు నేను నచ్చుతానా?"

ఆమె యిదేదో జోక్ అనుకుంది.

"నువ్వు స్టూడెంటువా జాక్?"

కాదని నేనెందుకు చెప్పానో నాకే తెలియదు.

"నీకేమైనా ఉద్యోగమా?"

"ఊఁ."

"బహుశా నువ్వు రాత్రి షిఫ్టులో పని చేస్తున్నావేమో కదూ. అందుకే ప్రొద్దుట అంత ఆలస్యంగా లేస్తావు ఔనా?"

భలే ఆలోచన. రాత్రి షిఫ్టు అని చెప్తే బెడద తీరిపోతుంద నుకున్నాను.

"షిఫ్టుకెళ్లేందుకు ముందు కొంచెం చల్లగాలి పీల్చుకుందామని బయటికొచ్చాను" అన్నాను.

"మంచి అలవాటు." ఆమె నా వంక చూసే చూపులో మార్పు రావడం గమనించాను. నేనామె చేతిని నా చేతిలోకి తీసుకున్నాను. ఆమె అభ్యంతరం చెప్పలేదు.

"రేపు నాతో సినిమా కొస్తావా?"

"అలాగే."

నా కింక సంభాషణ కొనసాగించా లనిపించలేదు. తలపైకెత్తి నక్షత్రాల వంక చూశాను. కేవలం కవితలో కీర్తింపబడటానికే నక్షత్రాలు అక్కడ లేవనుకుంటాను. ఆదికవి అవతరించడానికి ముందే నక్షత్రాలు ఈ నభోవీధిలో వున్నాయి. ఒకవేళ, కర్మకాలి, ఈ భూలోకంలో ఒక్కగా నొక్క కవి కూడా మిగలకుండా పోయినప్పుడు కూడా నక్షత్రాలుండనే ఉంటాయి. మనం కలిసి వుండే అమ్మాయితో ఆడబోయే తుదివరి అబద్ధం కల్పించడంలో మనకి తోడ్పడటానికే నక్షత్రాలు బహుశా ఆకాశంలో ఉన్నాయేమో. నేనలా ఆలోచిస్తూంటే సరిగా అప్పుడే మేరీ అంది, "నన్ను యింటి దగ్గర దిగబెట్టా లనుకుంటున్నావేమో కదూ. మా యిల్లు చాలా దూరం."

నేనేమీ బదులు చెప్పలేదు. అయినా నేను చెయ్యగలిగిందేముంది? మరి నేను "వవి"లోకి వెళ్తాను కదా? నేను నా కల్పిత ఉద్యోగాని కెళ్ళాను, ఆమె తన యింటి కేసి వెళ్ళే బస్సెక్కింది.

నా నేస్తాలింకా సినిమా హాలు చుట్టూ తచ్చాడుతూనే వున్నారు.

"ఎంత వరకొచ్చిందిరోయ్ వ్యవహారం?"

"నీకెక్కడ దొరికిందిరా యీ కొత్త పిట్ట?"

"ఈ పిల్ల కాళ్ళు చూశార్రా, బలే అందంగా ఉన్నాయి కదూ?"

"బహుశా యీ పిల్ల మెడికల్ స్టూడెంటేమోరా."

ఆమె ఎవరో నేను వాళ్ళకి చెప్పాను. ముందు, నేను చెప్పిన మాట వాళ్ళెవళ్లూ నమ్మలేదు. అయితే తర్వాత వాళ్ళు పగలబడి నవ్వనారంభించారు.

"ఆ కాళ్ళన్నాయ్ చూడు, వాటికీ ఆ టవర్ క్రేనుకీ లంగరెక్కడరా నాన్నా!" అన్నాడు ఆర్మేన్.

"రండ్రా, పోదామింక" అన్నాడు టామ్.

అబోవ్యాన్ వీధిలో నడుస్తున్నాం. నేను రెండేళ్ల క్రితం సెకండరీ స్కూలు చదువు పూర్తిచేశాను. గత రెండేళ్లలోనూ నేనీ వీధిలో కనీసం ఒక వెయ్యి సార్లయినా అటూ యిటూ నడిచి వుంటాను. ఇదో పెద్ద వినోదం కానిమాట నిజమే, కాని యింతకన్న గత్యంతరమేముంది కనక. సరదాగా కాస్త పానీయం సేవించి డాన్సు చెయ్యా లంటే పట్నం మొత్తం మీద శుభ్రంగా వుండే ఒక్కగా నొక్క జాగా కూడా లేదు. అప్పటికీ ఒకసారి ఒకళ్ల యింటి దగ్గర, తర్వాత మరొకళ్ల యింటి దగ్గర తరచుగా రాత్రిళ్ళు పార్టీలు జరుపుకుంటూనే ఉంటామనుకోండి. అలాగని ప్రతి రోజూ పార్టీలు

జరుపుకోలేం కదా. అందుకనే, వీధి వెంట అలా కాళ్లీడ్చుకుంటూ పోతున్నాం. దానికి తోడు, నా బూట్లు కొంచెం బిగువైనట్లుగా కూడా వున్నాయి. వీధులు జనంతో క్రిక్కిరిసి వున్నాయి. నేను గుంపు కేసి చూశాను, కాని ఎవ్వరూ నాకు కనిపించలేదు. కనీసం, నాకు సంబంధించినంత వరకైనా. అక్కడ మరెవరూ లేరనిపించింది. జనం అంటే నాకింతకు ముందు యిష్టంగా ఉండేది. కాని, యిప్పుడు నాలో మార్పు వచ్చింది. వాళ్లల్లో ఎక్కువ భాగం అనవసరమనిపిస్తోంది. వీళ్లే కనక లేకపోతే, సినిమాలకి టికెట్లు తేలిగ్గా దొరుకుతాయి, బస్సుల్లో యింత తొడతొక్కిడి వుండదు. వీటికి తోడు, నేనే ఉద్యోగమూ, ఏ పనికొచ్చే పనీ ఎందుకు చెయ్యడం లేదని అనవసరమైన ఆరాలు తీసే మనుషులు తగ్గుతారు.

నా నేస్తాలు దేన్ని గురించి ఏం మాట్లాడుతున్నారో నేను వినడంలేదు. వాళ్ళ ఏం మాట్లాడతారో, అబోవ్యాన్ వీధి పేవ్‌మెంట్లు తెలిసినంత క్షుణ్ణంగా నాకు తెలుసు. కాని, యింక చేసేందుకు మాత్రం ఏముంది కనక? పోనీ ఆ టవర్ క్రేనైనా యింతకన్న ఆసక్తికరంగా ఏమీ కనిపించలేదు. ప్రతిదీ పరమ అనుత్సాహకరంగా వుంది. నక్షత్రాల వంక చూడటమే యింతకన్న ఎక్కువ ఆసక్తికరంగా ఉంది.

"నేనో కొత్త రికార్డు కొన్నాను. మా యింటికి పోయి విందాం పదండ్రా" అన్నాడు టామ్.

పోలోమంటూ మేమందరం వాళ్లింటికి పోయాం. ఇంకా అర్ధరాత్రయినా కాక ముందే, చాలా నాటాల కిటికీలు అంధకారావృతమై వున్నాయి. టామ్ తన రికార్డు ప్లేయరు పెట్టాడు. అక్కడి మంచి నక్షత్రాలు కనిపించవు, అందుకని, నేను సంగీతమే వింటున్నాను. పాట బాగుంది. ఏమిటబ్బా అది? ఎవరో తలుపు తడుతున్నట్టుంది. తలుపు తీసేందుకని టామ్ వెళ్లాడు.

ఒక స్వరం చెప్తోంది, "కింద అంతస్తులో పిల్లకి జబ్బుగా వుంది. దయచేసి కాస్త రేపటి దాకా సంగీతం ఆపు చేస్తారా?"

"రేపటి దాకా." పిల్లకిదో పెద్ద జబ్బు. ప్రతిదీ రేపటి దాకా వాయిదా వేస్తూ వుంటారు. పోనీ ఆ పిల్లే రేపు జబ్బు పడకూడదూ?"

నేను యింటికి బయల్దేరాను.

ఆ మరునటి రోజు సాయంత్రం నేను మేరీని కలుసుకున్నప్పుడు, "నీకెప్పుడైనా విసుగ్గా వుంటుందా?" అన్నదే నేను వేసిన మొదటి ప్రశ్న. ఆమె నా కేసి విచిత్రంగా చూసింది. "ఎప్పుడేనా" అంది.

"అప్పుడు నువ్వేం చేస్తావ్?"

"ఉదాహరణకి, యిప్పుడే వుందనుకో, ఏ సినిమాకో పోతాను." ఆమె నా కేసి మళ్లీ పరీక్షగా చూసింది. "నిజానికి, ఒకటేమిటి, నవాలక్ష పనులు చెయ్యొచ్చు" అంది.

నా కళ్లు ఆకాశంలోకి చూస్తున్నాయి. కాని అప్పటికింకా ఏడు గంటలే అయిందేమో, నక్షత్రాలింకా కానరావడం లేదు. మేము సినిమా కెళ్లాం. మొదట్లో, నేను తెర కేసి చూడలేదు. లైట్లు ఆరిపోగానే నేను మేరీని పరిశీలనగా చూడాలనుకున్నాను. చీకట్లో నేనామె చేతి కోసం తడిమాను. అది చల్లగా వుంది.

"నీకు చలిగా వుందా?" అని లోగొంతులో అడిగాను.

"లేదు" అందామె, కాని తన చేతిని వెనక్కి తీసుకోలేదు.

"నేనీమెని ఆర్మెన్ యింటికి తీసుకెళ్లాలి" అని నిశ్చయించుకున్నాను. "ఆర్మెన్ యీ రాత్రి యింటి దగ్గర ఒక్కడే వున్నాడు."

"అబ్బ నీ చెయ్యి చాలా వెచ్చగా ఉంది" అంటూ మేరీ తన చేతిని వెనక్కి తీసుకుంది.

అప్పటికి నా కళ్లు చీకటికి అలవాటుపడ్డాయి. నేనామె వంక మళ్లీ చూశాను. "ఆహాఁ నేనీమెని ఆర్మెన్ యింటికి తప్పక తీసుకెళ్లాల్సిందే."

"నీ చెయ్యి తీసేసి, తెర కేసి చూడు" అంది మేరీ. నేనామె ఆజ్ఞని పాటించక తప్పలేదు.

నా అనుభవంలో, చిన్నచిన్న విషయాల్లో అమ్మాయి మాటని మనం పాటించాలి, అలా చేస్తే, తర్వాత ఆమె మన మాటకి లొంగుతుంది.

సినిమా హాల్లోంచి బయటకి వచ్చేటప్పుడు సినిమాని గురించి ఎవళ్లూ చర్చించక పోవడం గమనించాను. "పరమ చెత్త సినిమా" అని మాత్రమే అంది మేరీ.

"మంచి హుషారైన నా మిత్ర బృందంతో నీకు పరిచయం చేస్తాను" అన్నాను మేరీతో. "మనమక్కడ రికార్డులు వినచ్చు. నీకక్కడ విసుగెత్తదు."

"నాకు విసుగెత్తేందుకూ గిసుగెత్తేందుకూ తీరిక వుండదు. పైగా, నీకు పని కెళ్లేందుకు టైమైపోతుంది కూడా."

అన్నట్టు నిజమే, నా రాత్రిషిఫ్టు పదిన్నరకి ప్రారంభమవుతుందని నేనామెతో చెప్పాను కదా!

ఒక మిలీషియావాడు ఈల వేశాడు.

"మనం అడ్డదిడ్డంగా నడుస్తున్నాం" అంది మేరీ. "చూశావా? అతను మన కేసి చెయ్యి ఊపుతున్నాడు."

"ఓహో... మనమతను చెప్పినట్టు వినాలనుకుంటూ కదూ. అయినా ఎలా నడిస్తే మటుకు పెద్ద తేడా ఏ ముందిలే?"

* * *

"గుడ్ మార్నింగ్ జాక్. మీ షిఫ్టు పని ఎలా సాగింది?"

"ఓ, చక్కగా సాగింది. నేను కొంచెం అలిసిపోయానంతే" అన్నాను నా మంచం మీదనుంచే.

ఆమె నా వంక చెయ్యి ఊపి, కంట్రోల్సు కేసి తిరిగింది. క్రేన్ చెయ్యి మొత్తం ఓ గోడ గోడనే పైకెత్తుతోంది. దాని కేసి చూడటం మహా విసుగ్గా వుంది. క్రితం రాత్రి యింటికి చాలా ఆలస్యంగా వచ్చానేమో నేను నిజంగానే అలసిపోయాను. స్నేహితులూ, పైగా పాత, కొత్త అమ్మాయిలతో రాత్రి మాంచి హుషారుగా గడిచిపోయింది. మేమంతా తాగి, డాన్సు చేస్తూ, వాదించుకున్నాం. ముగ్గురు నలుగురు అమ్మాయిల్ని నేను ముద్దుపెట్టుకున్నాను, వాళ్లల్లో యిద్దరిని కలుసుకోవడానికి తేదీలు నిర్ణయించుకున్నాం. వాళ్లలో అల్లా అనే అమ్మాయి నిజంగానే అందగత్తె. ఆమెని ఈ పాయంత్రం ఆర్మేన్ యింటికి తీసుకెళ్తాను. ఎవళ్లో గాని "హాయిగా జీవించడమెలాగో తెలిసినవాళ్ల ఆరోగ్యం నిమిత్తం తాగుదాం" అని టోస్టు ప్రతిపాదించారు. అప్పుడు అల్లా, గౌనులోంచి తన రొమ్ములు నాకు కనిపించేలా నా పైకి వంగి, "అదే మన టోస్టు" అంది. నేను తాగాను, తర్వాత ఏ కారణం లేకుండానే, మేరీని గురించి ఆలోచించ నారంభించాను. ఆ టోస్టు ఆమెకి వర్తించదా? ఎలా జీవించాలో ఆమెకి తెలియదా? "ఇదే నిజమైన జీవితం" అంటోంది అల్లా. నా చెయ్యి ఒకటి ఆమెని చుట్టి వుంది, మరో చేతిలో పానపాత్ర వుంది, కాని చిత్ర మేమిటంటే, నా ఆలోచనలు మాత్రం మేరీ చుట్టూ తిరుగుతున్నాయి. మేరీ తన క్రేన్‌నే పట్టుకు వేలాడుతుందెందుకు? ఆమె కూడా యిలాంటి అసలైన బతుకు బతకకూడదూ? అరిటి బోదెల్లా నిగనిగలాడే అందమైన అలాంటి కాళ్లున్న అమ్మాయికి, అలా త్రిశంకు స్వర్గంలోలా వేలాడటం కన్న మరో మంచి పనేమీ దొరకదా? అల్లా రెమార్క్ "ఆర్చ్ ఆఫ్ ట్రయంఫ్" గురించి మాట్లాడుతోంది. "అందులో రావిక్ చూడు యీ ప్రపంచంలో వున్న అన్ని రకాల పానీయాలూ తాగుతూండే పద్ధతి నాకు బలేగా నచ్చింది. మనలాగ కాదు."

నేను యింటికి తిరిగి వచ్చేసరికి ఒళ్లెరగనంతగా తాగాను.

నాకింకా నిద్రపోవాలని వుంది, కాని మేరీ నా కేసి చెయ్యి ఊపుతోంది. నేనింక దుప్పటి లేసుకోవాలి.

నా కిప్పుడు మేరీ కనిపించడం లేదు, సగం పూర్తయిన యింటి కేసే చూస్తున్నాను. మేమీ యింట్లో ప్రవేశించేసరికి వీధికి అవతలి పక్క ఒక్క యిల్లు కూడా ఉండేది కాదు. అలాంటిది, ఇప్పుడు చూస్తే ఎన్ని యిళ్లు లేచిపోయాయో. మేరీ కదుతున్న

యింట్లోంచి మనుషుల మాటలూ, మత్తెం మోతలూ, లోహాల ఖణఖణ శబ్దాలూ విన వస్తున్నాయి. ఇంతకు ముందైతే యిదంతా నాకు చెడ్డ చిరాకుగా ఉండేది. కాని యిప్పుడు, వాళ్లు దేన్ని గురించి మాట్లాడుకుంటున్నారో వినాలనిపించింది నాకు. నేను శ్రద్ధగా వినసాగాను. చాలా మాటలూ, వాక్యాలూ వినవచ్చాయి....

సరిగా అప్పుడే అమ్మ "ఏరా, కాఫీ యిక్కడికి తెమ్మంటావా, భోజనాల బల్ల దగ్గర కొస్తావా?" అనడం వినవచ్చింది.

నేను భోజనాల గదిలోకే వెళ్లాను. చివరకి చూసుకుంటే అన్నీ విసుగనిపించే పనులే: కాఫీ తాగడం, యిళ్లు కట్టడం అన్నీను.

అప్పటికి ఒంటిగంట అయింది. నేనింకా నాలుగ్గంటలు గడపాలి. తిన్నగా సినిమా హాలు దగ్గరకి బయల్దేరాను. టామ్, వియూల్ లిద్దరూ అప్పటికే అక్కడున్నారు. హాలు బయటి రాతి స్తంభాలకి ఆనుకుని నిలబడ్డారు. ఆ రాతి స్తంభాలని ఎవరో ఒకరు కట్టకుండా ఉండి ఉంటే, వీళ్లు నేటికి ఆనుకొని నిలబడి ఉండేవాళ్లా అనుకొని ఆశ్చర్య పోయాను.

ప్రతిదీ విసుగే.

"హలో!" టామ్ బిగ్గరగా అన్నాడు.

"హలో!" నేను జవాబిచ్చాను.

వాళ్లు జరిగి నాకు చోటిచ్చారు. మేము దోవ వెంట వెళ్లే అందమైన అమ్మా యిల్ని చూడసాగాం. సహజంగానే, దోవ వెంట యితరులు కూడా వెళ్తున్నా, మేము వాళ్లని గమనించడమే లేదు. వాళ్ల సంగతి మేము మిలీషియాకీ, కవులకీ వదిలేశాం.

"ఒరే ఒరేయ్ చూడండ్రా ఆ జఘన సుందరిని" అన్నాడు వియూల్.

ఘనకరాతి స్తంభాలు వెచ్చగా హాయిగా వున్నాయి. టామ్ ఆవులించి "ఈ రాత్రి ఏమిట్రా కాలక్షేపం?" అన్నాడు.

మా వంక వస్తున్న ఒక అమ్మాయి కేసి చూపించి "దాని దేముందిరా" అన్నాడు వియూల్. "నాకీ రాత్రికి కాలక్షేపం దొరికింది."

"హలో అబ్బాయిలూ!"

"హలో!" అని జవాబిచ్చాం మేము.

వియూల్ చకచక వెళ్లిపోయాడు. మేము అక్కడే నిలబడి పోయాం. సాదాగా కనిపించే అమ్మాయిలతోను, మొత్తం మీద సాధారణ జనంతోను వీధులు నిండిపోయాయి. వాళ్లల్లో కొందరు సంతోషంగా, మరి కొందరు దిగులుగా ఉండటం నేను గమనించాను. ఒకతను తనలో తను గొణుక్కుంటున్నాడు. ఒకమ్మాయి ఏడుస్తోంది.

"దయచేసి దారి విడుస్తారా?"

నేను నా కాలొకదాన్ని తర్వాతి స్తంభానికి తన్నిపెట్టి నిలబడి, త్రోవ బందుచేశాను. అలా అడిగినది ఒక యువకుడు. సాదా దుస్తులు వేసుకున్నాడు. బహుశా అంతకు ముందు రోజు నుంచి గీసుకోలేదేమో గడ్డం మాసివుంది. అతని చంకలో ఓ పుస్తకం వుంది.

"క్షమించండి." నేనతని కేసి అలా గుడ్లప్పగించి ఎందుకు చూస్తున్నాను? నాకే తెలియదు. నేనతన్ని వెళ్ళనిచ్చాను. టామ్ వంకా, నా వంకా అదేదో విలక్షణంగా చూసిన మీదట అతను ముందుకెళ్ళాడు.

నా నల్లచొక్కాలో నాకు ఉడుకెత్తి పోతోంది. కాని నేనామాట అనే పరికి, పారిస్‌లో యిప్పుడదే తాజా ఫేషన్ తెలుసా, అన్నాడు టామ్. ఆ సంగతి నీకెలా తెలుసురా చిట్టివాన్నా అని నేను డెకారించే పరికి, వాడు నా ప్రశ్నని తప్పించి, తన దగ్గర కొన్ని కొత్త రికార్డులున్నాయనీ, ఎవర్ల దగ్గరో అరువు తెచ్చిన ఆ రికార్డులు తన దగ్గర ఒక్క రోజే వుంటాయనీ, తన యింటికొచ్చి మేమంతా వాటినెందుకు వినకూడదనీ అంటూ మాట మార్చాడు.

"పక్క వాటా వాళ్ళు నిద్ర పోయే వేళకి ముందే అనుకోండి" అంటూ వాడొక వెకిలినవ్వు నవ్వాడు.

పారిస్‌లోని తాజా ఫేషన్లు వీడికెలా తెలుసునబ్బా అంటూ నేను అబ్బురపోయాను. కాని ప్రశ్నని రెట్టించడానికి తగని బద్ధకం నాకు అడ్డం వచ్చింది. ప్రతిదీ ఎంత అను త్సాహకరంగా వుంది!

నేను మేరీని సాయంత్రం ఐదు గంటలకి కలుసుకున్నాను.

"నన్ను వెనక్కి సాగనంపుతావా? నువ్వెక్కడ పని చేస్తున్నదీ నాకింకా చెప్పనే లేదు" అందామె.

ఒక క్షణం పాటు దొరికిపోయానని కంగారు పడ్డాను. తర్వాత అప్రయత్నంగా "అదొక ప్రైవేట రహస్యంలే" అని బుకాయించాను.

"చెప్పాలని లేకపోతే చెప్పక్కర్లేదులే" అందామె.

వీధి వెంబడి ఓ తాగుబోతు వస్తున్నాడు. అతను ప్రతివాడినీ చూసి యికిలిస్తు న్నాడు. పగటి వెల్తురింకా పోకుండానే "వెన్నెలరేయీ, ఎంతో హాయీ" అంటూ పాట పాడుతున్నాడు. నేనతన్ని జాగ్రత్తగా పరిశీలించాను. అతన్ని చూస్తూంటే విందులో రెమార్క్‌ని గురించి మాట్లాడిన అమ్మాయి నాకు జ్ఞాపకమొచ్చింది.

"పాపం బడుద్దాయి, వీడింతాచేసి మహా అయితే ఓడ్కా తాగి వుంటాడు" అన్నాను. "రెమార్క్ పుస్తకాల్లోని పాత్రలు తాగినట్లు రకరకాల పానీయాలు సేవించి వుండడు."

మేరీ నా కేసి విచిత్రంగా చూసింది. "రెమార్క్ రచన అంటే పానీయాల, తినుబండారాల జాబితా కాదు. వాళ్లేం తాగుతారో నాకైతే తెలియదు గాని, రావిక్ పాత్ర అంటే మటుకు నాకు చాలా యిష్టం" అని ఆమె బహుశా మాటలు అయిపోయాయేమోనన్నట్లు ఆకస్మికంగా మౌనం వహించింది.

వేసవి సాయంత్రంపూట చీకట్లు క్రమంగా ముసురుతున్నాయి. మేము సినిమా హాలు సమీపిస్తున్నాం. ఎప్పటిలాగే నా సావాసగాళ్ళు: వియూల్, ఆర్మేన్, టామ్‌లు అక్కడున్నారు.

"ఏరోయ్, హలో" అన్నాడు టామ్.

వాళ్ళకి ప్రత్యభివాదం చేసేటప్పుడు నా చెయ్యి పైకి లేవనే లేదనిపించింది. మామూలు కన్న అది భారంగా ఉన్నట్లనిపించింది.

"నీకు వాళ్ళు తెలుసా?" అని అడిగింది మేరీ.

"ఆహా. అయితే ఏమిటిట?"

మేరీ నా వంక చూస్తోంది. నేనేమో అనంతంగా బూట్ల మడమలచే నునుపు చేయబడుతున్న పేవ్‌మెంటు కేసి చూస్తున్నాను.

"వీళ్లిక్కడ నిలబడి రోజుకి ఎన్ని గంటలు గడుపుతారు?"

మేరీ ప్రశ్న, ప్రప్రథమంగా, ప్రధానంగా నాకే వర్తిస్తుందన్న సంగతి గుర్తించి, నేను కటువుగా "ఒక్కొక్క సారి రోజంతాను" అని జవాబిచ్చాను.

ఆమె కూడా అదే స్వరంలో "బలే వ్యావృత్తి" అంది. "వాళ్ల రాపిడికి యీ పాటికి స్తంభాలకి గుంటలు పడిపోయి వుంటాయి."

నేను చేసిన గుంటని చూసే ప్రయత్నంలో నా కళ్లని అటు తిప్పుతూ, నా శాంతానికి నేనే విస్తుపోయాను.

తీవ్రమైన వైముఖ్యంతో ఆమె "వాళ్లేం చేస్తార్ట?" అని ప్రశ్నించింది.

"వాళ్ళు మనుషులు."

"అది వృత్తేమీ కాదు."

"ఏం, ఎందుక్కాదు? మక్సీమ్ గోర్కీ చెప్పలేదూ: మనిషిగా వుండటమే యీ ప్రపంచంలో మిక్కిలి గౌరవ భాజనమైన వృత్తి అని?"

మేరీ పకపక నవ్వింది. "ఆ పరాన్న జీవులకి మా మంచి వకాలతుదారుని దొరికావు."

నన్నింతవరకు పరాన్న జీవివని ఎవరూ పిలవలేదు. అయినా ఎందుకలా అనాలి? ప్రతి వాడూ పని చేసితీరాల్సిందేనంటూ శాసనమేమైనా ఉందా?

"వాళ్ళు పరాన్న జీవులని నువ్వెందు కనుకుంటున్నావ్"? అని సాధ్యమైనంత

తాపీగా, ప్రశాంతంగా ప్రశ్నించాను, నా ఉలుకు బయట పడనీకుండా. నీతులూ, ధర్మ పన్నాలూ వల్లించే వాళ్లంటే నాకు గిట్టదు. వాళ్ళు ఎవళ్లనీ ఎప్పుడూ వాళ్లమానాన వాళ్లని ప్రశాంతంగా బతకనివ్వరు.

"నువ్వే చెప్పు. వాళ్లకి నువ్వేమైనా తీసిపోయావా? నువ్విప్పుడు పోయి, రాత్రంతా పని చెయ్యాలి, కావా?"

నేను వాళ్లకేమైనా తీసిపోయావా? ఎంత మాత్రం తీసిపోలేదు. అందుకనేగా నేమా వాళ్ళ చేస్తున్నట్లు చేస్తున్నది. కాని మేరీ, నువ్వో, నువ్వు హడావిడిగా యింటికి పోయి, పెందరాళే నిద్ర పోవాలి. ఎందుకని? మళ్లీ ఉదయమే ఆలస్యం కాకుండా పనికి వెళ్లాలి కనుక ఆరు గంటలకే లేవాలి. అసలైన జీవితానికి లేటు అవుతున్నావన్న సంగతే నువ్వు ఆగి, ఆలోచించుకోవడం లేదు. ఏదో ఒక శుభోదయాన లేచి నీ జీవితమనే గడియారంలో రాత్రి పదకొండు గంటలైందన్న సంగతి గుర్తిస్తావు. అప్పడిక నీ జీవితంలో ఒకే ఒక్క గంట మిగిలి వుంటుంది నీకు, అనుకున్నాను, మనసులో. కాని నేనామెకు ఏదో ఒక జవాబివ్వాలి కదా. ఏం చెప్పాలబ్బా?

"నీ పని తేలిగ్గా సాగుతోందా?" అని అడిగాను.

"తేలిగ్గా లేదు."

తన పని తేలిగ్గా వుంటుందనీ, ఒక ఆటలా వుంటుందనీ ఆమె చెప్పాలని వేచా శించాను. అందుకు భిన్నంగా ఎందుకు చెప్పిందీమె?

"నువ్వు కాలేజి చదువుకెందుకని వెళ్లలేదు?"

"నేను ప్రవేశ పరీక్షలు ప్యాస్ కాలేదు. రెండు రోజుల క్రితమే నేను మూడో సారి పరీక్షలకి కూర్చున్నాను."

"మరింకేమిటి?"

* * *

గత మూడు రోజులుగా నేను కిటికీలు తెరవలేదు. మరింత ఎక్కువ సేపు నిద్రలో గడిపేందుకు ప్రయత్నిస్తున్నాను, నిద్రపోతే ఏవేవో లేనిపోని ఆలోచనలు తప్పతాయన్న ఆశతో. ప్రతి వాడూ ఎందుకు పని చెయ్యాలి? అందరూ ఒక్క సారి అకస్మాత్తుగా పని నిలిపేస్తే ఏమవుతుంది? కాని యీ విధమైన ఆలోచనంతా బలే వినుగు. ఇలాంటి ప్రశ్నలు తాత్వికచింతనకి దారితీస్తాయి. వీటితో బుర్ర బద్దలు కొట్టు కోవడానికి బదులు మిలమిల మెరిసే ఎర్రని వైను కాస్త పుచ్చుకుంటే హాయిగా ఉంటుంద నిపిం చింది.

నేను బయటకెళ్లాను. బయట వేడిగా వుంది. నేను మధ్య మధ్య వీధికి అటు పక్కకి తిరిగి ఎందుకు చూస్తున్నట్టు? మేరీ కోసం చూస్తున్నానా అనుకొని అప్రయత్న పూర్వకంగా నవ్వుకున్నాను. ఇంత పెద్ద ఇనుప రాక్షసి ఆమెకి అంతటి విధేయురాలైన బానిస కావడాన్ని ఊహించుకుంటూ వుంటే చిత్రంగానే వుంది. బహుశా మేరీ పుస్తకాలు ఆ పై తొట్టెలో వున్నాయేమో. అంత ఎత్తు నుంచి నేనెన్నడూ యీ పట్నాన్ని చూడ లేదు. మా మూడో అంతస్తు కిటికీ నుంచి కనిపించే దల్లా వీధికి అవతలి ప్రక్క మాత్రమే. ఈ మధ్య తరచుగా అదంతా మట్టికుప్పలతో నిండివుంటోంది.... నేనో రెస్టారెంటులో దూరాను. ఈ వేళప్పుడు సాధారణంగా వెయిటర్లంతా ఖాళీగా వుంటారు, తమ మధ్యాహ్న భోజనాలు చేస్తూవుంటారు. ఒక్క పోత మాత్రమే ఏకైక కాతాదా రులా కనిపించింది. నన్ను చూసి వెయిటర్లు ముసిముసి నవ్వులు నవ్వారు. నేనొక సీట్లో కూర్చున్నాను. కిటికీ లోంచి పాదచారులు రోడ్డు దాటే చోటు కనిపిస్తోంది. ఒక అమ్మాయి యెవరో పువ్వులమ్ముతోంది.

* * *

మేరీ రికార్డు ప్లేయరు పెట్టింది.

ఎందుకో చెప్పలేను గాని, నేనా సాయంత్రం సరిగా ఐదు గంటలకే మా యింటి బయటకెళ్లాను. మేరీ నా కోసం ఎదురుచూస్తోంది. నేనామెతో మా ఫాక్టరీకి కొత్త ఆర్డరేదో వచ్చిందనీ, గడిచిన మూడు రోజుల్లో నాకు బొత్తిగా విరామమే చిక్కలేదనీ, కాని యీ రాత్రి నాకు ఖాళీయేననీ చెప్పాను.

నేనిప్పుడు మేరీ యింటి దగ్గరున్నాను.

ఆమె తల్లి పక్క గదిలో వుంది. స్టూడెంటు అయిన ఆమె సోదరుడు ఫీల్డు వర్కు నుంచి వచ్చేవారం తిరిగివస్తాడు. ఈ విషయాలన్నీ నాకెందుకని ఆసక్తి కొలుపు తున్నాయా అని అబ్బురపడ్డాను. ఎవరో గాని ఫిడేలు పైన మధురమైన అపరిచిత రాగమేదో వాయిస్తున్నారు.

"ఫిడేలు వాయిద్యం నీకిష్టమేనా?"

"ఊహుఁ."

మేరీ బుంగమూతి పెట్టింది.

"సరేలే, నాకిష్టమే." ఆమె మళ్లీ ఎక్కడ బోధన ప్రారంభిస్తుందోనని నేను భయపడ్డాను. స్వరలహరి కొనసాగింది. నా గుండె అకస్మాత్తుగా గతుక్కుమంది. కాని అంతలోనే పాట ముగిసింది. మేరీ వేరే రికార్డు పెట్టింది.

"నీకు డాన్సు చెయ్యాలని వుందా?"

నాకు ఆవలింతలు రాబోతున్నాయి. అంతలో గదిలోని వాతావరణం అకస్మికంగా హుషారుగా తయారైంది. చిత్రం, టామ్ దగ్గరున్న దక్షిణ అమెరికన్ టాంగో డాన్సు గీతమే అది. మేరీకీ టామ్‌కీ ఒకే రకం యిష్టాలుండటం విచిత్రంగా లేదూ? సాక్సోఫోన్ ధ్వనికి అనుగుణంగా మేరీ తన పాదాలు నేలకి తాటిస్తోంది. ఆమె సన్నగా నవ్వుతోంది.

"రా, డాన్సు చేద్దాం" అన్నాను. "నీకిది, అదే, యీ సంగీతం, యిష్టమేనా?"

"ఆ."

"మరి ఫిడేలు సంగతేమిటి?"

"నాకు ఫిడేలూ యిష్టమే."

"టామ్ నిజంగానే ఆశ్చర్యపోతాడు."

"టామ్ ఎవరు?!"

"టామా?" నేను చెప్పబోయిన దేమిటో మరచిపోయాను. "ఓ, టామా? నాకు తెలిసిన కుర్రాడు. అతనేమంటాడంటే...."

మేం ముద్దుపెట్టుకున్నాం. అదెలా సంభవించిందో నాకు తెలియదు. ప్రయత్నించినా కూడా జ్ఞాపకం చేసుకోలేకపోతున్నాను. నేనింతకు ముందెన్నడూ మరే అమ్మాయినీ ముద్దే పెట్టుకోలేదేమో అనిపించింది. రికార్డు గిరుగిరున తిరుగుతోంది. కాని, నాకు మృదుమధురమైన లలిత మన్నితమైన ఫిడేలువాద్యం మరోసారి వింటే బాగుండు ననిపించింది.

"అమ్మ అక్కడుంది...." అని లోగొంతులో చెప్పింది మేరీ.

నేనామెని మళ్లీ మళ్లీ ముద్దుపెట్టుకుంటూనే వున్నాను. నాకు ఒక్క గీతం కంఠతా రాదన్న ఆలోచన నా మనస్సులో మెరిసింది. వియూల్ ఒకమారు ప్రేమలో పడటం, మేమంతా వాడి బ్రతుకునొక నరకం చెయ్యడం నాకు గుర్తుకొచ్చింది. నేనెక్కడ పని చేస్తున్నానని మేరీ మళ్లీ అడగొచ్చునన్న ఆలోచన వచ్చేసరికి నా కాళ్లు చచ్చు పడ్డాయి. నేను కిటికీ దగ్గరకెళ్లి సిగరెట్టు ముట్టించాను.

"అమ్మ నిద్రపోయి వుంటుంది" అంది మేరీ.

హృదయాన్ని ఉర్రూతలూపే అదే సంగీతం కొనసాగింది. దాని తర్వాత అలాంటి పాటలే మరికొన్ని వినవచ్చాయి. కాని, నేను మాత్రం మళ్లీ డాన్సు చెయ్యలేకపోయాను. నేను పట్నం కేసే చూడసాగాను. ఇప్పుడది, ఏ కదలికా లేకపోయినా రికార్డులాగే గిరున తిరుగుతున్నట్లనిపించింది. "రేపేం చెయ్యబోతున్నావురా?" అని నాన్న నన్ను అడుగుతున్నట్లనిపించింది. "నిన్న చేసినదే" అని నేను మళ్లీ జవాబివ్వగలనని అనిపించలేదు.

"నీకు నిజంగా యిష్టమేనా...."

మేరీ సిగ్గుసిగ్గుగా చిరునవ్వు నవ్వింది. ఆమెకి అర్థం కాలేదు.

"ఈ సంగీతం?" అని నేను పూర్తి చేశాను.

"ఆ."

"ఇదేదో పరాన్న జీవుల సంగీత మంటారు కదా దీన్ని?"

"సంగీతానికి పరాన్న జీవితంతో బొత్తిగా సంబంధం లేదు."

నేను వీధివెంట నడుస్తున్నాను. అది అలా అనంతంగా సాగిపోతూ వుంటే బావుండు ననిపించింది. కాని ఆ వీధి అంత పొడవైనది కాదు. నేను బోలెడన్ని సంగతులు ఆలోచించుకోవాల్సి వుంది. కాని నా మనస్సులో మెదిలినవల్లా హుషారైన సంగీతం, ఫిడేలు రోదనం, "అమ్మ నిద్ర పోయినట్టుంది" అన్నప్పటి మేరీ కళ్ళు మాత్రమే. నా నేస్తాల నామె ఎంతటి అసహ్య భావంతో పరాన్న జీవులంది, నా ముద్దుల కామె ఎంతటి అనురాగంతో ప్రతిస్పందించింది. నేనెవరినో, ముందు నుంచీ నేను చేసిందేమిటో నేనామెకెందుకు చెప్పలేదు? నేనూ పరాన్న జీవినే. ఆ, యిరుగో నా మిత్రరత్నాలు.

"హలో, భాయ్!"

ఊఁ ఊఁ అనట్లు నేను తలూపాను.

"రారా."

నేనెక్కడి కెళ్ళానో ఏ ఒక్కడూ అడగలేదు. మేమెక్కడి కెళ్తున్నామన్న సంగతి కూడా ఎవరూ ఎత్తలేదు. ఆ నిమిషానికి మేమక్కడ వున్నాం. నడవాలి కనక నడుస్తున్నాం అంతే. సుపరిచితమైన ఆ వీధిలో మేము నడిచి వెళ్తున్నాం. అటూ యిటూ వచ్చేపోయే బాటసారులను నేను పరిశీలనగా చూస్తున్నాను. పని చెయ్యాలనుకోడం లేదు కనక, నేను వీళ్ళ కంటె పనికిమాలిన వాడినా? కాని పని అన్నది అంత ముఖ్యమా? మా నాన్న యుద్ధంలో ఎందుకు పోరాడినట్లు? రాత్రింబగళ్ళు ఫాక్టరీలోనే ఎందుకు కాలం గడుపుతున్నట్లు? మరి, "మీరిప్పటికే చాలా చేశారు. మీరిప్పుడిక నిజమైన జీవితం ఆరంభించండి" అని ఆయనతో ఎవరూ చెప్పరెందుకని?

"మేమంతా రేపు సమావేశమవుతున్నాం. నువ్వామెని నీతో తీసుకురా" అన్నాడు వియూల్.

"అదే, ఆ క్రేన్ ఆపరేటర్‌ని" అని జోడించాడు టామ్. నేను తలూపాను. ఎక్కడి నుంచి వచ్చిందో ఆ పిల్ల? ఆమె సమక్షంలో నేనెందుకలా సహజంగా ప్రవర్తించ లేకపోతున్నాను? గత కొద్ది రోజుల అనుభవాన్ని నా మనస్సు నుండి చెరిపేసుకోవడం యింత కష్టంగా ఉందేమిటి?

"రండి లోపలికి పోదాం" అన్నారొకరు. మేమంతా రెస్టారెంటులో దూరాం.

* * *

"గుడ్ మార్నింగ్ జాక్. నీ షిఫ్టు ఎలా సాగింది?"

ఆమె ఆకాశం మీంచి మాట్లాడటం లేదు. మేము రోడ్డు పక్క నిలబడి వున్నాం. నాకు అంత క్రితం రాత్రి నిద్ర బాగా పట్టలేదు. ఏడు గంటలకే యింటి బయట కెళ్ళాను. మేరీ అప్పటికే అక్కడుంది.

"ఏమిటింత పెందరాళే వచ్చావ్?"

"ఉక్కగా వుంది."

తర్వాత అందామె, "నీకు ఆకాశంలోకి రావాలని వుందా?"

ధైర్యం కూడదీసుకుని జోకు వేశాను.

"రాకెట్లలో పైకెళ్ళిన కుక్కలు బెల్కా, స్ట్రెల్కా ల్లాగానా?"

"అదేం కాదు. ఆరో అంతస్తు దాకా మాత్రమే. నాతో."

నేను అర్థం చేసుకున్నాను. అన్నట్లు, ఆకాశంలోంచి జీవితాన్ని చూస్తే బాగుం టుందేమో. ఏమో, అన్ని చోట్లా అనుత్సాహంగానే ఉంటోంది.

మేము నిర్మాణం జరుగుతున్న ఆవరణలో ప్రవేశించాం. జనం నాలుగు పక్క ల్నుంచి మేరీని ఆప్యాయంగా పలకరించారు.

ఎవరో గాని "నీతో వచ్చినతను కొత్త శిష్యుడా?" అని మేరీని ప్రశ్నించాడు. మేరీ నా వంక సగర్వంగా చూసింది.

"అబ్బే, ఆయనకే శిష్యులున్నారు. ఆయనెక్కడ పని చేస్తున్నారో తెలుసా?!"

అయితే, ఆ మాటలంటూ ఆమె విస్మయంగా చిరునవ్వు నవ్వింది, నేనెక్కడ పనిచేస్తున్నదీ తనకే తెలియదు కదా! మేరీ అతనెవరితోనో నాలుగు మాటలు మాట్లా డింది, దానితో నన్నామెతో బాటు క్రేన్ ఎక్కనిచ్చారు. నా కాళ్ళూ చేతులూ వాటంత టవే కదిలాయి. ఇదిగో ఆకాశం. అదిగో ఆ కింద నా జన్మస్థానమైన సొంత పట్టణం. నేనసలీ పట్టణాన్ని యింతకుముందెప్పుడూ చూడనేలేదేమో ననిపించింది. నాకు డజన్లకొద్దీ క్రేనులు కనిపించాయి. అవి తమ చేతుల్ని నా వంక ఊపుతున్నాయ నిపించింది. ఆ ప్రాంత మంతటా పైకి లేస్తున్న గృహాలవి. అరుగో జనం. మేరీ క్రేన్ కంట్రోల్సు దగ్గర కూర్చుంది.

"నేనింక కిందకి దిగిపోతాను. నువ్వు నీ పుస్తకా లెక్కడ పెడతావు?"

"కిందకెళ్ళి పోవాలని వుందా? ఇదిగో చూడు" అంటూ పుస్తకాలు చూపించింది. తర్వాత ఆమె ఖపగోడకి తను తగిలించిన చిన్న అద్దాన్ని చూపించింది. "ఇదే నా డ్రెస్సింగ్ టేబిలు. నువ్వు అలిసిపోయినట్టున్నావు."

నేనా అద్దంలో చూసుకుని నవ్వకుండా ఉండలేకపోయాను. మేరీ చెప్పింది, "నేనిప్పుడే అయిదు ఇళ్ళు కట్టాను.... అంటే, అదేలే, మేం కట్టాం" అని జోడించిందామె తొందరగా, అద్దం పలకలోంచి వీధి వంక చూస్తూ.

అయిదు ఇళ్ళు. నేనీ పట్టణంలో చేసినదల్లా యిక్కడ పుట్టడమే తప్ప, మరేం లేదు.

* * *

సినిమా హాలు బయట ఒక యువకుడు మా దగ్గర కొచ్చాడు.

"సారీ నెల్లాయ్, నేను రావడం కొంచెం ఆలస్యమైంది."

"ఇదుగో యితను మా అన్న" అని పరిచయం చేసింది మేరీ.

"జాక్ కదూ?" అతను నా వంక పరిశీలనగా చూసి, నాతో కరచాలనం చేసి, "మిమ్మల్ని గురించి మేరీ చెప్పింది" అన్నాడు.

"నా పేరు ఆర్వెన్." నేనా మాట అరిచి చెప్పానో మెల్లగా గొణిగానో నాకు తెలియదు. అందర్నీ, అన్నింటినీ నమ్మేసే ఈ యిద్దరూ పీలుస్తున్న గాలినే నేను కూడా పీల్చడం సాధ్యం కాదనిపించింది. మేరీ ముఖం వివర్ణమైనట్టు గ్రహించాను. ఆమె సోదరుడు నా చేతి నుంచి తన చేతిని వెనక్కి లాక్కున్నాడు, అది సరిగా టవర్ క్రేన్ హస్తం లాగే గాలిలో నిలబడిపోయింది.

"జాక్ అయినా, పెద్ద పేరేం కాదు" మర్యాద కోసమన్నట్టు అన్నాడతను. "జాక్ లండన్ నా అభిమాన రచయిత. మీకు ఆయన రచనలు యిష్టమేనా?"

ఏ రచయిత పుస్తకాలైనా తనకి నచ్చాయనో నచ్చలేదనో చెప్పగలగడానికి ఆ వ్యక్తి ఆ రచయిత పుస్తకాలు చదివి వుండటం అవసరం. కాని, నేను మాత్రం అవి చదవకపోయినా, నాకు యిష్టమేనని చెప్పాల్సిన పరిస్థితిలో పడ్డాను.

మేరీ యింకా తన విభ్రాంతి నుంచి తేరుకోలేదు. ఈ గొడవంతా దేన్ని గురించో అర్థంచేసుకోవాలని ఆమె ప్రయత్నిస్తోంది. అందుకని, వినిపించీ వినిపించని స్వరంలో "రండి లోపలకి పోదాం, ఆట మొదలెట్టేస్తారు" అంది.

"నన్ను క్షమించు నేనీ సినిమా యింతకు ముందే చూసేశాను. పైగా..."

మేరీ నా చేతిని స్పృశించి, "నీ షిఫ్టు కింకా చాలా టైముంటుంది కదా" అంది.

"నేనెక్కడా పని చెయ్యడం లేదు" అంటూ నేను దాదాపుగా అరిచి చెప్పాను. తర్వాత మరింత ప్రశాంతంగా "శెలవ్ మేరీ" అన్నాను.

నేను హడావిడిగా వచ్చే పోయే జనం రద్దీని తప్పించుకుంటూ నడవ సాగాను. నా నేస్తాలు రాతిస్తంభాలకు ఆనుకుని వుండటం చూశాను.

"హలో!" అంటూ టామ్ బిగ్గరగా పలకరించాడు.

"హలో!" అవి అరిచారు మిగతా వాళ్ళు.

కాని, వీధిలోని జన ప్రవాహం నన్ను ముందుకు తోసుకుపోయింది. ఇప్పుడు నాకు నా మిత్రులు కనిపించడం లేదు. మనుషులు చెక్కిన రాతి స్తంభాలు మాత్రమే కనిపిస్తున్నాయి. నేనీ పట్టణంలో చేసిన ఘనకార్యమల్లా యిక్కడ పుట్టడమే. నేను శిరమెత్తి పైకిచూశాను. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తూ కనిపించాయి. అవి అక్కడున్నది, వాటిని చూసి కవులు కవిత్వం రాయడం కోసం మాత్రమే కాదు. మనిషికి లోకంలో దేని మీదా యికనెంత మాత్రమూ విశ్వాసం మిగలనప్పుడు చూసేందు కోసం కూడా అవి ఆకాశంలో మెరుస్తూ ఉంటాయి. బహుశా తర్వాత జనం ముఖాల్లోకి చూడటం, అటు తర్వాత ఆత్మావలోకనం చేసుకోవడం సులభతర మవుతుందనుకుంటాను. తర్వాత బహుశా మనిషి తన ఆత్మాకాశంలో నక్షత్ర సందర్శనం చెయ్యగలుగుతాడ నుకుంటాను.

* * *

గత మూడు వారాలుగా నేను చాలా పెందరాళే లేస్తున్నాను. నాకు మా నాన్న ఎదురుపడటం లేదు. అలాగే "గుడ్ మార్నింగ్ జాక్, రాత్రి షిఫ్టు ఎలా గడిచింది?" అన్న మేరీ పలకరింపు కూడా నేను వినడం లేదు.

ఔను, రాత్రి గడిచిపోయింది. ఉషోదయమైందిప్పుడు.

గ్రాంత్ మాతెవోస్యాన్

గ్రాంత్ మాతెవోస్యాన్ సోవియట్ ఆర్మీనియాకు చెందిన ప్రముఖ రచయిత. ఆయన అగ్నిద్జోర్ అనే గ్రామంలో 1935లో జన్మించాడు. ఎరెవాన్‌లోని విద్యాబోధనా శాస్త్రపు ఇన్‌స్టిట్యూటు నుంచి 1959లో ఆయన పట్టా భద్రుడయాడు. "గ్రాకాన్ తేర్త్" ("సాహిత్య పత్రిక"), "సోవేతకాన్ గ్రాకానూతియున్" ("సోవియట్ సాహిత్యం") అన్న పత్రికలలో మొదట ప్రూఫు రీడరుగాను, తర్వాత సంపాదకుడుగాను పని చేశాడు.

మాతెవోస్యాన్ తన రచనా వ్యాసంగాన్ని 1959లో ప్రారంభించాడు. ఆయన మూడు నవలికలనూ, అనేక కథలనూ రచించాడు. అవన్నీ కూడా పాఠకుల మెప్పుదలను సంపాదించుకున్నాయి. ఆయన కథల్లోని పాత్రలు పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజలు: గొర్రెల కాపరులు, ద్రాక్ష వ్యవసాయదారులు, కోతకూలీలు, కమ్మరులు. మాతెవోస్యాన్ రచనలపై వెలువడిన ఒక సమీక్షలో యిలా పేర్కొనబడింది: "అత్యంత సామాన్యమైన దాన్ని దివ్యమైన ఒక కల్పిత కథలా తీర్చిదిద్దే ప్రతిభా, మానవుని రోజువారీ వ్యవహారాల్లో కవిత్వాన్ని దర్శించగల నేర్పూ మిళితమై మాతెవోస్యాన్ కథలకు ఆర్మీనియన్ గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబించే యితిహాస లక్షణాన్ని కల్పించాయని చెప్పవచ్చు."

ఆకుపచ్చ లోయ

ఫెళఫెళా రవంతో పిడుగు గండశిలను ఢీకొని, పక్కకు జారి, భూమిలోకి దిగబడిపోయింది.

ధూసరవర్ణపు శిల కఠినంగా వుండటంతో పిడుగు దాన్నుండి ఏదో ఒకటి రెండు చిన్న ముక్కల్ని మాత్రమే ఖండించగలిగింది.

గండశిల పాదభాగాన పరుచుకొన్న పచ్చిక పడే పిడుగులన్నిటికీ గోరీ కట్టేది. వసంతంలోనూ, గ్రీష్మంలోనూ యిక్కడ పడి, అవి గోరీ పాలయ్యేవి. గండశిల పిడుగులన్నిటినీ తాను స్వీకరించి పక్కనున్న ఓకుచెట్టును వాటి బారి నుండి మాడిపోకుండా కాపాడేది. అందుకు ఓకుచెట్టు ప్రతిసారీ శిలపట్ల కృతజ్ఞతాభావంతో నిండిపోయేది.

గుట్టల మీదా, లోయ పైనా మెరుస్తూ మెరుస్తూ అంతలోనే అదృశ్యమైంది మెరుపు. గుర్రం ఆప్యాయంగా సకిలించి గుర్రప్పిల్లను పిలిచింది. యిప్పుడు మెరుపు మెరుస్తుందని, అది తన బిడ్డను బెదరగొట్టుతుందని తల్లికి తెలును. పాలుకుడవడానికి తల్లి తనను పిలుస్తోందని అనుకొంది గుర్రప్పిల్ల. చెవులాడిస్తూ తనకు పాలు తాగాలని వుందా లేదా తేల్చుకోడానికి ప్రయత్నిస్తోంది. లేదు, పాలు తాగాలనే కోరిక దానికంతగా వున్నట్లు లేదు. పచ్చికనూ పువ్వుల్నీ ఆఘ్రాణించాలని వుంది.

మెరుపు మెరిసింది. గుర్రప్పిల్ల జడుసుకొని పారిపోయింది. దానికి వల్లమాలిన భయంవేసి, ఆ గాభరాలో తల్లిని గమనించకుండా మరో దిక్కుకు పరుగెత్తింది. తల్లి దాని వెంట చెంగున దూకింది. కానీ అక్కడే ఆగిపోయింది. చెట్టుకు కట్టేసిన మెళ్లో తాడు గొంతుకు బిగుసుకుంది. అప్పుడది గుర్రప్పిల్లను పిలుస్తున్నట్లుగా సకిలించింది.

గుర్రప్పిల్ల తిరిగి వచ్చింది. చెవులు నిక్కబెట్టి ఓకుచెట్టు ఆకులపై వానచినుకుల

చిటపటల చప్పుడు వినసాగింది. గండశిల వంకా, అడవి రోజాపొద వంకా చూసింది, కళ్ళు మిటకరించి, తన భయాన్ని అక్కడికక్కడే మర్చిపోయింది. తానక్కడికి, తల్లి దగ్గరికి, మామూలుగా పాలు తాగడానికొచ్చినట్లుగా అనిపించింది దానికి.

ఈ గుర్రప్పిల్ల, తుషార స్ఫటికాలను బోలిన బుల్లి తెల్ల మచ్చల పంచకళ్యాణి. ఒళ్ళంతా నాగుమంచు కప్పినట్లుగా, వెనక కుడికాలేమో పిక్కదాకా చెప్పరానంత తెల్లగా, హిమరాశిలో కూరుకున్నట్లనిపిస్తుంది. లోయలో సెలయేటి నీళ్ళు తాగడానికి లేళ్ళు, దుప్పలు, మేకలు, గొర్రెలు వచ్చేవి. ఈ గుర్రం కూడా వచ్చేది అక్కడికి. అది తన సుదీర్ఘ జీవితంలో ఎన్నో పిల్లల్ని ఈనింది. కానీ ఈ కడగొట్టు పిల్ల అన్నిటినీ మించిన అందాలరాశి. పొడవాటి నాజూకైన మెడ, చిన్ని తల, నుదుటిపై బుల్లి తెల్ల నక్షత్రాకారపు మచ్చ. జూలూ, తోకా నల్లగా వున్నాయి. దాని కళ్ళు కూడా ఎంతో అందమైనవి. గుర్రాల కళ్ళు ఎప్పుడూ అందంగా వుంటాయి — ఆ కళ్ళలో భూమ్యాకాశాలు ప్రతిబింబిస్తుంటాయి. గుర్రప్పిల్ల కళ్ళలో యిప్పుడు ఓకుచెట్టూ, అడవి రోజా పూలూ, లేతకావిరంగు, ఇంచుమించు ఎర్రవన్నెగల తల్లి రూపూ, మొత్తం ఆకుపచ్చ లోయా ప్రతిబింబిస్తున్నాయి.

వర్షపు నీటిబొట్టొకటి దాని వెన్ను మీద జారింది. దాంతో గుర్రప్పిల్ల హడలిపోయి, తల్లికి దూరంగా దౌడు తీసింది. తల్లి దాన్ని మళ్ళీ పిలవలేదు. వర్షం వెలిసింది. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు.

సూర్యకాంతిలో పచ్చికబీడు మెరుస్తూంది. లోయలోని ఒకేఒక ఓకుచెట్టూ, అడవి రోజాపొదా, తల్లీ, పిల్ల గుర్రాల తడిసిన వీపులూ, ధూసర వర్ణపు గండశిల నుండి పుట్టి పచ్చికబీటి వెంట పారుతున్న సెలయేరూ — సర్వం చెమ్మతోను, పుష్పాల దివ్యకాంతులతోను దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. సెలయేటి నీరు పిడుగుల చిలుం వాసన వేస్తూంది. అంచేత గుర్రప్పిల్ల కొంచెం బిత్తరపోయింది. అడవి రోజాపొద కూడా అదే వాసన వేస్తూంది. వెరపుతో పొద నుండి ఆవలికి రెండు మూడు గంతులేసి ఆగిపోయింది. రోజాపొద వంక పరికించి చూసింది. తర్వాత మళ్ళీ చుట్టుపట్ల అన్నిటినీ ఆఘ్రాణిస్తూ చిన్నచిన్న అంగలేస్తూ వెళ్ళింది.

ఆ లోయలోని అన్ని వాసనలూ గుర్రానికి చిరపరిచితం. తరచుగా గుర్రాన్నిక్కడ మేతమేయడానికి కట్టేసే వాళ్ళు. అది పచ్చిక నెమరేస్తుంటే తడిసిన గొర్రె వున్ని వాసన వేసింది. అంటే గుట్టలకు అవతలి వైపు గొర్రెలు మేస్తున్నాయన్న మాట. వాటిని పెద్దపెద్ద కుక్కలు కాపలి గాస్తున్నాయి.

గుర్రం తలవంచి రెండు మూడు సార్లు పచ్చిగడ్డి కరకరా నమిలింది. కాని, వున్నట్టుండి లోయపై ఏదో గత్తర ముసురుతున్నట్లు పసిగట్టింది గుర్రం.

పరాయి వాసన పసిపట్టడానికై అది ముక్కు పుటాలు పెద్దవి చేసింది. సీతాకోక చిలుకల రెక్కల రెపరెపలు, తుమ్మెదల ఝంకారనాదం, సెలయేటి మర్మరధ్వనులు వినిపిస్తున్నాయి. గుర్రప్పిల్ల మెడసాచి అడవి రోజాపొద చుట్టూ పరుగెత్తింది. ముసలి గుర్రం కేవలం ఈ ధ్వనులను, దృశ్యాలను మాత్రమే గాక ఇంకేదో వినదల్చుకొంది, చూడదల్చుకొంది. ఏదేమైనా లోయలో ప్రమాదం పొంచి వుంది. ఈ ప్రమాదం కనిపించటం లేదు, వినిపించటం లేదు. గాల్లో కూడా ఈ ప్రమాదపు వాసన ల్లేవు. కాని ముసలి గుర్రం మాత్రం ప్రశాంతంగా మేయలేక పోయింది.

ముసలి ఎర్ర గుర్రం వుగ్రరూపం దాల్చింది — లోయలో శత్రువు వుండీ కూడా గుట్టు చప్పుడు కాకపోవడంతో వుగ్రురాలైంది.

హఠాత్తుగా గుర్రప్పిల్ల దేన్నో చూసి, తర్వాత తల్లి వైపు చూపు మళ్ళించింది. ఈ "ఏదో" అయినది అప్పటికింకా గుర్రం కళ్ళబడలేదు. గుర్రం తల రిక్కించి నిల బడింది. దాని కళ్ళు మెరిశాయి.

గుర్రప్పిల్ల ఈ "ఏదో" దాని వైపుగా మోరసాచి దాని కెదురుగా వెళ్ళింది. ఆక్షణంలో తల్లికి తోడేలి వెగటు కంపు కొట్టింది. ఆడతోడేలు భూమికి అంతెత్తున ఎంతెంత పెద్ద గంతుల్తో దూకుతూ వుందో చూసి తల్లి గుర్రం సకిలించి ఒక్క వుదుటున గుర్రప్పిల్ల వైపు దూకింది.

ఎర్ర గుర్రం తోడేలు వైపు, గుర్రప్పిల్ల వైపు దూకింది. కానీ గభాల్న కుప్పలా కూలిపోయింది — కుప్పళించి దూకడంతోనూ మెళ్లోతాడు కారణంగానూ.

గుర్రప్పిల్ల రోజాపొద నుండి విరుచుకు పడింది. పెద్ద పెద్ద వలయాలు తిరుగుతూ తల్లిచెంతకు చేరాలని ప్రయాసపడి పరుగెట్ట సాగింది. కానీ ప్రతిసారీ దారి అటకాయించింది తోడేలు. తల్లిగొంతుకు తాడు బిగుసుకుంటూ వుంది. అప్పుడు గుర్రప్పిల్ల తోడేలు మీదుగా తల్లి చెంతకు దూకింది. కానీ తోడేలు దాని వెనక్కాలు లంకించు కొంది. గుర్రప్పిల్ల కెవ్వవకేకవేసి పడిపోయింది. ఆ తర్వాత గిలగిలా తన్నుకోసాగింది.

గుట్టలకు ఆవలి వైపు గొర్రెలు మేస్తున్న చోట గుండెల్ని దూసుకుపోయే గుర్ర ప్పిల్ల ఆర్తనాదం ప్రతిధ్వనించింది. కుక్కలు దిగ్గున లేచి ఒళ్ళు విరుచుకొని, చెవులు నిక్కబొడిచాయి, నల్లమూతి కుక్క "తర్పాష్" కూడా వుంది వాటిల్లో.

గుర్రప్పిల్ల కేక విని తల్లి గుర్రం వెనక్కాళ్ళ మీద వువ్వెత్తున లేచి భీకరంగా తోడేలు మీద విరుచుకు పడింది. తాడు తెగిపోయి కాళ్ళకు ఫెళ్ళున కొట్టుకొంది.

గుర్రప్పిల్లను వదిలిపెట్టింది తోడేలు. గుర్రం ముందు కురికేసరికి తోడేలు కొంచెం వెనక్కి పారిపోయింది. గుర్రం మూతి నేలకు వాల్చి మెల్లగా, భయంకొల్పేలా ముందు ముందుకు వెళ్ళింది. తోడేలు బారుగా సాగింబడి, వక్కి నేలను గట్టిగా కరుచుకొని ఏ క్షణంలోనైనా దూకి గుర్రం మూతి నోట పుచ్చుకోడానికి సిద్ధంగా వుంది. కానీ ఆ సమయంలో గుండ్రంగా మడిదిరగ సాగింది గుర్రం.

తోడేలు దూకలేదు. అదీ గుండ్రంగా తిరిగి, సరిగ్గా గుర్రం మూతికి ఎదురుగా ఆగింది. రొమ్మును అధిమి పట్టుకొన్న గుర్రప్పిల్లను రక్షిస్తూ, తల్లి మళ్ళీ ప్రదక్షిణం చేసింది. దాంతో పాటూ తోడేలూ తిరిగింది. రెండు చిన్న గంతులు – తోడేలు గుర్రం మూతికి మరీ చేరువయింది. కానీ గుర్రం ఒక చుట్టు తిరిగి తోడేల్ని జాడించి తన్నగల్గింది. దాంతో గుర్రప్పిల్లను తల్లి ఆఖరి క్షణం దాకా కాపాడబోతూ వుందని అర్థమై పోయింది తోడేలుకు. గుర్రానికి చెమటలు పట్టాయి. తోడేలు కూడా అలిసి పోయింది. తర్వాత వున్నట్టుండి ఒక్క త్రుటిలో తోడేలు మళ్ళీ గుర్రం మీది కురికింది. తోడేలుకు గుర్రం మూతి దొరక్కపోవడంతో గుండెల మీదికి ఎగబడింది. అయితే తల్లి గుండ్రంగా చుట్టుతిరుగుతూ గుర్రప్పిల్లను కాపాడుతూనే వుంది.

అప్పటికే సాయంకాలమైంది. చుట్లు తిరిగితిరిగి తోడేలు దాదాపు ఈడిగిలబడి పోయి, భారంగా శరీరాన్ని ఈడ్చుకుంటూ నడుస్తోంది. గుర్రం కూడా మెల్లగా, ప్రయాసతో తిరుగుతూంది, పడుతూ లేస్తూ. వాటి కళ్ళు మబ్బులు కమ్మాయి. ఒకదానికొకటి కనిపించటం లేదు.

ఆ సమయంలో పశుల కాపరి కుర్రాడు గుట్టపైకెక్కాడు. కంటపడ్డ భయంకర దృశ్యంవల్ల వాడి నోటంట మాట పెగల్లేదు. తోడేలు గుర్రం మూతి పట్టుకొని వేలాడుతూంది. తోడేల్ని గిట్టలతో తొక్కడం ఇంక ఏమాత్రం వల్ల కాలేదు గుర్రానికి. క్షణంలోనో సగంలోనో నేలకొరిగేటట్టుంది ఎర్ర గుర్రం.

"రేయ్ అబ్బీ, రేయ్!" దరిదాపు గుట్టల మీది నుండి అరిచారు. "తోడేలు గుర్రం మీద పడింది! కుక్కలు యాడున్నాయిరోయ్!"

పశుల కాపరి కుర్రాడు భయంతో కపీసం అరవలేకపోయాడు. కుక్కలు దిగ్గన లేచి ఒళ్ళు విరుచుకుని చూశాయి. చూసి, రివ్వున దౌడు తీశాయి.... తవూష్, బోద్, షేవో, బగార్, చలాక్, షంబార్. నల్లమూతి కుక్క తవూష్ తోడేళ్ళను పట్టడంలో దిట్ట. సాధారణంగా అది మొరక్కుండా తోడేల్ని సమీపించి చటుక్కున పట్టుకునేది. అదే ముందు పరుగెట్టింది యిప్పుడూ.

గుర్రం యిప్పుడో అప్పుడో మోకాళ్ళ మీద ఒరిగిపోయేటట్టు వుండగా, తోడేలుకు

స్వప్నంలో లాగా లీలగా కుక్కలు మొరగటం వినిపించింది. రోజంతా పడ్డ యాతన వృధా చేసేంత క్రూరంగా, తన బిడ్డల దగ్గరికి కడుపు మాడ్చుకొంటూ నిష్ఫలంగా తిరిగి వెళ్లేటంత క్రూరంగా విధి వుండగలదా అనుకొంది.

గుర్రానికి ఒంట్లో యిక ఏమాత్రము సత్తువా లేకపోయేసరికి, దాని కళ్ళు పూర్తిగా బైర్లు కమ్మి, బాధతో శరీరం మొద్దు బారి పోయింది. చెవులు దిమ్మలేశాయి. కుక్కలు అరవటం విని, అవి తన బిడ్డ వెంటబడ్డాయని భావించింది. తన బిడ్డకు కేవలం ఒక్కటంటే ఒక్కనెలకే ఆయువు మూడేంత క్రూరంగా విధి వుండగలదా అనుకొంది.

కుక్కల మొరుగుడు సూటిగా తోడేలు చెవుల్లోకి దూసుకుపోయింది. కానీ, ఇంతటి చిత్ర హింసతో కూడిన విజయం తర్వాత అపజయం వెన్నాడుతుందని అప్పటికీ నమ్మలేకపోయింది. ఇంటి దగ్గర తన పిల్లలు ఆకలితో అవురావురు మంటున్నాయి, తన రొమ్ము లేమో ఖాళీ....

కుక్కలు తోడేలి మెడ, చెవులు కరుచుకొని కాలు పుచ్చుకున్నాయి. విడిపించుకో డానికి దానికి రవ్వంత శక్తి కూడా లేదు. కుక్కలకు గొంతు చిక్కకుండా బారుగా సాగిలబడి నేల కరుచుకొంది.

ఒక కుక్క కాలు కొరికింది తోడేలు. దాంతో ఆ కుక్క కుయ్యిమంటూ అవతలికి దూకింది. తోడేలు లేచింది. కుక్కలన్నీ చుట్టుముట్టి ఎదురు చూస్తున్నాయి. కుక్కలు చాలా వున్నాయి. వాటి బారి నుండి తప్పించుకొని యింటికి, తన పిల్లలు నిరీక్షిస్తున్న చోటికి పరుగు తీసేటందుకు కష్టమూ, అసాధ్యమూ అయిపోయింది తోడేలుకు. పళ్ళికిలించి గుర్రుగా కుక్కల వైపు చూస్తూంది తోడేలు. కుక్కలు కూడా తోడేలు వంక చూస్తున్నాయి. వాటిల్లో ఒక కుక్క వున్నట్లుండి రెచ్చిపోయి తోడేలు మీదికి దూకి రొమ్ముతో కుమ్మి అవతలకి తోసింది. తోడేలుకు కింద పడ్డంత పనైంది. ఈ నల్లమూతి కుక్క అతి ప్రమాదకరమైందని అప్పుడు తెలిసొచ్చింది తోడేలుకు.

"ఒరేయ్ అబ్బీ – రేయ్!.. తోడేల్ని కొరికిసంపడానికి కుక్కలకు సాయం చెయ్! రేయ్!" సమీపానవున్న గుట్టల నుండి అరవటం మొదలెట్టారు.

గుర్రం నేల కొరిగిపోయింది. బిడ్డ తల్లి పక్కన నిలబడి తల్లి లేస్తుందని ఎదురు చూసింది. కానీ తల్లి ఎంతకూ లేవలేదు. ఆ పసికూన మూతితో తల్లి డొక్కలో పొడిచింది. కానీ తల్లి లేవలేదు. కదల్లేదు. మెదల్లేదు...

నల్లమూతి కుక్క తోడేలు గొంతు పట్టుకోలేకపోయింది. తోడేలు కరవటం లేదు, భయపెట్టడం లేదు. తోడేలు మెళ్ళో నుండి గుప్పెడు బొచ్చు కుక్క నోట్లోకి వూడి

రావటంతో, కుక్క తోడేలు వెంటబడ్డం మానేసింది. కుక్క వెనకబడి, చీదరతో గుక్కతిరక్క తుమ్మింది.

తోడేలు పారిపోగలిగింది.

సూర్యాస్తమయానికి లోయలోయంతా హరితకాంతుల్తో నిండిపోయింది. ముసలి ఎర్ర గుర్రం చుట్టూ నల్లగా, కారు నల్లగా వుంది. దాని ఎర్రటి దేహం ఈ నల్లటి వలయంలో పడివుంది. గుర్రమూ తోడేలూ హోరాహోరీ పోరు సలిపిన స్థలమే ఈ నల్లటి వలయం. గుర్రం నుగ్గునుగ్గుగా తొక్కిన నేల. గుర్రం తొక్కిడికి దుమ్మురేగిన ఈ నల్ల నేలను చూస్తే ముసలి గుర్రం తోడేలుతో ఎంత సేపు గిరగిరా ప్రదక్షిణాలు చేసిందో తెలుస్తుంది.

ఈ నల్ల వలయం మూడేళ్ళు అలాగే నల్లగా వుండి పోయింది. మూడేళ్ళపాటు అక్కడ గడ్డిపరక మొలవలేదు. ఈ నల్ల వలయంలో మూడేళ్ళు గుర్రం తెల్లని కంకాళం అలాగే పడివుండింది. ఆ తర్వాత పవరిక గెలిచింది, మొలిచింది, చివుళ్ళేసింది, పూలు పూసింది. దాంతో లోయ మళ్ళీ పచ్చబారింది.

గుట్టపైకెక్కి చూస్తే – లోయ ఆకుపచ్చగా, ఒకుచెట్టు దివ్యంగా నిల్చుని వుంది. నిమవీథిలో పయనిస్తున్న మేఘశకలాల నవ్వడిని అలకిస్తూ కునికిపాట్లు పడుతోంది గండశిల. సూర్యకాంతిలో ఐదు అడివి రోజా పూగుత్తులు విచ్చుకున్నాయి. ఆకుపచ్చ లోయలో ఒక మచ్చల గుర్రం మేస్తూ కనిపిస్తుంది.

నుదుట నక్షత్రాకారపు మచ్చవున్న గుర్రం తన అందమైన తల ఎత్తితే, దాని కళ్ళలో గండశిల, ఒకుచెట్టూ, పుష్పిస్తున్న రోజాపొదా, ఆకుపచ్చ లోయా, నీలాకాశంలో తెలి మొయిళ్ళూ ప్రతిబింబిస్తాయి.

"యిదే ముగింపా?"

"పూర్తయింది."

"లేదు."

"ఎందుకు లేదు?"

"తల్లి గుర్రం చావకూడదు."

"తల్లి గుర్రం చావలేదని చెప్పలేను. ఎందుకంటావా? తల్లి గుర్రం నిజంగానే ప్రాణాలు విడిచింది. పశుల కాపరి కుర్రాడు పరుగుపెడుతూ గుట్ట దిగివచ్చేసరికే తల్లి గుర్రం కన్ను మూసింది. గుర్రప్పిల్ల తల్లి పక్కన విషాదంగా నిల్చుని వుండింది. "రేయ్ అబ్బీ – ఒరేయ్!" అని కేకపెట్టిన పశుల కాపరి పక్క గుట్ట నుండి దిగి వచ్చే

టప్పటికే తల్లి గుర్రం శరీరం చల్లబడిపోయింది. పశుల కాపరి, పశుల కాపరి కుర్రాడూ ముసలి గుర్రం పక్కన కూచుని గుర్రప్పిల్లను ఎలా పెంచాలా అని ఆలోచనలో పడ్డారు.

"దాన్నెలా పెంచారు వాళ్ళు?"

"ఇంకో గుర్రం పాలతో."

"కాదు. కాదు. తల్లి గుర్రం చావకూడదు."

"తల్లి గుర్రం చావలేదని చెప్పలేను. ఎందుకా? ఆ ఎండాకాలమంతా అనాథ అయిన ఆ గుర్రప్పిల్లకు ఇంకో గుర్రం పాలు కుడిపాను నేను."

"గుర్రం ఎందుకు చచ్చిపోయిందంటావు?"

"నేను ముసలి ఎర్ర గుర్రం పక్కన కూచుని వుండగా, ద్వేషంతోను, గుర్రప్పిల్ల ఏమౌతుందోననే భయోత్పాతంతోను గుర్రం గుండెలు బద్దలయ్యాయని పశుల కాపరి చెప్పాడు."

"ఆ పశుల కాపరి కుర్రాడు నువ్వేనా?"

"అవున్నేనే. ఆ గుర్రం మాదే. ఆ గుర్రప్పిల్లా మా గుర్రానిదే."

"యిప్పుడది పెరిగి పెద్దదై అకుపచ్చ లోయలో కట్టేస్తే మేస్తూ వుంటుందా?"

"ఆ.... అది పెద్దదైంది. కట్టేస్తే ఆకుపచ్చ లోయలో మేస్తుంది."

"ఏదీ మళ్ళీ చెప్పు...."

"పిడుగు ఫెళఫెళా రవంతో గండశిలను ఢీకొని పక్కకు జారి భూమిలోకి దిగబడి పోయింది. ధూసరవర్ణపు శిల కఠినంగా వుండటంతో పిడుగు దాన్నుండి ఏదో ఒకటి రెండు చిన్న ముక్కల్ని మాత్రమే ఖండించగలిగింది; కాయలు మాడిపోయి పందువల్ల కొంచెం గాభరా పడింది ఓకుచెట్టు. పొడువు కాళ్ళు, నక్షత్రాకారపు మచ్చ వున్న చిన్ని గుర్రప్పిల్లకు చాలా భయమేసి తల్లి దగ్గరికన్నట్లుగా పరుగుతీసింది. నిజానికది బెదురుతో తల్లిని గమనించకుండా సరిగ్గా ఇంకో దిక్కుకు పరుగెత్తింది. ముసలి గుర్రం ఆప్యాయమైన సకిలింపుతో దాన్ని తన చెంతకు పిలిచింది....

అబిగ్ అవాక్యాన్

అబిగ్ అవాక్యాన్ 1919లో టెహరాన్‌లో జన్మించాడు. అక్కడి అమెరికన్ కాలేజిలో విద్యాభ్యాసం చేశాడు.

అవాక్యాన్ 1946లో సోవియట్ ఆర్మీనియాకి వచ్చాడు. అదే సంవత్సరం ఆయన సోవియట్ రచయితల సంఘంలో సభ్యుడయాడు.

ఆయన మొదటి కథలు ఆర్మీనియన్, పర్షియన్ మేగజైన్లలో ప్రచురింపబడ్డాయి. కాని ఆయన మొదటి పుస్తకం ఎరెవాన్‌లో వెలువడింది.

1949 దరిమిలా ఆయన నాలుగు కథా సంపుటాలూ, రెండు చిన్న నవలలూ, "వాజేరి దెలార్యావ్" అనే నవలా ప్రచురించాడు. ఆయన కథా రచయితగానే సుప్రసిద్ధుడు. ఆయన కథల్లో, ఆయన వర్ణనా సామర్థ్యం, మానవ నైజ పరిజ్ఞానమూ విశిష్టంగా ఆవిష్కృతమయ్యాయి.

చరమ దశ

గెగామ్-ఐరిక్* తన పారని భూమిలోకి దించి చుట్టూ కలియజూశాడు. కళ్లు బైర్లు కమ్మాయి. దృష్టి పథం నుంచి ప్రపంచం మరుగుపడినట్లయింది. కూరల మడి పక్క నున్న తడిమట్టి గట్టు మీద చదికిలబడి ఆ మైకాన్ని చెదరగొట్టడానికని కళ్లు నులుముకున్నాడు. అకస్మాత్తుగా మృత్యు దేవత అతనికి ప్రత్యక్షమైంది. ఆ అస్పష్టాకారం తెరిచి వున్న తోట గేటు దగ్గర నిలిచి వుంది. దాని చేతుల్లో ఒక దానిలో పచ్చి విల్లో కొమ్మా, మరో దానిలో కొడవలీ వున్నాయి. దాని పాదాలను పొగ మంచు చుట్టి వుంది.

"రా, గెగామ్...."

ఎక్కడో మాలి అడుగు నుంచి వస్తున్నట్టుందా స్వరం.

తానీ దేవతను ముందెప్పుడో చూసినట్లనిపించింది గెగామ్‌కి. బైబిల్లో చిత్రంగా చూశాడా? లేక బహుశా కలలో చూశాడా? అతనికి జ్ఞాపకం రాలేదు. అతని ఒళ్లంతా చెమట పట్టి తడిసి ముద్ద అయిపోయింది. అప్పుడతను వెనక్కి తిరిగి "సాతెనిక్! వార్దెనిక్! సిరూన్!" అంటూ పిలిచాడు.

అతని కోడళ్లు హడావిడిగా మెట్లు దిగి పరుగున వస్తూంటే, అతను మృత్యు దేవతని "అప్పుడే ఏం మునుకుపోయింది, ఇంకొంచెం తర్వాత రాక పోయావా?" అని ప్రశ్నించాడు.

"ఊహుం, తుతీ నీ కోసం అక్కడ ఎదురుచూస్తోంది" అంటూ జవాబిచ్చింది.

---

* ఐరిక్ (ఆర్మేనియన్ పదం) — గౌరవ వాచకం. — సం.

ఆ స్త్రీల అడుగుల సవ్వడి ఆ అస్పష్ట కృతిని భయభ్రాంతం చేసినట్లుంది. చెట్లను ఆవరించిన పొగమంచు వస్త్రాలన్నీ అలాగే ఉండిపోయినా, అది మాత్రం అదృశ్యమైంది.

"ఎవరినైనా వచ్చి నన్ను పైకి తీసికెళ్లమని చెప్పండి. నా మరణకాలం ఆసన్నమైంది. నేనీ లోకం విడిచిపెడుతున్నాను."

ఆ స్త్రీలు గాభరా పడ్డారు. సిరూన్ శోకన్నం ప్రారంభించింది. పెద్ద కోడలు సాతెనిక్ "ఎందుకలా కాకిలా అరుస్తావ్, నోరు మూస్తావా, నీ నాలుక పీకెయ్యమంటావా!" అంటూ కూక లేసింది.

వాళ్లు పొరుగు వాళ్లని పిలుచుకొచ్చి గెగామ్-ఐరిక్‌ని మేడ మీదకి సాయంపట్టి మోసుకెళ్లారు. తన జీవిత కాలంలో అనేక దేశాలు మెట్టిన ఈ వ్యక్తి యిప్పుడిక్కడిలా నిస్సహాయంగా మంచం మీద వెల్లకిలా పడి వున్నాడు. అతని కళ్లు మూతలు పడ్డాయి.

ఏ వ్యక్తి అయినా చరమ దశకు చేరుకున్నప్పుడు, ఒక్క సారి గతాన్ని సంస్మరించుకుంటాడు. తనేం చూశాడు? తను తన వెనక ఏం దిగవిడిచి పెట్టాడు?

ఈ ప్రపంచం ఎంత లోపభూయిష్టమైనది! సుదూర మార్గాల ధూళిని నీ పాదాల నుంచి దులిపేసి, చిట్టచివరకి నువ్వు నరదాగా గడపాలనుకొని వచ్చిన చెట్టు కింద విశ్రాంతి తీసుకోవాలనుకోగానే తోట గేటు కిర్రుమంటూ తెరుచుకొని, ఒక స్వరం "రా, గెగామ్" అని నిన్ను పిలుస్తుంది.

"సాతెనిక్! వార్సెనిక్! సిరూన్!"

చిన్న కోడలు సిరూన్ అతని మంచం వార కూర్చొని, గుడ్ల నీరు కుక్కుకొంటూ, "నేను కొండ కొమ్ము నుంచి కిందికి దూకేస్తాను. గెగామ్-ఐరిక్ లేని యీ దారుణ ప్రపంచంలో బ్రతికి వుండటం నాకు మనస్కరించదు" అనుకుంటోంది.

అటు తర్వాత ఆమె మనస్సులో ముసిరిన అనేక ఆలోచనలు, ఆమె భయాలను శాంతపరచాయి: "సంబాత్ త్వరలోనే యింటి కొస్తాడు.... నా భర్త సంబాత్, ఎర్రని ఎండలో, చెమటలు కారుస్తూ, తిరిగి వచ్చే బళ్ల వెనక లేచే దుమ్ము ఒళ్లంతా కొట్టుకొని తిరిగి వస్తాడు. ఆయన నా వెనక ఆరా శిఖరంలా నిలబడతాడు.... 'నేనీ లోకం విడిచిపోతున్నాను' అన్నాడు గెగామ్-ఐరిక్. కాని, మనలో ఏ ఒక్కరు మాత్రం ఈ లోకంలో శాశ్వతంగా ఉంటారు?... ప్రేమ అనేది ఎప్పుడూ ఉంది, మనుషులూ ఎప్పుడూ ఉన్నారు. నేను సంబాత్‌ని ఒక విధంగా ప్రేమిస్తాను, గెగామ్-ఐరిక్‌ని మరో రకంగా ప్రేమిస్తాను. ఓహ్, ముసలాయన్ని పూడ్చి పెట్టడం నాకు ఎంత విచారకర విషయం. పూడ్చటానికి బదులు ఆయన్ని మబ్బుల పైకెత్తి, రగ్గు కప్పిన మంచం పైన అక్కడ పడుకో పెడితే ఎంత బాగుండును."

"ఉహూఁ!" అందామె బిగ్గరగా విచారోద్వేగంలో. "ఆయన మనల్ని విడిచి వెళ్లిపోరు!"

పెద్ద కోడలు సాతెనీక్, కడవ భుజాన పెట్టుకొని గదిలో ప్రవేశించింది. ముందు లాగే ఆమె "ఎందుకలా కాకిలా అరుస్తావ్, నోరు మూస్తావా నీ నాలుక పీకెయ్యమంటావా!" అంటూ కూక లెయ్యబోయింది. అంతలోనే నడిపి కోడలు వార్సెనీక్ లోపలి కొచ్చింది.

మృత్యుముఖాన వున్న మామగారి వంక గుడ్లప్పగించి చూస్తూ వాళ్లొకరి పక్క మరొకరు కూర్చున్నారు.

అతని కొడుకులు ఖాచాతూర్, సార్గిస్, నంబాత్‌లు తమ తొందరలో గేటు దాదాపు ఊడి వచ్చేలా నెట్టుకొంటూ లోపలి కొచ్చారు. వాళ్ల పాదధ్వని విన్న గెగామ్-ఐరిక్, "పిల్లల కోసం ఎవళ్లనైనా పంపించండి" అన్నాడు.

వాళ్ల పొరుగువాడు గార్సెవాన్ పిల్లల్ని పిలుచుకొచ్చేందుకు వెళ్లాడు. త్వరలోనే గెగామ్-ఐరిక్ మనుమలూ మనుమరాండ్రూ లోపలి కొచ్చారు. వాళ్ల చేతివేళ్లూ, ముఖాలూ సిరా మరకలతో నిండి వున్నాయి. వాళ్లు తమ తాతగారి చుట్టూ మూగారు. ఎవరైనా కడసారిగా చూసేట్టుగా, అతను వాళ్ల కేసి చాల సేపు రెప్ప వాల్చకుండా చూశాడు. తర్వాత అతను, ఆ పిల్లల తలితండ్రులతో "మీరు ఏ డాక్టర్లనీ పిలవబోకండి! మీరు పిలుచుకొచ్చారా, నా ప్రాణం సుఖంగా పోదు" అన్నాడు.

రాబోయే మృత్యువు సంగతి పసిగట్టిన పొరుగు ముసలమ్మలు తోటలో గుమికూడారు. అక్కడ నుంచి వాళ్ల నిట్టూర్పులూ, మూలుగులూ వినవస్తున్నాయి.

"ఆ ముసలి పీనుగుల్ని తోటలోంచి బయటకి గెంటెయ్యండి! నా చుట్టూ యిక్కడెక్కడా ఏడుపులూ శోకన్నాలూ వినిపించేందుకు వీల్లేదు!" అన్నాడు గెగామ్-ఐరిక్.

అందరూ గదిలోంచి మెల్లగా బయటికెళ్లారు. తోట గేటు దఢాలున మూసు కోవడం, తన కుటుంబ సభ్యులు, తన యిహలోక సంపద, తన సమస్త విశ్వం, మెట్లు క్రిరుక్రిరు శబ్దం చెయ్యకుండా మెల్లగా పైకెక్కి వస్తున్న అడుగుల సవ్వడీ గెగామ్-ఐరిక్ విన్నాడు.

"సాతెనీక్! వార్సెనీక్! సిరూన్! కర్టెన్లు కిందకి దింపెయ్యండి, వెలుతురు కళ్లల్లో పొడుచుకుంటోంది. ఇప్పుడిక బయటకెళ్లండి. నాకు నిద్ర వస్తోంది. అవసరమైనప్పుడు నేను మిమ్మల్ని పిలుస్తాను."

అయితే, గెగామ్-ఐరిక్ అభిమతం నిద్ర పోవాలని కాదు. అతను తన చేతుల్ని రొమ్ముపై ఒకదానిపై ఒకటి అడ్డంగా వేసుకొని, కళ్లు మూసుకున్నాడు. మనిషి తన

గతజీవితాన్ని ఒక్కసారి సింహావలోకనం చేసుకోవాలనుకునే దశకు యివ్వుడతను చేరుకున్నాడు. తమ ఆసన్న మృత్యువు సంగతి గ్రహించి, తమ హృదయాలను విప్పి మాట్లాడాలనీ, తమ పాపాలను ఒప్పుకోవాలనీ, ఈ భూమిపై మిగిలి వున్న వారికి చివరిమాట చెప్పాలనీ తపించే వ్యక్తులు కొందరుంటారు. గెగామ్-ఐరిక్‌కి ఒకే ఒక్క కోరిక వుంది, తన గతాన్ని సింహావలోకనం చేసుకోవాలనీ, తాను గమించిన అనేక పథాలను మరో మారు తన మానసిక చక్షువుతో చూడాలన్నదే ఆ కోర్కె. రోజన్తమావం జపమాల తిప్పుతూ ప్రార్థన చేస్తూ, తమ మనస్సు నెప్పుడూ గతంలోనే మగ్నం చేసి, ఆ రోజుల్లో జరిగిన క్రూరమైన ఏ జనవధ గురించో, దారుణమైన దురన్యాయాన్ని గురించో విసుగూ విరామం లేకుండా చెప్పే ముసలాళ్ల బాపతు కాడాయన. గెగామ్-ఐరిక్ కూడా వాన్ ప్రాంతానికి చెందిన వాడే, దారుణమైన ఆ జనవధని ఆయునా చూశాడు. అప్పుడే ఆయన తలిదండ్రులను కోల్పోయి దిక్కు లేని వాడయ్యాడు, నికృష్టమైన అనాథ శరణాలయాల్లో పోషింపబడ్డాడు. అయితేనేం, తన మాతృదేశానికి చాలా దూరాన వున్న కారణంగా, అతనెప్పుడూ కష్టించి పని చేసేవాడు, ఆ పని మూలంగా జపమాల తిప్పేందుకూ, గొణిగేందుకూ అతనికెప్పుడూ తీరిక చిక్కేది కాదు. ఈ సువిశాలమైన, అయినా ఇరుకైన ప్రపంచంలో, యీ చివరి నుంచి ఆ చివరి దాకా అతను తిరిగాడు. తను వెళ్లిన ప్రతి చోటా కూడా తన వేదనని మౌనంగా సహించాడు. ఆ వేదన ఎంత దుర్భరమైనదంటే, దాన్నే కనుక అతను వాన్ సరస్సులో విసిరెయ్య గలిగితే, ఆ సరోవర జలాలు కుతకుతలాడి కల్లోలితమై, గట్లు దాటి పైకి పొర్లిపోయేవి.

వాన్ ప్రాంతం నుంచి వచ్చినవాళ్లు యిక్కడీ మెగ్రిలో చాలమందే ఉన్నారు: గుకాస్, మెస్రోప్, షమిలోన్, వాళ్లందరూ కూడా, ఔచిత్యమున్నా లేకపోయినా కూడా, తమ శ్రోతలకు "నేను సరిగా వాన్ ప్రాంతం నడిబొడ్డులో పుట్టాను తెలుసా!" అని చెప్పడం తమ విధి అని భావించినట్లు కనిపిస్తుంది. ఏ పలుగో పారో తీసుకుని ఒళ్లొంచి పని చెయ్యక, వాళ్లు జపమాల తిప్పుతూ శీతాకాలమైతే ఎండలో ఒళ్లు కాచుకుంటూనో, వేసవిలో ఏ చల్లని గోడకో చేర్లబడో, సదా గతాన్ని సంస్మరించుకొంటూ కాలం గడిపేవారు.

గెగామ్-ఐరిక్ దృష్టిలో అతని తండ్రి ఖాచాతూర్-ఐరిక్ సిసలైన వాన్ మనిషి. రైఫిళ్లూ ఖడ్గాలూ ధరించి కొల్లగొట్ట వచ్చిన తుర్కుల పైకి తన గొడ్డలిని తీసుకొని విరుచుకు పడ్డాడు. వాళ్లలో ముగ్గురి పుర్రెల్ని అతను నిలువునా బద్దలు కొట్టి, పాత బాదం చెట్టు క్రింద నిలబడ్డ నాలుగో వాడి పైకి తన గొడ్డలినెత్తి కొట్టబోతూండగా ఒక తుపాకి గుండు ఆయనకి తగిలింది. అప్పుడు తుర్కులు యింట్లోకి జొరబడ్డారు. ఆ తర్వాత....

అటు తర్వాత, దొడ్లోని పెద్ద మట్టి గూనల్లో ఖాచాతూర్-ఐరిక్ దాచిన ఆయన కూతుళ్ళు ఆల్మాస్ట్, ఫిర్యూజ్‌లను వాళ్ళు పట్టుకున్నారు. వాళ్ళ జుట్లు పట్టుకొని వాళ్ళని ఆ గూనల్లోంచి పైకెత్తి నేల మాళిగలోకి లాక్కు పోయారు. ఎండుటాకుల గుట్ట వెనక దాక్కున్న గెగామ్ యిదంతా కళ్ళారా చూశాడు. ప్రపంచమంతా అతని కళ్ళ ముందు నల్లగా, తర్వాత ఎర్రగా మారింది. కలలోవలె అటు తర్వాత జరిగిన ఘటనంతా అతనికి జ్ఞాపకమొచ్చింది. తను బాదం చెట్టు దగ్గరకి పరుగెత్తాడు, తన తండ్రి గొడ్డలిని దొరకపుచ్చుకొని, నేలమాళిగమెట్ల మీద ఆ తుర్కులిద్దరిలో ఒకడి తర్వాత ఒకడిని హతమార్చాడు. అటు తర్వాత, యీ నాటి మబ్బు లాగే, దట్టమైన పొగమంచు తెర మిగిలిన అన్నింటినీ కప్పివేసింది.

"ఇంతకీ నేనెలాగ బతికి బయట పడ్డాను!?" అని బిగ్గరగా అతను తన ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

తను కళ్ళు మూసుకొనే వున్నా, తన కోడళ్ళు తన వంక పరిశీలనగా చూస్తున్నారన్న సంగతిని అతను గ్రహించాడు.

అటు తర్వాత దీర్ఘమైన జీవ యాత్ర ప్రారంభమైంది. వాన్ సరస్సు సమీపంలోని జరాంత్స్ నుండి వచ్చిన పిండిమర యజమాని ఖాచాతూర్ కొడుకు గెగామ్ ఎచ్మి యాజీన్‌కి బయల్దేరి వెళ్ళాడు, అక్కడి నుంచి యూరప్‌కి, యూరప్ నుంచి అమెరికాకి వెళ్ళాడు. పాతబట్టలు పోగుచేసే వానికి సహాయకుడుగా పనిచేశాడు. వార్తా పత్రికలమ్మాడు, వీధులూడ్చాడు. తిండి తిప్పల్లేకుండా, చలిలో వంతెనల క్రిందనో, పార్కు బెంచీల మీదనో అతను నిద్ర లేని రాత్రులెన్ని గడిపాడు? తన మాతృదేశంలోని వాన్ ప్రాంతంతో: ఆ ఆకాశం, ఆ నీరు, ఆ నేల, ఆ చెట్లు, ఆ చందమామ, ఆ నక్షత్రాలతో సరి పోల్చదగినవి, యీ ప్రపంచంలో మరెక్కడా లేవు. ఎక్కడ చూసినా అవి తన స్వస్థానంలో వాటికన్న తీసికట్టుగా నాసిగా వున్నాయి. అవన్నీ నమూనాలు చేసినవిలా వున్నాయి గాని ప్రకృతి సిద్ధమైనవిలా లేవు. అమెరికాలో తనకి దురదృష్టం తప్ప మరేదీ ఎదురు కాకపోగా, అతను తిరిగి తన సంచారం కొనసాగించాడు. "గెగామ్, ఎక్కడి కెడుతున్నావ్?" అని ఎవరైనా అడిగి వుంటే, "నేను వాన్‌కి తిరిగి వెళ్ళే అవకాశం లేదు కనక ఎక్కడికెళ్ళినా ఒకటే" అని బహుశా అతను జవాబు చెప్పి వుండేవాడు.

ఆ విధంగా అతను చివరకి పర్షియా చేరుకున్నాడు.

కాజ్విన్ నగరం అతని మనో నేత్రం ముందు పుటిక నిర్మితమన్నట్లు స్పష్టంగా కానవచ్చింది. సంయ్ సంయ్ మంటూ శబ్దం చేసే పోప్లార్ వృక్షాలూ, గలగల మంటూ పర్వతం పక్కగా ప్రవహించే సెల యేరూ, వెన్నెలలో ఒకేలా నిమగెత్తే విధంగా కీచుకీచు

మవి రొద చేసే కీమురాళ్ళూ, పిండితో నిండిన పిండిమరా, పోతే... వసంత కాలంలో వాన కురుస్తున్న ఒకానొక రాత్రి వేళ భీత హరిణంలా వచ్చి తన ఒంటరి జీవితంలో ప్రవేశించి, ఖాచాతూర్, సార్గిస్, సంబాత్ అనే రత్నాల్లాంటి తన ముగ్గురు బిడ్డలకు తల్లి అయిన జిప్సీ యువతి రుతీ – అన్నీ, అందరూ అతనికి జ్ఞాపకం వచ్చారు.

తన స్మృతుల అగణ్యమైన సౌందర్యం పట్ల హుషారైన నవ్వొకటి గెగామ్ ముఖాన్ని ప్రకాశవంతం చేసింది. అప్పటి నుండి గడిచిన గత ముప్పయ్యేళ్ళలోనూ యిప్పుడు తన మనో వీధిలో కనిపించినంత స్పష్టంగా రుతీ మరెన్నడూ కనిపించలేదు.

అతని స్మృతి గతానికి సంబంధించిన మరో ఘట్టాన్ని అతని మనో నేత్రం ముందుకి తెచ్చింది. తను చాల కాలంగా పొదుపుచేస్తూ వచ్చిన మొత్తం సొమ్ము ఆరు వందల తుమాన్లను తన బెల్టులోని సంచి నుంచి పైకి తీసి తుక్కు తుక్కై పోయిన ఆ పాత పిండిమర యజమానికిచ్చి "ఇవి తీసుకుని నువ్వెళ్లవచ్చు" అని చెప్పిన ఘట్టం జ్ఞాపక మొచ్చింది.

రసూల్ అనే పేరు గల ఆ పిండిమర యజమాని సెల యేటి ఒడ్డున దిగాలుగా కూర్చున్నాడు. తన మిల్లునీ, తన యీ చిన్న ప్రపంచాన్నీ విడిచి వెళ్లడం అతని కిష్టం లేకపోయింది.

ఇప్పుడతని చిన్న ప్రపంచపు యజమాని అయిన గెగామ్, అతని దగ్గర కెళ్లి "ఇప్పుడెక్కడి కెళ్తావ్ రసూల్ భాయ్?" అని అడిగాడు.

రసూల్ మౌనం వహించాడు. బహుశా, "మిల్లులో ఉండే పిల్లేనప్పుడిక ఎక్కడికి పోయినా ఒకటే" అనుకొంటూ ఉండి ఉంటాడతను.

గెగామ్-బిరిక్ కళ్ళు తెరిచాడు, కాని ఏమీ కనిపించడం లేదు: పై కప్పు గాని, కిటికీలు గాని, కర్టెన్లు గాని. అకస్మాత్తుగా అతను అరిచాడు: "నేను నా వాన్ ప్రాంతా నికి వెళ్లలేనప్పుడు, నేనిక ఎక్కడి కెళ్లగలను రసూల్ భాయ్?"

ఆడాళ్ళు హడావిడిగా గదిలో కొచ్చారు. ఆవేశం తట్టుకోలేని సిరూన్, ఏడుపు నాపుచేసుకొనేందుకని తన వేళ్ళు కొరుక్కుంది. సార్గిస్ తన భార్య వార్సెనిక్ దారికి అడ్డంగా గుమ్మంలో నిలబడ్డాడు ఖాచాతూర్....

తన కోసం దానిమ్మ రసం తెచ్చిన తన పెద్ద కోడలు సాతెనిక్‌తో "తీసుకుపో" అన్నాడు గెగామ్. ఆమె ఆ లోటాని బాల్కనీ మీదుగా బయటకు విసిరేసి, "మిగిలిన వాళ్లందరి కన్న నేను పనికిమాలిన దాన్ననా మీ ఉద్దేశం!" అంటూ ఉక్రోషం వెళ్ల డించింది.

"సాతెనిక్!" అంటూ ఆమె భర్త ఖాచాతూర్ ఆమెను మందలించాడు.

ఆమె తన రెండు పిడికిళ్లూ పిర్రల మీద పెట్టుకొని "ఈ యింట్లో గెగామ్-ఐరిక్ తర్వాత నేనే పెద్దదాన్ని తెలుసా!" అనబోయింది, కాని సరిగా అదే క్షణంలో, ఖాచాతూర్ తన కళ్లలో నిప్పులు గక్కుతూ "నీ నాలుక పీకి పారేస్తాను!" అని గర్జించాడు.

వార్సెనిక్ సిరూన్‌ని మెట్ల మీదుగా కిందకి తీసుకెళ్లింది. సాతెనిక్ వాళ్లని అనుసరించింది. ముగ్గురాడాళ్లూ నూతి పక్కన కూర్చున్నారు. నూతి అడుగు నుంచి పైకొస్తున్న బాధాకరమైన తేమా, ఆ నీటి నుంచి పైకి లేస్తున్న చిత్తడి నిశ్శబ్దమూ వాళ్లని సన్నిహితులను చేస్తున్నట్లున్నాయి. వాళ్ల ముగ్గురిలో ఎవరి సొంత జీవితం వాళ్లకుంది, కాని వాళ్లు ముగ్గురూ తోడి కోడళ్లు, ఈ ప్రపంచంలోని ఏ శక్తీ కూడా వాళ్లని విడదియ్యలేదు. వాళ్ల భర్తలు కూడా మౌనంగా సిగరెట్లు కాల్చుకొంటూ ఒకరి సరసన మరొకరు కూర్చున్నారు. ఉన్నతమైన ఆకాశం నీలంగా ఉంది, పొరుగు వాడైన గార్సెవాన్ పెంపుడు పావురాలు ఆకాశంలో చక్కర్లు కొడుతున్నాయి.

తుతీ అతని ముందు కొచ్చింది, ఆమె కళ్లు అదే పనిగా దేని కోసమో అర్థిస్తున్నట్లున్నాయి.

దారి తప్పి పోయిన జింక పిల్ల చూపు అది. వాన్ వానులిద్దరు, బాగా అలసిపోయిన వాళ్లు, ఒకరి నొకరు కలుసుకున్నప్పుడు అలాగే మౌనంగా నిలబడిపోతారు. వాళ్ల నిశ్శబ్దం, యీ ప్రపంచపు సమస్త శబ్దాన్నీ కలకలాన్నీ చీల్చివేస్తుంది. అదిగో, అలా కలుసుకున్నారు వాళ్లిద్దరూ.

అది వసంత రాత్రి, వర్షం కురుస్తోంది. ఎవరో పెండిమర తలుపు తట్టారు. ఎవరై యుంటారబ్బా?

"ఎవరది?" అంటూ అరిచాడు గెగామ్. "చెడు తలపుతో వస్తే, వెళ్లిపో! లేక పోతే, తలుపు తీస్తా."

బదుల్లేదు, కాని, తలుపు తట్టడం మాత్రం ఆగలేదు. నిజానికి, తలుపు తట్టేదెవరో గాని, తలుపు బద్దలు కొట్టేస్తారన్నంత గట్టిగా బాదేస్తున్నారు. గెగామ్ గోడకి తగిలించి వున్న తన గొడ్డల్ని చేతిలోకి తీసుకుని, తలుపు తెరిచాడు. అబ్బే, అది దయ్యం కాదు. వర్షంలో తడిసి ముద్ద అయిపోయిన జిప్సీ యువతి. పచ్చని కళ్లు, కనుబొమల మధ్య పచ్చ బొట్టు, పచ్చని దుస్తులు ధరించి వుంది. ఆమె ఒక చేతిని తన రొమ్ము కదుముకొని, మరో చేత్తో బయటి చీకట్లోకి చూపిస్తూ లోపలికి పరుగెత్తుకొచ్చింది. అవతలి గట్టు మీద నీలం పాంట్లు ధరించిన తుర్కులు నిలబడి వున్నారు. వాళ్లల్లో ఒకడు అరిచాడు. "ఏమయ్యోయ్! ఆ పిల్లని బయటకి తోలెయ్యి, లేకపోతే నీ యిల్లంతా సర్వ నాశనం చేస్తాం!"

గెగామ్ జవాబుగా యిలా అరవాలనుకున్నాడు, "చేతనైతే చెయ్యండి మాద్దాం! రేయ్, మీ సంగతి నాకు బాగా తెలుసులే పొం(డా బాడుఖావుల్లారా! ఎవర నుకుంటున్నారో, యిది వాన్ నరుకురా. మీరక్కడ మా యింటిని నాశనం చెయ్యడం, ఖాచాతూర్-ఐరిక్‌ని కాల్చి చంపడం, నా చెల్లెళ్లని వేల మాళిగలోకి యీడ్చు కెళ్లడం నేను చూశానురా."

కాని యిదంతా అతను చెప్పగలిగాడా?

అందుకు బదులుగా తన గొడ్డల్ని ఊపుతూ, అతనిలా అరిచాడు, "రేయ్, నా యింటి జోలికి రం(డా చెప్తాను మీ సంగతి! మీ పేగులు తీసి మెళ్లో వేసుకోకపోతే చూడండి. నా యింటి జోలికి రావడం మీక్కాదు కదా, మీ తాతల తరం కూడా కాదురా!"

అవతలి గట్టు మీదున్న వాళ్లు గుమికూడి, తమలో తాము గుసగుసలాడుకున్నారు. వాళ్లలో ఒకడిలా అరిచాడు, "ఆ సంగతేమిటో మేం గుర్తు పెట్టుకుంటాంలేవోయ్!"

భీత హరిత నేత్రాలు, కముబొమల పందువ పచ్చ బొట్టు, పచ్చని దుస్తులు కలిగిన జిప్సీ యువతి గోడకి కరుచుకు పోయింది. గెగామ్, తన కళ్లని తాను నమ్మ లేనట్టు, ఆమె వంక మరింత పరిశీలనగా చూశాడు. తర్వాత అతను తలుపు గడియ పెట్టాడు, బండపై పరచిన తన ఫెల్టు అంగరఖా వంక చూపించి, "కూర్చో అమ్మాయ్. భయపడకు. నీకెవరూ యిక హాని చెయ్యరులే. నీదే ఊరు?"

జిప్సీ యువతి అడ్డంగా తలూపి, వేళ్లతో తన పెదవుల వంక చూపింది.

"పాపం, భయం కొద్దీ మాట్లాడలేక పోతున్నట్టుంది" అనుకున్నాడతను.

ఈలోగా, పిండిమర రాళ్లు గుంయ్‌మంటూ అదే పనిగా రొద చేస్తున్నాయి, వర్షం విల్లో చెట్లని మోదుతోంది, అసలు ఎప్పటికైనా తెల్లారుతుందా అనిపిస్తోంది. ఆ యువతి తను కూర్చున్న చోట కూర్చున్నట్లే ని(ద పోయింది. గెగామ్ ఆమెను చేతుల్లో కెత్తుకుని, మంచం మీద పడుకో పెట్టాడు. నానిపోయిన ఆమె దుస్తుల్ని తీసేద్దామనుకున్నాడు గాని, ఎక్కడ లేని బిడియమూ ముంచు కొచ్చిందతనికి. దానికి బదులు, తన ఫెల్టు అంగరఖా తెచ్చి ఆమెకు కప్పాడు....

... విన్న తాలూకా అధ్యక్షుడ్ని తను కలుసుకోవడం గురించి గాని, తామిద్దరూ ఏం మాట్లాడారన్న విషయం గాని గెగామ్-ఐరిక్ గుర్తు చేసుకోలేకపోయాడు. ఈ ఉదయం, "తోటలు చూడటానికెప్పుడొస్తావ్, గెగామ్?" అని తనని అడిగిందెవరబ్బా అతనికి జ్ఞాపకం రాలేదు.

కాని, ఆ వసంత కాలపు వాన రా(త్రి జరిగిన (ప్రతి ఘటనా, తన మిల్లులో ఏ మూల ఎంత మందాన దుమ్ము పేరుకుందన్న దానితో సహా గెగామ్ గుర్తు చేసుకోగలిగాడు.

చివరి కెలాగైతేనేం తెల్లవారింది. రాత్రి పూట, తమలోని ప్రతి ఒక్క నీటి బొట్టునీ ఒడ్చేశాయేమో నన్నట్లు, మబ్బు లిప్పుడు మాయమయ్యాయి. గెగామ్ ఆవ రణలో అటూ యిటూ తిరిగాడు. వానకి తడిసి వంగిన విల్లో చెట్టు వానలో నాని ముద్దైన అమ్మాయి లాగే కంపిస్తోంది. తర్వాత బురదనీటి వంక చూశాడు. ఆ తర్వాత ఆరు వందల తుమాన్లు ఖరీదు చేసిన తన సర్వస్వం అయిన మిల్లు వంక చూశాడు. అప్పుడతను తన వాన్ ప్రాంతాన్ని సంస్మరించుకున్నాడు.

"ఖాచాతూర్-ఐరిక్ నీ షెడ్డులో గొడ్డలినీ, ద్రాక్ష సారానీ కాకుండా నువ్వొక మంచి రైఫిల్ని పెట్టుకుని ఉండాల్సింది!" గెగామ్ బిగ్గరగా అనుకున్నాడు.

నది ఒడ్డు వెంబడి ఓ జిప్సీ స్త్రీ నడిచి వెళ్తోంది.

"నమస్కారం భాయ్" అంటూ ఆమె గెగామ్‌ని సమీపించింది. "ఆ అడివి జంతు వుల్నుంచి మా పిల్లని కాపాడినందుకు నీకు కోటి దణ్ణాలన్నా."

"అయితే, ఆమె నీ కూతురన్న మాట?"

"ఔనన్నా, నా ఒక్కగా నొక్క కూతురు."

"పాపం, భయంతో బిక్కచచ్చిపోయి మాట్లాడలేకపోతోంది."

ఆ స్త్రీ విషాదంగా మందహాసం చేసింది. "అది చెవిటిదీ, మూగదీను. అందుకని మాట్లాడలేదు."

"ఓహో, అదా సంగతి. ఆమె తండ్రి లేడా?"

"ఆయన దక్షిణాది కెళ్ళి, మరి తిరిగి రాలేదు."

గెగామ్ ఈ విషయం ఆలోచించాడు. తర్వాత అడిగాడు, "మరైతే నువ్వెందు కొచ్చావిక్కడికి?"

"నేనా? నేను నా కూతురు కోసమొచ్చాను. మేము గుడారాలెత్తేసి, దక్షిణాది కెళ్ళి పోతున్నాం."

"ఎందుకని?"

"పని కోసం. ఇక్కడ మా జిప్సీలకింకేం పని లేదు, అక్కడ నల్లమందు మామూళ్ల రోజులు."

"నీ కూతురు పేరేమిటి?"

"తుతీ."

సరిగా అప్పుడు పిండిమర తలుపు కిర్రుమంటూ తెరుచుకుంది. తుతీ బయట కొచ్చింది, తన తల్లిని చూసి, వెనక్కెళ్ళి గోడకి కరుచుకు పోయింది. ఆమె ఒక చేత్తో తన రొమ్మును అదుముకుంటూ, రెండో చేతిని "రాను! రాను!" అన్నట్లు జోరుగా ఊపుతోంది.

ఆమె తల్లి ఆమెకు నచ్చచెప్పింది, కాని, తుతీ తిరిగి తన చేతులు అడ్డంగా ఊపసాగింది.

"ఆ పిల్లకి నీతో రావడం యిష్టం లేదు" అన్నాడు గెగామ్.

"ఆ విషయం నాకూ అర్థమైంది. కాని నేనేం చేసేది? దాని రోజులు బాగా లేవు. ఆ మృగాలు మళ్లీ దాన్ని చూశారంటే దాని కింక యీ భూమ్మీద నూకలు చెందుకున్నట్లే."

"నేనామెని వాళ్ల చేతికి చిక్కనివ్వనులే, ఆమె జోలికొస్తే ఒక్కొక్కడికి కపాల మోక్షమే!" కోపంగా అన్నాడు గెగామ్. "ఆమెని యిక్కడే ఉండనియ్యిలే. ఇంట్లో పని పాటలు చేస్తూ వుంటుంది. ఏమో ఎవరికెరుక, ఆమెని పెళ్లిచేసుకునేందుకు ఏ పశుల కాపరో, మరొకరో యిష్టపడి ముందుకు రావచ్చు. ఆమె అందగత్తె."

ఆ జిప్సీ స్త్రీ మరోమారు విషాదంగా నవ్వింది. "ఈ చెవిటి మూగ పిల్లని ఎవరు పెళ్లాడుతారు బాబూ?"

ఆమె రుమాలుతో తన కన్నీళ్లు తుడుచుకుని చివరకి వెళ్లిపోయేందుకు బయల్దేరింది.

"ఇదిగో ఆగమ్మాయ్" అంటూ గెగామ్ అరిచాడు. తన బెల్టున వున్న డబ్బుల సంచిలోంచి నలిగి పోయిన యిన్ని నోట్లు పైకి తీసి, "ఇవిగో వీటిని తీసుకెళ్లు నువ్వు చాలా దూరం వెళ్లాలి కదా, ఈ సొమ్ము ఉపయోగపడుతుంది" అంటూ ఆమె కివ్వబోయాడు.

"అబ్బే, అక్కర్లేదన్నా, నా దగ్గర సరిపడ డబ్బుంది."

ఆమె మళ్లీ ముందుకి కొన్ని అడుగులేసి, అంతలోనే వెనక్కి తిరిగివచ్చి, నీలం రాయి వున్న సన్నటి బంగారు ఉంగరాన్ని తన వ్రేలి నుంచి ఊడదీసి, "చూడన్నా, దేవుడు మేలు చేసి, తుతీకి పెళ్లి జరగచ్చు. అప్పుడీ ఉంగరం దానికియ్యి. పెళ్లి జరక్కుండానే అది చచ్చిపోతే, దీన్ని దాని సమాధిలో పెట్టు" అంది.

గెగామ్ తలొంచుకొని, వేదనాభరితమైన ఆలోచనలతో, తానలా ఎందుకు వెళ్తున్నాడో తనకే తెలియని స్థితిలో ఆమె వెంటే వెళ్లాడు, విల్లో, పొప్లార్ చెట్ల బారులు ముగిసిన చోట ఆగిపోయి, అతనొక బండ మీద కూర్చున్నాడు. జిప్సీ స్త్రీ కనుమరుగైంది. అతనక్కడ అలాగ చాలా సేపు కూర్చుండిపోయాడు. అతని మనస్సులో అనేక ఆలోచనలు దొర్లిపోయాయి. అవన్నీ కూడా భగవంతుని చేత లోపభూయిష్టంగా సృష్టింపబడి, మనం నివసిస్తున్న యీ ప్రపంచాన్ని గూర్చినవే. అతని ఆలోచనలన్నీ కలగూర గంపలా వున్నాయి, అలా వచ్చి మరు క్షణమే యిలా పోతున్నాయి. "మా తప్పేముంది? మా గృహాలెందుకు తగలబెట్టబడ్డాయి? మా స్త్రీ లెందుకు ఎత్తుకుపోబడ్డారు? మా మగా

ళ్లెందుకు చంపబడ్డారు? మేమిలా ప్రపంచం నాలుగు మూలలకీ ఎందుకు చెదరగొట్ట బడ్డాం? సూర్య కిరణమంత అందమైన అమ్మాయి తుతీ ఎందుకిలా చెవిటి మూగ పిల్లగా పుట్టింది? ఈ జిప్సీలు, విరగపూసిన యీ తోటల్నీ, గాలికి సంయ్ సంయ్మని తల ఊపుతున్న యీ విల్లో చెట్లనీ, పాప్లార్ చెట్లనీ వదిలిపెట్టి, నెత్తి మాడ్చే కొలిమి మంటల్లాంటి ఎండల్లో నల్లమందు మామూళ్ల కోసం దక్షిణాదికి ఎందుకు వలసపోవాల్సి వస్తోంది? ఉన్న మాట చెప్పుకోవాలంటే, ఏ బాపతు ప్రపంచ మనుకోవాలిది?''

''పవికిమాలినది!''

అతని స్వరం వినగానే ఆయన కొడుకులు లోపల కొచ్చారు. తన చేతుల్ని తువ్వాలుకి తుడుచుకొంటూ సిరూన్ కూడా వాళ్ల వెంట లోపలి కొచ్చింది.

''పవికి మాలినది!'' గెగామ్-బిరిక్ అన్నాడు. ''పచ్చని తోటలున్నాయి. పాప్లార్లు న్నాయి.... వర్షంలో తడిసి తలలొంచిన విల్లోలున్నాయి.... ఖాచాతూర్!'' అంటూ అరిచాడాయన.

''నేనిక్కడే ఉన్నాను, నాన్నా.''

''అందరూ అవతలకి పొండి. నేను నిద్ర పోవాలి.''

ఒక్క సిరూన్ మాత్రం గది విడిచి బయటి కెళ్లలేకపోయింది. తన ఆలోచనా లోచనం ముందు ఆమె మేరీ మాత చేలాంచలం ముట్టి, ఆమెతో యిలా విన్నవించుకుంది: ''పవిత్ర మాతా, గెగామ్-బిరిక్ని చచ్చిపోనివ్వకు. ఆయన్ని మరి కొంత కాలం బతికించు తల్లీ.''

స్మృతులాయన్ని మళ్లీ గతంలోకి తీసుకెళ్లాయి.

గెగామ్ పిండిమరకి తిరిగి వెళ్లేసరికి వాకిలంతా తుడువబడి, నీళ్లు చల్లబడి వుండటం చూశాడు. తర్వాత... రాత్రులు వసంత కాలపు తుపానులతో నిండి వుండేవి. మెరుపు తీగలు పాప్లార్ చెట్ల పైనా, పిండిమర పైనా పాముల్లా మెలికలు తిరుగుతూ చీకటిలో సుడిదిరిగి పైకి లేస్తున్న పిండి ధూళినీ, తన ఫెల్టు అంగరఖా పరిచిన బండపై కూర్చున్న తుతీ ఆకుపచ్చ కళ్లనీ ప్రకాశంలో ముంచెత్తేవి.

ఆటు తర్వాత వాళ్లిద్దరి మధ్యా ప్రేమ అంకురించింది.

తుర్కులు అవతలి గట్టు మీదకి మరోసారి వచ్చారు. వాళ్లల్లో ఒకడిలా అరిచాడు, ''రేయ్! నువ్వా పిల్లని మాకప్పగించేస్తే మంచిది. లేకపోతే చూసుకో, నీ యిల్లూ, పిండిమరా నేల మట్టం చేసేస్తాం!''

అది సంధ్యా సమయం. మళ్లీ చినుకులు పడుతున్నాయి. పొరుగు గ్రామమైన

గదీమాబాదు నుంచి కొందరు రైతులు గింజలు గాడిద మీద వేసుకుని పిండిమరలో పిండి ఆడించుకునేందు కోసం తీసుకొచ్చారు. గెగామ్ తన చేతులు బారజాపి, నీలం పాంట్లు ధరించిన మనుషుల కేసి తేరిపార చూస్తున్నాడు.

"రండిరా నా యాళ్లల్లారా!" అంటూ అతను అరిచాడు. "రండి, నా తడాఖా చూపిస్తా!"

వచ్చిన రైతుల్లో ఒకడు ముసిలాడు. ఏ కారణం వల్లనైతేనేం, అతను కూడా వాన్ ప్రాంతం నుంచి వచ్చిన వాడే అయ్యుంటాడని గెగామ్ నిశ్చయించుకున్నాడు. అతను అలసిపోయినట్లూ, దిగాలు పడి వున్నట్లూ కనిపించడం, అస్తమానం తన భుజాల మీదుగా వెనక్కి చూస్తూ వుండటమే బహుశా యిందుక్కారణమేమో. అసలు మనుషులు ఎందుకని వెనక్కి చూస్తూ వుంటారు? ఇంతకీ, భగవంతుడి భూమి గుండ్రంగా వుంది, నువ్వెంత వెనక్కి వెనక్కి చూసినా కూడా, చివరకి నీ ప్రయాణాంతంలో నువ్వు నిన్ను మాత్రమే చూసుకోగలుగుతావు.

అయితే యింతకీ, ముసిలాడు ఆర్మీనియనూ కాడు, వాన్ ప్రాంతం నుంచి వచ్చిన వాడూ కాడు. మిగిలిన రైతులతో బాటు అతనూ తన గింజలు పిండి పట్టించుకోవ డానికి తెచ్చాడంతే. అతనో చెట్టు కింద చదికిలబడి, కొంచెం పొగాకు చేతిలో వేసుకుని జాగ్రత్తగా నలిపి, దాన్ని పైపులో కూరి, నిదానంగా అంటించి, తాపీగా నీలం పొగ మేఘాలు వదల సాగాడు.

"జనం చుట్టూ ఆకలిగొన్న కుక్కల్లా అలంగం తిరుగుతారెందుకురా?" అంటూ ముసిలాడు అవతలి గట్టు మీదున్నవాళ్ల నుద్దేశించి అరిచాడు. "మీ సొంత పనిపాటలూ, పెళ్లాం బిడ్డల సంగతులూ చూసుకుని ఏడవరేంరా, పందికొక్కుల్లారా!"

తుర్కులు పకపక నవ్వారు, కాని చివరకి అక్కణ్ణుంచి వెళ్లిపోయారు.

గెగామ్ పిండిమర చూసుకుంటూండేవాడు. తుతీ పిండి ఆడే చోట కూర్చునేది. "కూలిపోవడానికి సిద్ధంగా వున్న తన యీ చిన్న ప్రపంచాన్ని ఆరు వందల తుమాన్లకి నాకు అమ్మిన రసూల్ యిప్పుడెక్కడున్నాడో!" ముసలి రైతు తల పైగా దూరంలోకి చూస్తూ అనుకున్నాడు గెగామ్. "ఈ ప్రపంచంలో ఒంటరిగా ఉండకపోవడం ఎంత చక్కని విషయం. రసూల్ ఉన్నాడు, గదీమాబాద్ నుంచి గింజలు తెచ్చిన ముసిలా డున్నాడు, ప్రపంచంలోని శబ్దాలను దీర్ఘమైన కనుబొమలతో వినే ఆకుపచ్చ కళ్ల తుతీ వుంది."

వసంతం ముగియవస్తోంది. బాదం చెట్ల పూత అయిపోయింది. గెగామ్ పిండిమర మిద్దె మీద పడుకున్నాడు. ఓ రోజు రాత్రి అతనికి నిద్ర పట్టలేదు. ఆకాశంలో నక్ష

త్రాలు ఒక దాని వంక మరొకటి కన్నుగీటుతున్నట్లున్నాయి. నది అవతలి ఒడ్డున దూరాన బాగా త్రాగిన ఒక పకీరు పాడుతున్నాడు:

“గూటికెళ్లే మార్గమేదో
ఎలా తెలియుదు నన్నయా?”

ఆ రోజున ప్రతిదీ స్ఫటిక స్వచ్ఛంగా, తేలికగా, బుసబుస పొంగులు వారుతున్నట్లుంది. గెగామ్ నది దగ్గర కెళ్లి శుభ్రంగా స్నానం చేశాడు. పిండిమరకి తిరిగొచ్చి, ట్రంకు పెట్టెలోంచి ఓ నల్ల పాంటూ, ఓ తెల్ల చొక్కా తీసుకు తొడుక్కున్నాడు. తలకీ, మీసాలకీ పన్నీరు పట్టించాడు. తుతితో “పద పట్నం పోయి వద్దాం. అక్కడో పని వుంది” అన్నాడు.

వాళ్లిద్దరూ కాలినడకన బయల్దేరారు. వెండిలా మెరిసే తెల్లని చెట్ల క్రింద నడిచి నడిచి కగుబ్-వాన్ చేరుకున్నారు. జూలై మాసపు ఎండ దుమ్ముకొట్టుకున్న ఆకుల గుండా చొరుచుకు వస్తూ, మత్తెక్కించే చెట్ల సువాసనను మరింత పెంచుతోంది.

గెగామ్ తుతిని పోజీ పాలీ అంగడికి తీసుకెళ్లి, అక్కడి ఆడ గుమాస్తాతో, “నేను ఊళ్లో పనులు చూసుకొని తిరిగి వచ్చే సరికి ఈమెకి అన్నీ కొత్త దుస్తులు వచ్చేవి ఎంపిక చెయ్యాలి” అని చెప్పాడు.

తర్వాత అతను క్రగమాన్-ఖాన్ సారా అంగడి కెళ్లాడు. క్రగమాన్ గవ్వలు గిలకరించి వేస్తూ, పులిజూదం ఆట ఆడుతున్నాడు. గెగామ్ రెండు ద్రాక్ష సారా సీసాలు తెమ్మని పురమాయించాడు. ఒకటి గటగట తాగి ఖాళీ చేసి, రెండోది ప్రక్క టేబిలు మీద పెట్టి, అక్కడున్న అందరికీ శుభాకాంక్షలు తెలియజేసి వాకిలి కేసి వెళ్లాడు. గడప దగ్గర ఆగి, తన పైపు ముట్టించుకొని, మేఘ నిర్ముక్తంగా ఉన్న ఆకాశం వంక చూసి రొమ్ము మీద మూడు సార్లు శిలువగుర్తు వేసుకున్నాడు. ఓహ్! సరిగా మా వాన్ ప్రాంతంలో లాగే ఎంత మనోజ్ఞంగా ఉంది ఉదయం! అనుకున్నాడు.

తుతి ఆకుపచ్చ రంగు కొత్త దుస్తులు ధరించింది. నున్నగా దువ్వబడిన ఆమె జుట్టు వదులుగా భుజాలపై వేలాడుతోంది. ఆమె ఆకుపచ్చని బూట్లు ధరించింది. ఆమె ముఖానికి లేత గులాబిరంగు పౌడరు అద్దబడింది. ఆమె ఒంటి పైనా, జుట్టు పైనా పన్నీరు చిలకరించబడింది. గెగామ్ తన డబ్బునంచి పైకి తీసి, గుప్పెడు నాణాలు బిల్ల మీదకి విసిరాడు.

వాళ్లిప్పుడిక ఫుట్ పాత్ వెంట నడుస్తున్నారు. గెగామ్ తన చేతులు వెనక్కి కట్టు

క్రొవి ముందు నడుస్తున్నాడు. చర్చి ముందు ఆగి, అక్కడే ఉండమని తుతికి సంజ్ఞ చేసి చెప్పి, అతను లోపల కెళ్లాడు.

ప్రార్థన పూర్తి కాగానే గెగామ్ తనపై శిలువగుర్తు వేసుకొని, మతగురువు హొవానెస్‌ని సమీపించాడు.

"భగవంతుని సన్నిధానానికి నువ్వు వచ్చి చాలా రోజులై పోయింది వాన్ ప్రాంతపు గెగామ్" అంటూ మతగురువు హొవానెస్ తన గడ్డం సందులోంచి గొణిగాడు. "నేను నిన్ను క్షమిస్తాననుకో, భగవంతుడు క్షమించడు."

"భగవంతుడు దయామయుడు" అని జవాబు చెప్పి, చుట్టూ కలియచూశాడు. చర్చి యిప్పుడు ఖాళీగా వుంది. ఉపగురువు క్రొవ్వొత్తులు మలిపేస్తున్నాడు.

"ఓ, ఏదో పని మీ దొచ్చినట్లున్నావే, ఏమిటి సంగతి?"

గెగామ్ తల వంచి లోగొంతులో చెప్పాడు: "నేను చర్చిలో పెళ్లి చేసుకోవాలను కుంటున్నాను, ఫాదర్."

"మంచి పని చేస్తున్నావు, మిల్లర్ గెగామ్. ఇప్పటికే ఆలస్యమైందేమో కూడా! పెళ్లి కూతురు క్రాగామాన్ కూతురేనా?"

"కాదు."

"రతియో చెల్లెలా?"

"ఊహూ."

"హుం. అయితే షాగేర్ అయ్యుంటుంది, ఔనా?"

"కాదు. ఆమె క్రిస్టియను కాదు. ఆమె జిప్సీ పిల్ల. నేనామెని పులి నోట్లోంచి విడిపించాను, యిప్పుడామెని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను."

హొవానెస్ నిర్వాక్కయాడు.

"నీ మతమేమిటి గెగామ్?"

"మతమా?"

"పోనీ, నువ్వు ఏ జాతి వాడివి?"

"నేను ఆర్మీనియన్‌ని. నేను వాన్ ప్రాంతానికి చెందిన వాడిని, క్రిస్టియన్ని."

"ఈ లోకంలో నీకు క్రిస్టియన్ పిల్లలే కరువైపోయారా?"

మలపబడిన క్రొవ్వొత్తి నుంచి పైకి లేస్తున్న తెల్లని పొగ రింగులు చుట్టుకోవడం చూస్తున్నాడు గెగామ్. తన భుజంతో చర్చి తలుపు నెట్టుకొని వీధిలో కొచ్చాడతను. తుతి వంక చూశాడు, తర్వాత చర్చి గోడల వంక చూశాడు, శిలువ గుర్తు వేసుకున్నాడు. "ఫాదర్ హొవానెస్ మంచివాడు కాడు" అనుకున్నాడతను, "అంత మాత్రాన చర్చి మంచిది కాదని అర్థం కాదు."

"రా పోదాం."

వెండిలా మెరిసే తెల్లని చెట్ల క్రిందుగా వాళ్ళిద్దరూ కాలి నడకన మళ్ళీ బయల్దేరారు. జాలై సూర్యుడు, వేడిని వెలుగుని నేలపై ప్రసరిస్తూ, ఆకాశంలో పైకి లేచాడు. గెగామ్ బరువైన పాదాల క్రింద రోడ్డు అణిగిపోతున్నట్లు కనిపిస్తోంది.

"మనం వెనక్కి వెళ్ళే సరికి పర్వతాలు నీలం రంగుకి తిరుగుతాయి" అనుకున్నాడతను.

వాళ్ళు తిరిగి వస్తూంటే సంజకాంతులు పర్వతాల వెనక క్రమంగా అదృశ్యం కాసాగాయి.

గెగామ్ పర్వత శిఖరాల వంక తేరిపార చూశాడు. చరియల మీద పెరిగిన నల్ల వాక పొదల మధ్యగా పోయే యిరుకు త్రోవల్లో ఎక్కడో దారి తప్పి, భయోత్పాతంతో తమ తల్లుల్ని వెదుక్కొనే జింకపిల్లలు తిరుగాడుతూ, ఉంటాయనిపించింది అతనికి.

నది సంజచీకట్లకు నల్లబడింది. సాయంకాల మందమారుతం తాకిడికి విల్లో కొమ్మలు నీళ్ళలో మునుగుతున్నాయి, పాప్లర్ చెట్లు పరస్పరం సన్నిహితంగా వస్తున్నాయి.

"రా మిద్దె మీదకి పోదాం" తుతితో గెగామ్ అన్నాడు. "ఈ రోజు పిండి ఆడేందుకు గింజల్లేవు. విసురురాళ్ళని కాస్త విశ్రాంతి తీసుకోనియ్యి."

ఊగిసలాడే నిచ్చెన మెట్లెక్కి వాళ్ళు మిద్దె పైకి చేరుకున్నారు. గెగామ్ తన డబ్బు సంచి తీసి, అందులోంచి చిన్న నీలంరాయి పొదిగిన బంగారు ఉంగరాన్ని పైకి తీశాడు. తుతి తన ఉంగరంవేలు ముందుకి చాపి, తన తలను అతని ఛాతీపై ఆన్చింది. ప్రపంచంలోని సర్వ భాషల్లోనూ "నేను నీదాన్ని, నా సర్వస్వం నీది" అని తన చూపుల ద్వారా చెప్పింది ఆ మూగ చెవిటి పిల్ల.

వెన్నెల కవ్వ పర్వతాల వెనక నుంచి బయట కొచ్చి, అన్నింట్లోకీ ఎత్తుగా వున్న పాప్లర్ చెట్టుకి హత్తుకుంది....

"దైవకృప వల్ల 1931లో ఖాచాతూర్ పుట్టాడు" తన బైబిలు లోపలి అట్ట పైన గెగామ్ రాశాడు. తర్వాత తన నవజాత పుత్రుని పైన మూడు సార్లు శిలువ ముద్ర వేశాడు.

"పార్గిన్ 1933లో పుట్టాడు."

"సంబాత్ 1935లో పుట్టాడు."

"దైవ నిర్ణయం మేరకు, గాంధర్వ పద్ధతిలో పెళ్ళి చేసుకున్న నా భార్య తుతి, 1936లో ఈ లోకం విడిచిపెట్టింది. పురోహితుడూ లేడు, ఆమె పేర ప్రార్థనా లేదు. మేమామెని సోమవారం రోజున నిరాడంబరంగా ఖననం చేశాము."

"1939 వేసవి చివరి మాసంలో, ద్రాక్షసారా మొదలైన వస్తువులు కొనుక్కురా వడానికని నేను నా కొడుకుల్ని తీసుకుని కగుజ్-వాన్ కెళ్ళాను. మేము తిరిగి వచ్చేసరికి మా పిండిమర నేలమట్టం చెయ్యబడి వుంది. నీలం పాంట్లు ధరించిన తుర్కులు దాన్ని నాశనం చేశారు."

"మాకు టెహరాన్‌లో మిల్లర్ రమూల్ కనిపించాడు. అతను చిత్తుగా తాగి కాలవ ఒడ్డున కూర్చుని నీళ్ల కేసి గుడ్లప్పగించి చూస్తున్నాడు, బహుశా తన పిండి మరను గురించే ఆలోచిస్తున్నాడేమో, నేనతనికి 5 తుమాన్లిచ్చి 'నష్ట జాతకుడివైన రమూల్ భాయ్, నేను నా బిడ్డల్ని తీసుకుని నా మాతృదేశానికి తిరిగి వెళ్తున్నాను' అని చెప్పాను."

"1946 జూలైలో మేము స్వర్గసమానమైన మా ఆర్మేనియా తల్లి ఒడిలోకి చేరుకునేందుకు బయల్దేరాం."

ఆ పేజీలో అంతకన్న మరి చోటు లేదు. అందుకని గెగామ్ మిగిలిన వాక్యాలను మార్జిన్లలో రాశాడు. తన కొడుకుల పెళ్ళిళ్ల తేదీలను, తన మనుమలు, మనుమరాండ్ర పుట్టిన తేదీలనూ రాశాడు. మార్జిన్లు కూడా నిండిపోయాక అతను మరేమీ రాయలేదు.

"ఖాచాతూర్ బిడ్డా, గెగామ్, నువ్వు జ్ఞాపకం చేసుకోవలసినవి బోలెడు విషయాలున్నాయి" అనుకున్నాడు గెగామ్-ఐరిక్. "నువ్వీ విశాల ప్రపంచంలో దీర్ఘ కాలం పయనించావు, కాని నువ్వెన్నడూ ఎవరినీ బాధించలేదు. నువ్వొక మూగ, చెవిటి జిప్సీ పిల్లని పెళ్లి చేసుకున్నావు, ఆమెతో ఆరేళ్ళ కాపురం చేశావు. ఫాదర్ హోవానెస్, ఆయన ఆత్మకి శాంతి కలుగుగాక, పెద్దవాడే అనుకో, మన పెళ్లి చట్ట విరుద్ధమని అన్నాడే అనుకో, కాని భగవంతుడు మాత్రం అలా భావించలేదు. పైగా, మనకి ఒడ్డూ పొడుగూ గలిగిన ముగ్గురు జమాజెట్టీల్లాంటి కొడుకుల్ని, ముగ్గురు అందమైన కోడళ్లని, అయిదుగురు మనవలూ మనవరాళ్లనీ ఆయన ప్రసాదించాడు.

"ఇది చాలదా ఫాదర్ హోవానెస్?"

గెగామ్-ఐరిక్ కళ్ళు తెరిచాడు, కర్టెన్ల వెనక అతనికి మళ్లీ మృత్యుదేవత కనిపించింది. నిలబడి వున్న దాని చేతుల్లో, ఒక దానిలో విల్లో కొమ్మా, మరో దానిలో కొడవలీ ఉన్నాయి.

"నేనొచ్చాను, గెగామ్...."

"ఖాచాతూర్-ఐరిక్ చేసినట్లే నేను నా విధి నిర్వహించాను" అన్నాడు గెగామ్. "పరలోకంలో తుతీ నా కోసం నిరీక్షిస్తోందని నువ్వు చెప్పేమాటైతే, నేను వస్తాను. కాని, దురదృష్టవంతుడైన మా రమూల్ భాయ్‌కి ఏం సంభవించిందో నాకు తెలియదు.

అంతులేని యింత పెద్ద ప్రపంచంలో కొందరు కొందరు తమదంటూ ఒక స్థానం సంపాదించుకోలేరెందుకనో!"

గెగామ్-ఐరిక్ తన కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. అతని బుగ్గల వెంట కన్నీళ్ళ ధారలు కట్టాయి.

అది మే మాసం. పగటి పూట వెలుతురు బాగా వుంది. తన మాతృదేశమైన ఆర్మీనియాలో, మెగ్రి నగరంలో, తన కొడుకులు, కోడళ్ళు, మనుమలు, మనుమ రాళ్ల మధ్య, మిల్లరు ఖాచాతూర్ కొడుకైన మిల్లర్ గెగామ్, జోరాంబ్ప్ గడ్డపైన పుట్టిన గెగామ్ వెనకున్న తలగడల పైన ఒరిగిపోయాడు.

వార్దైర్ ఆదాల్యాన్

వార్దైర్ ఆదాల్యాన్ 1936లో సింఫెరోపోల్‌లో జన్మించాడు. ఎరెవాన్ విశ్వవిద్యాలయ భాషాతత్వశాస్త్ర విభాగం నుంచి 1958లో పట్టా తీసుకున్నాడు.

ఆయన తొలి కథ "పయనీర్" అనే ఆర్మీనియన్ మేగజైన్‌లో ప్రచురింపబడింది. దాని తర్వాత ఆయన తొలి కథా సంపుటి "వెను తిరిగి చూడకు" (1963), పిల్లల కోసం రచించిన "మాంసపు బూరెలు" అనే పుస్తకమూ వెలువడ్డాయి. ఆదాల్యాన్ 1965లో "నిప్పులు చెరిగే వేసవి," 1967లో "అరగాత్స్ హిమ సమూహాలు" అనే కథా సంపుటమూ ప్రచురించాడు.

ఒంటెలు వెళ్ళిపోతాయి, పర్వతాలు ఉండిపోతాయి

అనగా, అనగా, చాలా కాలం క్రితం, ఈ భూమి మీద ఓడలూ, విమానాలూ, మోటారు కార్లు కన్న ఒంటెలు ఎక్కువగా ఉండేవి. పట్నం నుంచి పట్నానికీ, గ్రామం నుంచి గ్రామానికీ, దేశం నుంచి దేశానికీ కూడా ప్రజలు ఆ రోజుల్లో ఒంటెల పైనే ప్రయాణం చేస్తూండేవారు. వాళ్ళు తమ ఒంటెల పైన అధిరోహించి తమ శత్రువులతో పోరాటాలు జరిపేవారు, వాళ్ల ఒంటెలు వాళ్ల శత్రువుల్ని నేలనేసి మట్టుతూండేవి.

ఒంటెల వ్యాపారం ఆ రోజుల్లో గౌరవప్రదమైన వృత్తిగా ఉంటూండేది. ఒంటెల అమ్మకాలూ, కొనుగోళ్లూ విరివిగా జరుగుతూండేవి. ఒంటెలు ఒక దానిపై మరొకటి పురికొల్పబడుతూండేవి, అవి ధూళి మేఘాలు లేపుతూ పోట్లాడుతూంటే జనం పరదాగా వేడుక చూస్తుండే వారు.

క్రమంగా కొంత కాలానికి ఒంటెల ధర పడిపో నారంభించింది. ఒంటె గాడిద కంటె కూడా చౌక అయిపోయింది. త్వరలోనే ఓ బస్తా ధాన్యంతో, ఓ గంపెడు యాపిల్సుతో ఒక ఒంటెను కొనగలిగిన పరిస్థితి ఏర్పడింది. ఇది ఎవరికీ ఆశ్చర్యం కలిగించేది కూడా కాదు.

ఈ రోజుల్లో ఒంటె, దిక్కుమాలిన, చావు మూడిన ఒంటె సర్కస్‌లోనో, జంతు ప్రదర్శనశాలలోనో మాత్రమే కనిపిస్తుంది.

ఆధునిక బాలకునికో, బాలికకో ఒంటె ఎముకను కనక ఎవరైనా చూపిస్తే యిదేదో పూర్వకాలపు మహాగజానికో, లేక డినొసార్‌కో చెందిన ఎముక అనుకుంటారు, అంత అసాధారణంగా, వింతగా, విడ్డూరంగా ఉంటుందది.

ఒకానొక రోజున చాలా కాలంగా విస్మరింపబడి, మానవ స్మృతి పథం నుంచి చెరిపివెయ్యబడిన ఆ ఒంటెలు, పురాతన నైరీ రాజ్యపు తరుణ రాజధానీ నగర వీధుల్లో మరల నడవసాగాయి.

వాటి సాక్షాత్కారం పెద్ద సంచలనాన్ని రేకెత్తించింది. వాటి చుట్టూ ఓ పెద్ద జనసమూహం చేరింది. ఆ గుంపులోని ప్రతి ఒక్క వ్యక్తీ కూడా ఆశ్చర్యోద్వేగాలతో నిండి ఉన్నాడు.

ఆ ఒంటెలు మరి వేటిగానో మారిపోతాయేమోనని భయపడుతున్నట్లు "అవి ఒంటెలు!" అన్నారు కొందరు.

గూని లేకుండా తిన్నని నడుములున్న ఒంటెలు ఎప్పుడైనా ఉన్నాయన్నట్లు "ఇవి గూని ఒంటెలు!" అన్నాడు మరొక ప్రబుద్ధుడు.

"ఇవి పిచ్చి జంతువులు!" అని గొణిగి, ఆ మాటనే తన స్నేహితులతోను, అప రిచితులతోనూ, తనకు తానూ వల్లించి వల్లించి, తన కల్పనను తానే నిజమని నమ్మే స్థితికి చేరుకున్నాడు యింకొకడు.

తను ప్రత్యక్షంగా చూసినంత ధీమాగా అన్నాడు వాల్గోవాడు: "ఎవరో గాని యీ ఒంటెల్లో ఒకదాన్ని, నీ మెడ యిలా వంకరగా ఎందుకుందని అడిగాడు. అప్పుడ దేమందో తెలుసా: 'నా ఆకారమే అంత' అంది."

"ఏమిటేమిటి, నిజంగానే?!" అంటూ ప్రతి ఒక్కడూ అబ్బురపాటు వ్యక్తం చేశాడు. వాళ్ల ఆశ్చర్య విభ్రమాలకు అంతే లేకపోయింది.

ఈలోగా, ఆ ఒంటెలు, మెచ్చికోలు కోలాహలం తమకేమీ పట్టనట్లు తాపీగా, గంభీరంగా ముందుకు సాగిపోయాయి, వాటి మెడలకున్న గంటలు గణగణ శబ్దం చేశాయి.

ఎండ వేడికి రోడ్డు మీద తారు కరిగి చితచిత లాడుతోంది. నిప్పులు చెరిగే ఎండలో పురాతన ప్రాచ్య దీర్ఘగేయం లాగ ఒంటెల బిడారు, దాని కెక్కడా అంతే లేదా అన్నట్లు సాగిపోతోంది.

నగర మధ్యభాగంలో వీధులన్నీ కలిసే చోట ఓ పెద్ద చౌకు ఏర్పడింది. ఈ వీధు లను నడుపుచేసే నియమాలు అనుల్లంఘనీయాలు కదా.

ఎర్రలైటు మారిపోయిన మరుక్షణమే, కాలి నడకన పోయే జనప్రవాహం వీధిని దాట నారంభించింది.

పచ్చలైటు మారగానే కార్ల బారు జంయ్‌మంటూ ముందుకు దూసుకుపోయింది.

పసుపు పచ్చని, ఎర్రని, ఆకుపచ్చనిని లైట్లు వెలుగుతూ, ఆరుతూ వున్నాయి. అందరూ ఆ ట్రాఫిక్ లైట్ల నిటకరింపులను పాలించారు.

అటుతర్వాత, తమ గంటలు గణగణ మ్రోగుతూండగా, ఒంటెలు చౌకుకి వచ్చాయి.

తన అయిదో అంతస్తు బాల్కనీ లోంచి ఒంటెల బిడారును చూసిన గాయిక్ సంభ్రమాశ్చర్యాలతో ఎగిరి గంతేసి, క్రిందకి పరుగెత్త నారంభించాడు. అప్పటికే వివిధ అంతస్తుల్లోని వాటాల తలుపులు దఢాలున మూసుకోవడం, మనుషులు పరుగిడుతున్న అడుగుల సవ్వడీ అతనికి వినవచ్చాయి.

ఆ దృశ్యమెక్కడ కనుమరుగై పోతుందోనన్న భయంతో ప్రతి ఒక్కడూ హడావిడిగా పరిగెడుతున్నాడు.

పిల్లలైతే, యిళ్లల్లోంచి బయటకు దూసుకెళ్లి ఒకళ్లనొకళ్లు నెట్టుకుంటూ, ఒంటెల బిడారు వెంట పరిగెత్తుతున్నారు.

అవి సెలవు రోజులు. స్కూళ్లు మూతపడటంతో నగరంలో పిల్లలదే రాజ్యమన్నట్లుగా ఉంది.

బిడారు మధ్య ఓ క్షణకాలం గందరగోళం ఏర్పడింది. బిడారు అగ్రభాగాన నడుస్తున్న వార్ అనే ఒంటెకు ఏం కోపమొచ్చిందో ఏమోగాని, యిప్పుడది ససేమిరా కదలకుండా మొరాయించి నిలబడిపోయింది. బహుశా గత కొద్ది గంటలుగా తన పట్ల తన యజమాని ప్రదర్శించిన నిర్లక్ష్యం దాన్ని కోపఘూర్ణితురాలిని చేసినట్లుంది. వాళ్ల మధ్య యీ కోపతాపానికి బహుశా మరొకటేదైనా కారణమై యుండవచ్చు, ఏమో ఎవరికెరుక?

దీర్ఘమైన ఒంటెల బారు వలయాకారంగా మోహరించింది. ట్రాఫిక్ బందైంది. వేడి దుర్భరంగా ఉంది.

మనిషీ, ఒంటె నువ్వెంతంటే నువ్వెంత అన్నట్లు ఒకళ్ల కళ్లలోకి మరొకళ్లు చూసుకున్నారు.

వాళ్ల కళ్లలో ఏదో తళుక్కున మెరిసి ఆరిపోయింది.

మనిషే జయించాడు.

గణగణమనే గంటల మ్రోతతో ఒంటెల బిడారు నగరంలోని వీధుల గుండా క్రింది కొస్తోంది. మనుషులనూ, ఆ జంతువులనూ కూడా, అస్పష్టమైన భావాలు వేధించాయి.

ఎత్తైన నలువాటాల భవనంలోని బాల బాలికలు త్వరలోనే గుంపుకు వెనకబడిపోయారు, ఇతర బాలబాలికలు వాళ్ల స్థానాన్ని ఆక్రమించుకున్నారు. గుంపు మాత్రం, ఎప్పుడూ తరక్కుండా, ఎప్పటికప్పుడు మారిపోతూ ఒంటెలబారు వెంట నడుస్తూనే ఉంది. జనం, ఆకురాలు కాలంలో చెట్లనుండి వేరుచెయ్యబడిన ఆకుల్లాగ, ఒకళ్లనొకళ్లు తాకుతూ, విడిపోతూ, వీధుల వెంటా, సందుగొందుల వెంటా అదృశ్యులవుతున్నారు.

వాళ్లందర్లోనూ గులాబి రంగు రిబ్బను కట్టుకున్న ఒక అమ్మాయి మాత్రం ఒంటెల బిడారుకెన్నడూ వెనకపడలేదు. ఆమె పరుగెత్తుతూ పరుగెత్తుతూ ఆగుతోంది; ఆగి, మళ్లీ పరుగెత్త నారంభిస్తోంది. ఆశ్చర్యంతో విప్పారిన ఆమె కళ్లు సంతోషంగా మెరుస్తున్నాయి.

"నీ పేరేమిటి?" అని అడిగాడు గాయిక్.

అతని వైపు చూడనైనా చూడకుండా "అన్నా" అని ఆమె జవాబిచ్చి, "మరి నీ పేరో?" అని ప్రశ్నించింది.

"గాయిక్."

వాళ్లు కలిసి నడవసాగారు.

"నీ కెన్నేళ్లు?" గాయిక్ అడిగాడు.

"పదమూడు" అందామె తన చూపును ఒంటెల బారు నుంచి మరల్చకుండా.

ఆ కుర్రాడికి పధ్నాలుగేళ్లు, కాని అతను తన వయస్సు పదమూడేళ్లే అని చెప్పాడు. వయస్సులో ఆమెను వెనక దిగవిడిచి తను ముందుకు దూసుకుపోవడం అతనికిష్టం లేకపోయింది.

ఒంటెలూ, కారూ ఒక రోడ్ల కూడలిలో శవయాత్ర సాగిపోయే దాకా నిలిచి పోవాల్సి వచ్చింది. ఇదే కనక శీతకాల మయ్యుంటే మనుషులు తమ టోపీలు పైకెత్తి గతించిన వ్యక్తికి గౌరవాభివందనం చేసేవారే, కాని యిది నడినెత్తి మాడ్చే వేసవి అయి పోయింది.

బిడారు యజమాని తన తెల్ల గొర్రెబొచ్చు టోపీని పైకెత్తడం మరచిపోయాడు. అతగాడు తన మాతృదేశపు ఆచారాలనూ, అలవాట్లనూ, మతాన్నీ చాల కాలంగా మరచి పోవడమే దీనిక్కారణమై యుంటుంది.

బ్యాండు మేళం విషాద గంభీరమైన పాట వాయిస్తోంది. అంతిమయాత్రలో ఉన్న కార్లు విచార సూచకంగా తమ హారన్లు ప్రమోగించాయి. పలువురు ఏడ్చారు, శోకన్నాలు పెట్టారు, శోకన్నాలు పెట్టారు, ఏడ్చారు.

ఒక్క క్షణం పాటు ప్రతి ఒక్కడూ తను నిస్సహాయుడన్నట్లూ, తనేదో నేరం చేసినట్లూ భావించాడు. అయితే యీ శ్మశాన వైరాగ్యం మరుసటి క్షణానికే మటు మాయమైంది.

"జాగ్రఫీలో నీకెన్ని మార్కులొచ్చాయి?" అని అడిగాడు గాయిక్.

"ఎక్సలెంట్" అని జవాబిచ్చి అన్నా చిరునవ్వు నవ్వింది.

వాళ్లిద్దరూ ఒకరి పట్ల మరొకరు ఎంతగా యిష్టాన్ని పెంచుకున్నారంటే, పరస్పరం మాట్లాడుకోవడానికి తడబడుతున్నారు.

"అన్నింటి కన్న ముందున్న ఒంటె అంటే నాకు బలే యిష్టం" అంది అన్నా.

"ముందున్న ఒంటె అంటే నాకు కూడా ఇష్టమే" అన్నాడు గాయిక్.

వాళ్లిద్దరి యిష్టాలూ ఒక్కటే, కాని అందుకని ఏం చెయ్యాలో వాళ్లకి బోధ పడలేదు.

"మనం పోయి ఒంటెను కౌగలించుకుందాం!" అంది అన్నా.

"పోయి దాని కాళ్లముందు సాగిల పడదాం!" అన్నాడు గాయిక్.

కాని వాళ్లు, అదీ చెయ్యలేదు, ఇదీ చెయ్యలేదు, మామూలుగా ఇది మనుషులు చేసేవి కాకపోవడమే యిందుక్కారణం.

"నాకా ఒంటె యజమాని అంటే ఎంత ఈర్ష్య కలుగుతోందో నువ్వూహించలేవు."

"నాకూను."

"కావాలంటే అతను తన ఒంటెను ముద్దుపెట్టుకోగలడు, లేక దానికి జీను కట్ట గలడు, అదీ కాకపోతే దాన్ని ఆకాశవుటంచుదాకా నడిపించుకు పోగలడు."

"అంతే అన్న మాటేమిటి, తను చెయ్య దలుచుకున్న దేదైనా చేసెయ్యగలడు!"

"ఇంత అందమైన ఒంటెని, యిన్ని చక్కని ఆభరణాలున్న దాన్ని నేనింతకు ముందెన్నడూ చూడలేదు" అంది అన్నా.

"జంతు ప్రదర్శనశాలలోనూ, సర్కస్‌లోనూ కూడా ఇంత అందమైన ఒంటెని చూడలేదు" అన్నాడు గాయిక్.

క్షణకాలం వాళ్లిద్దరూ ఒకళ్ల అస్తిత్వాన్ని మరొకళ్లు మరచిపోయి, తమ తమ సొంత మానసికోద్వేగంలో కొట్టుకుపోయారు.

తర్వాత గాయిక్ వార్ దగ్గర కెళ్లాడు. అతనా ఒంటెని తడిమాడు, బొచ్చు ఒత్తుగా ఉన్న దాని పార్శ్వాన్ని నిమిరాడు, తనకే ఆశ్చర్యం గొలిపే విధంగా ఓ పిడికెడు బొచ్చు అతని చేతిలోకి ఊడివచ్చింది.

అతను చేసిన పనిని ఒంటె యజమాని గమనించి, గాయిక్ వంక నేరస్థుని చూసి నట్లు తీక్ష్ణమైన దృక్కులు బరపాడు. దానితో ఆ కుర్రాడు నేరస్థునిలా కుంచించుకు పోయి, పారిపోయాడు.

అంత మూల్యం చెల్లించి తను సంపాదించిన ఆ సంపదలో సగాన్ని అతనా బాలి కకు యిచ్చాడు. తన హృదయంలో సగభాగాన్ని ఆమెకిచ్చేస్తున్నంత బెరుకుగా ఊపిరి బిగపట్టి మరీ ఆ బహూకరణ చేశాడు.

ఆ అమ్మాయి కూడా అమూల్యమైన ఆ బహూకృతిని, అతని హృదయంలో సగభాగమున్నట్లు గానే అంత బెరుకుగానూ, అంతగా ఊపిరి బిగపట్టే స్వీకరించింది.

ముసలీ ముతకా పిల్లాపెద్దా అందరూ వాళ్లని చుట్టుముట్టి మాకివ్వండి మాకివ్వండంటూ, ఆ అర్ధ హృదయంలో తనవాత్రాంశం కోసం ఎగబడ్డారు.

అలాగ వాళ్లిద్దరూ తమ భాగాలను వేలకొద్దీ భాగాలు చేసి పంచి యిచ్చారు. చివరికి వాళ్లకి ఒక్కొక్క కేశరాజం మాత్రమే మిగిలింది.

అంతలో ఆకస్మాత్తుగా యిద్దరు ముసలమ్మలు అక్కడికొచ్చారు. వాళ్లిద్దరూ వంగిపోయి ప్రశ్నార్థకపు గుర్తుల్లా ఉన్నారు. గాయిక్, అన్నాల దగ్గర మిగిలిన రెండు వెంట్రుకలనూ ఆ యిద్దరు ముసలమ్మలూ ఊడలాక్కుపోయారు.

ఆ పిల్లలిద్దరూ గాభరాగా ఒకళ్ల వంక మరొకరు చూసుకున్నారు. జరిగిన దంతా నిజమూ కలా కూడా అనిపించింది వాళ్లకి.

గంటలు టింగుటింగు మని మోగుతున్నాయి.

ఒంటెలు తరలిపోతున్నాయి.

గుంపు చెదిరిపోతోంది.

సూర్యుడు అస్తమిస్తున్నాడు.

వీధులూ, చౌకులూ ధూళిధూసరిత మయ్యాయి, ఇళ్లల్లోనూ, చెట్ల కిందా గాలి తేమగా తయారైంది. వందలాది యితర సాయంకాలాల్లాగే, ఆ సాయంత్రం కూడా వల్ల ముసుగు కప్పుకుంటోంది.

"ఒంటె వెంట్రుకే దొరికితే దానికి వంద రూబుళ్లైనా యిస్తాను!" అన్నాడు గాయిక్.

"ఒంటె వెంట్రుకే దొరికితే దానికి వెయ్యి రూబుళ్లిస్తాను!" అంది అన్నా.

"దాని కోసం ఏదైనా సరే యిచ్చేందుకు నేను సిద్ధం" అని గాయిక్ నిట్టూర్చాడు.

"నేను మాత్రం యివ్వనా!?" అని అన్నా నిట్టూర్చింది.

ఒంటె వెంట్రుకకి బదులుగా యిచ్చేందుకని తమ దగ్గర ఏమీ లేనందుకు వాళ్లిద్దరూ కుమిలిపోయారు.

ఒక సైనికదళం వీధి వెంట కవాతుచేసుకుంటూ పోతోంది.

ఇది కూడా ఆసక్తికరంగానే ఉంది.

ఒంటెలు వెళ్లిపోయాయి. బాల బాలికలిప్పుడు వీధికి అటూ యిటూ నిలబడ్డారు. వాళ్ల మధ్య తాత్కాలికంగా నిషిద్ధప్రాంతమొకటి ఏర్పడింది.

సైనికులు హుషారుగా పాట పాడుకొంటూ, చురుకుగా కవాతుచేస్తూ ముందుకు సాగిపోయారు. ఒక అమ్మాయి పూలగుత్తినొకదాన్ని వాళ్లపైకి విసిరింది. పువ్వులు వాళ్ల దాకా చేరకుండా పేవ్‌మెంటు పక్క పడిపోయాయి.

పూలను చూసి, సైనికులు మందహాసం చేసి, వరుస తర్వాత వరుసగా ముందుకు సాగిపోయారు. ఆ విధంగా వందలాది సైనికులు ముందు కెళ్లారు. చివరివాడు, నీలి కళ్ల యువకుడు వంగి పువ్వులు ఏరుకొని, ముక్కు దగ్గర పెట్టుకొని వాటి సువాసన ఆఘ్రాణిస్తూ, తన కామ్రేడ్ను వెనక పరుగెత్తాడు.

దానితో యిప్పుడిక నిషిద్ధప్రాంతం ఖాళీ అయింది.

"సైనికులు ఎక్కడికి పోయారబ్బా?" అంటూ అబ్బాయి ఆశ్చర్యపోయాడు.

"ఒంటెలెక్కడికి పోయాయబ్బా?" అంటూ అమ్మాయి ఆశ్చర్యపోయింది.

వాళ్లింతకు ముందెన్నడూ యింతగా దిగులు చెందలేదు. వాళ్లు ఒంటెల్ని ప్రేమించారు, ఒంటెలు కూడా తమని ప్రేమించాయని ఊహించుకున్నారు, పైగా అవి ఎప్పుడూ అక్కడే ఉంటాయనుకున్నారు.

కాని, మొత్తంమీద వాళ్ల అంచనా ఎక్కడో తప్పింది:

పిల్లలు బాటసారులను "ఒంటెలు ఏ పక్కకెళ్లాయి?" అని ప్రశ్నించి, వాళ్లు సూచించిన దిశగా త్వరిత గతిని సాగిపోయారు.

ఆ విధంగా వాళ్లు నగరపు పొలిమేర దాటి, నిర్జనంగా వున్న శివార్లలో ప్రవేశించారు. సూర్యాస్తమయమై చాల సేపైంది. తలల పైగా ఆకాశం అల్లంత ఎత్తున కనిపిస్తోంది. నాలుగు పక్కలా నిశ్శబ్దం, శాంతి తాండవిస్తున్నాయి.

పిల్లలు కొత్తగా దున్నిన పొలం దాటారు. అంత మట్టిని ఒక్క సారిగా, అటువంటి నీసలైన మట్టిని, పూల కుండీల్లోనూ, నగరపు చౌకుల్లోనూ ఉండే మట్టిని కాకుండా, అలాంటి సువాసన లెగజిమ్మే మట్టిని వాళ్లింతకు ముందెన్నడూ చూడలేదు.

రోడ్డు మూడు దిశలుగా చీలిన చోట ఒక ముసిలాడు నేల మీద కూర్చొని వున్నాడు. అతని కెంత వయస్సుంటుందో చెప్పడం కష్టమే. గాయిక్ మెల్లగా అతణ్ణి సమీపించి, "తాతా ఒంటెలెటెళ్లాయో చూశావా?" అని అడిగాడు.

"ఆఁ."

"ఎటెళ్లాయని?" అన్నా ఆతృతగా ప్రశ్నించింది.

"మొదటి రోడ్డు వెంట వెళ్తే వాటి దగ్గరికి మీరు మరింత తొందరగా వెళ్తారు. రెండో రోడ్డు మరింత దీర్ఘమైనది. మూడో రోడ్డు ఎక్కడికీ వెళ్లదు" అని చెప్పాడు వృద్ధుడు.

"మొదటి రోడ్డేది?"

కాని, వృద్ధుడు జవాబుచెప్పలేదు. అప్పటికే అతను గుర్రుపట్టి నిద్రపోతున్నాడు.

అందుకని వాళ్ళు, అది తమని తమ లక్ష్యానికి తీసుకెళ్ళదని తెలియక, ఏదో ఒక రోడ్డు పట్టుకొని బయల్దేరారు. చివరకి వాళ్ళు అలసిపోయి, చుట్టూ కలియజూశారు. వాళ్ళకొక కొండ, ఒక పొద, ఒక వాగూ కనిపించాయి. అదిగో, దూరాన....

"ఒంటెలు!"

వాళ్ళు సంతోషంతో ఒళ్ళు మరచిపోయి, కేకలేసుకొంటూ, ముందుకి పరుగెత్తారు. కాని వాళ్ళు కొన్ని అంగలు వేశారో లేదో అంతలోనే తక్కున నిలబడి పోయారు. అబ్బే, అవి ఒంటెలు కావు. పురాతన సైరీ దేశపు పురాతన పర్వతాలవి. ఓ పెద్ద పర్వతాల బారు దిఙ్మండలంలో యీ చివర నుంచి ఆ చివర దాకా పరుచుకొని వుంది.

ఏదైనా ఒక జాతిని అర్థం చేసుకోడానికి ఒక్క మనిషితో మాట్లాడితే సరిపోతుందా అని మిమ్మల్నెవరైనా ప్రశ్నిస్తే, ఆ మనిషి ఎవరన్న దానిపైన అది ఆధారపడి వుంటుందని బహుశా మీరు జవాబు చెప్తారు.

ఈ పుస్తకంలో సమకాలీన ఆర్మీనియన్ రచయితలు తొమ్మండుగురు మీతో మాట్లాడుతారు. వారు విభిన్న తరాలకు చెందినవారు, విభిన్న జీవితాలు గడిపిన వారు, విభిన్న రచనా శైలులను అనుసరించినవారు. వారి కథల్లోని పాత్రలు ఎంతో వైవిధ్యం కలిగినవి. ఈ రచయితలు తమ రచనల్లో తమ పరిసర ప్రపంచాన్ని కవితా దృష్టితోనో, లేక నాటకీయ దృష్టితోనో దర్శిస్తారు, పరిహాస దృష్టితోనో, లేక ప్రగాఢమైన మానసిక విశ్లేషణ దృష్టితోనో చూస్తారు.

ఇవిగో మీ ముందు తొమ్మండుగురు రచయితలు రాసిన తొమ్మిది కథలున్నాయి. అవన్నీ కూడా పురాతన సంస్కృతి కలిగి, ప్రస్తుతం తమకు తాము మనోమయమైన కొత్త జీవితాన్ని నిర్మించుకొంటున్న ఆర్మీనియన్ల చక్కని స్వభావాన్ని గురించీ, ధైర్య పాలను గురించీ, సాత్విక లక్షణాన్ని గురించీ చిత్రిస్తాయి.